సృజన

జులై 1979

93

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక

పుస్తక పరిచయం

తెలుగులో కవితా విప్లవాల స్వరూపం

కవిత

రోడ్డుమీద సూర్యుడు

మానవతా విలువలు: పోలీసు ఆందోళన

మాలోని మనిషివే మా మనిషివే

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

ఈ సంచికలో....

"మార్క్స్ దృష్టిలో సాహిత్యం" ఆర్. ఎస్. సుదర్శనం వ్యాసం
ఆగస్టు సంచికలో వస్తుంది.

త్రిపురనేని మధుసూదనరావు సమాధానం
సెప్టెంబరు సంచికలో వస్తుంది.

SRJANA is commended for use in Public Libraries in State by the Director of Public Libraries, Andhra Pradesh, H Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithru
Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

2
49
54
5
13
21
21
36
4
24
55
25
38
22
45
57
62
68
69

in th
, Hy
thrul
506 0

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మా స ప త్రి క

93

జులై 1979

ఏజెంట్లకు, చందాదార్లకు విజ్ఞప్తి

సృజన ఏజెంట్ల దగ్గర బకాయిలు బాగా పేరుకపోతున్నాయి. ఈ పరిస్థితి ట్లాగే కొనసాగితే సృజన నిర్వహణ ఇంక కష్టసాధ్యమైపోతుంది. మిగిలిన పాత పీలు పంపిస్తూ ఈ నెలవరకు అకౌంట్స్ సెటిల్ చేయవలసిందిగా ఏజెంట్లకు విజ్ఞప్తి స్తున్నాం. వాపసు పంపించకపోతే కాపీలు అమ్మినట్లే లెక్క. జులై ఆఖరు వరకు కాయిలు చెల్లించని ఏజెంట్లకు సృజన నిలిపివేస్తాం. ఈ విషయంలో సృజన పాత లు శ్రద్ధతీసుకొని ఏజెంట్లు బకాయిలు చెల్లించేలా చూడవలసిందిగా కోరుతున్నాం.

సృజనగానీ, సృజన ప్రచురణలు, సృజనవద్ద దొరికే ఇతర పుస్తకాలు గానీ పిపి ద్వారా పంపించే పద్ధతి రద్దుచేసాం. కాబట్టి సృజనగానీ, ఆయా పుస్తకాలుగానీ వలసినవారు ముందుగా డబ్బు పంపించి మాత్రమే తెప్పించుకోవాల్సి వుంటుంది. ్రతి పుస్తకమూ 5 కాపీలకు మించి ఆర్డర్ చేసేవారు సృజనకు 25%, విరసం ప్రచు ణలకు 20%, ఇతర పుస్తకాలకు 15% కమీషన్ మినహాయించుకొని ముందుగానే బ్బు పంపించాలి. రిజిష్టర్డ్ పోస్టు ద్వారా పంపించగోరేవారు పోస్టల్ ఖర్చులు మే భరించాలి.

దాదాపు రెండు వందల మంది చందాలు ఈ నెలతో పూర్తయినవి. తమ చందా ను రెన్యూ చేసి సృజనకు ఎప్పటివలెనో సహకరించవలసిందిగా కొత్త చందాదార్లను ధిక సంఖ్యలో చేర్పించవలసిందిగా కోరుతున్నాం.

—. సాహితీ మిత్రులు

ంవత్సర చందా 15 రూపాయలు ఈ సంచిక రు. 1-50 పైసలు

తుపాకులు కళ్ళు తెరిస్తే....!

— 'జనరల్, నీ ట్యాంకర్ చాల శక్తివంతమయిందే కానీ
దాన్ని నడపడానికి కూడ ఒక డ్రైవర్ కావాలి' — బ్రెక్ట్.

ప్రజల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం ఉపయోగిస్తున్న పనిముట్లు పోలీసులు— పోలీసులకు కూడ సమస్యలున్నాయి। ఆ సమస్యలివ్వాళ నోళ్ళు తెరిచాయి. హక్కుల్ని సాధించుకోవడానికి పోరాటాలు చేపట్టే ప్రజా సంఘాల్ని అణచేయడానికి ప్రభుత్వం ఉపయోగించే 'వ్యవస్థిత గూండాబలం' పోలీసు. ఇవ్వాళ ఆ పోలీసులు సంఘం పెట్టుకునే ప్రాథమిక హక్కును డిమాండు చేస్తున్నారు. పోలీసులు అంటే 'అణచివేత సాధనం', ఇవ్వాళ అణచివేతకు గురవుతున్నారు. పోలీసులు పాలక వ్యవస్థకు కళ్ళూ చెవులు— ఇవ్వాళ కేంద్ర ప్రభుత్వం కేంద్ర రిజర్వ్ పోలీసులను నమ్మడంలేదు.

ఎందుకు ?

పోలీసులు మనుషులు కూడ కాబట్టి. మరీ ముఖ్యంగా పోలీసులు కిందివర్గాల నుంచి, పేదవర్గాల నుంచి వచ్చిన ప్రజలు కాబట్టి. వలస పాలన కాలం నుంచీ వాళ్ళను అమానుషంగా మార్చేసే శిక్షణ రోజురోజుకూ పదునెక్కుతున్న వాళ్ళ జానెడు పొట్ట అవసరాన్ని మూరెడు లాఠీ, బారెడు తుపాకీ కూడ తీర్చడం లేదు కాబట్టి. ఖడక్ ఇస్త్రీ, కాకీ దుస్తులు కాకుల్ని కొట్టి గద్దలకు వేసే దర్పానికే పనికొస్తున్నాయి కానీ ఎస్పీ దొరగారి ఇంట్లో వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించడం లేదు. దొరగారి బూట్లు పాలిష్ చేయాలి, దొరసాని మైల బట్టలుతకాలి, దొరబాబును కాన్వెంటులో దిగబెట్టి మధ్యాహ్నం క్యారియర్ తీసుకపోవాలి. సాయంత్రం కాక్‌టెయిల్‌లో గార్డ్‌గా ఉపయోగపడాలి— రాత్రికి పక్కలు సర్దాలి.

రేషనుషాపుల్లో తమ పెళ్ళాలను క్యూలో నిలబెట్టాలి. బియ్యం, గోధుమలు లేవని షాపు మూసేసి బ్లాకులో అమ్ముకుంటే రెచ్చిపోయిన క్యూపై లాఠీచార్జ్ జరపాలి. టీచరూ, క్లాసు రూమూ లేని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిన కొడుకు చదువు కావాలని సమ్మెచేస్తే బాష్పవాయుప్రయోగం చేయాలి. తన వర్గంమీద ప్రేమ చూపి దోపిడీవర్గంపై పోరాటం ప్రకటించిన సోదరుణ్ణి కాల్చేయాలి.

తన కన్ను తన వేలుతో పొడుచుకోవాలి.

పోలీసులకూ మెదడుంది; అది ఆలోచించడం మొదలుపెట్టింది. పోలీసులకూ వ్యక్తిత్వముంది; అది వ్యక్తమవడానికి పెనుగులాడుతున్నది. పోలీసులకు ఒక వర్గమున్నది; అది తన ఉనికిని గుర్తిస్తున్నది.

పని గంటలు, జీతాలు, అలవెన్సులు, సెలవులు— ఇవి ఆర్థిక డిమాండులు సరేసరి. రాజకీయ నాయకుల, పోలీసు అధికారుల అహంకారాన్ని ప్రశ్నిస్తున్నారు వాళ్ళు. సంఘం పెట్టుకునే హక్కును డిమాండు చేస్తూ తాము సామాజిక జీవులమని తెలుసుకుంటున్నారు వాళ్ళు. ఎంతోకాలంగా పోలీసు యూనిఫామ్, క్రమశిక్షణ, శిక్షణ అణచివుంచిన మానవత్వం వాళ్ళలో మేల్కొంటున్నది.

పనిముట్లు మాట్లాడడం, మరయంత్రాలు తిరుగబడడం ప్రభుత్వాలకు చాల ప్రమాదం. అందుకే అడిగిందల్లా నోటికందించి అరదండాలు చేతులకు తగిలిస్తున్నారు. ముందునుంచి రాయితీల ఎరచూపి వెనుకనుంచి బాయొనెట్లు గురిచూస్తున్నారు. మరీ తెలివిమీరిన వాళ్ళు సంఘం పెట్టుకోవచ్చు కానీ సమ్మె చేసే హక్కు లేదంటున్నారు. టోపీ కింద తలనుగుర్తిస్తాం కానీ తల ఆలోచించడం నేరమంటున్నారు. కడుపాకలిని నోరు అడుగకూడదంటున్నారు. రాజకీయ ఉద్యమాలను అణచేయడానికి, రాజకీయ ప్రత్యర్థులను జైళ్ళలో కుక్కడానికి, కాల్చేయడానికీ ఇంతకాలమూ పోలీసులను వాడుకొని ఇవ్వాళ పోలీసులకు రాజకీయాల ప్రమేయం వద్దంటున్నారు.

న్యాయవిరుద్ధమైన ఆజ్ఞలను ధిక్కరించాలని పోలీసులకు విజ్ఞప్తి చేసిన జె. పి. అనుయాయులు, అటువంటి ప్రజాస్వామిక భావాలకు చాంపియన్లుగా పోజుపెట్టి ఎమర్జెన్సీ హీరోలుగా అధికారంలోకి వచ్చి ఇవ్వాళ పోలీసు ఆందోళనను అణచేయడానికి అరెస్టులు, బర్తరఫ్‌లు, కాల్పులు, కర్ఫ్యూలు, కూపీలు, వడపోతలు ఏపీసంవోక పి.డి. చట్టం మళ్ళీ తెస్తామంటున్నారు. మా అణచివేత విధానం ఎమర్జెన్సీలాగా వుండదు, మొరార్జీ పి.డి. ఐ జి. మీసాలాగుండదు— ఇది ఆపరేషన్ జనతా స్టైల్ అని శాఖాహార పులులవలె గర్జిస్తున్నారు.

జానకి తాడు అంటించినట్లుగా కేంద్రరిజర్వు పోలీసుల ఆందోళన పోలీసుల ఆందోళన కన్నా కూడా ఉధృతమయింది. ఢిల్లీ సమీపంలో ఝరోడా కలాన్‌లో సి ఆర్ పి, బొకారోలో కేంద్రపారిశ్రామిక భద్రతాసిబ్బంది అసమానమైన ప్రతిఘటన ప్రదర్శించడమే కాదు కర్ఫ్యూను, కాల్పులను ఖాతరు చేయకుండ పోరాటం కొనసాగిస్తున్నారు. ఇవ్వాళ ఎక్కడా ఆయుధాగారాల రక్షణ సి ఆర్ పి చేతుల్లో వదిలి కంటినిండా నిద్రపోయే పరిస్థితిలేదు ప్రభుత్వానికి.

బొకారోలో పారిశ్రామిక భద్రతా సిబ్బందిమీద కాల్పులుజరిపి ఇరవై నలుగురినో, ఇంకెందరినో కాల్చేసిన సైనికులు ఏ తల్లిబిడ్డలు? విదేశీ మత్తుమందుల నిషా

వదలి ఆలోచిస్తే తామూ ఈ దేశంలోని కార్మిక, కర్షకుల బిడ్డలమేనని తమ కాళ్ళల్లో చిందిన రక్తం తమరక్తం పంచుకొని పుట్టిన వాళ్ళదేనని కళ్ళుతెరుస్తారు.

పోలీసుల ఆందోళన గురించి నీవేమనుకుంటున్నావని ఆదిలాబాద్ జిల్లాలో ఒక కార్మికుణ్ణి అడిగితే 'వాళ్ళనణచడానికి సిఆర్‌పిని తెస్తారు సిఆర్‌పి కూడ ఆందోళన చేపడితే సైన్యాన్ని తెస్తారు. సైన్యంకూడ తిరగబడితే విదేశాలనుంచి సైన్యాలను తెస్తారు' అన్నాడు। కాని ఎక్కడిసైనికులైనా కిందివర్గాల వాళ్ళేకదా.

ప్రజల్ని, ప్రజాకార్యకర్తల్ని కాల్చేసిన పోలీసులు, పోలీసులను కాల్చేసిన సైన్యం ప్రజాశత్రువులను అధికారంలో వుంచడానికి అన్యాయమైన ఆజ్ఞలను క్రమ శిక్షణ పేరుతో అమలుచేస్తున్నామని అర్థంచేసుకున్ననాడు, ప్రజాపోరాటాలకు వ్యతిరేకంగా లాఠీలనెత్తడానికి, తూటాలను ఖర్చుచేయడానికి సుతరామూ అంగీకరించని నాడు పోలీసు, సైన్యంలోని కిందివర్గాలవాళ్ళు తమ పుట్టిల్లును పోల్చుకున్ననాడు ప్రజలు వాళ్ళలో పోల్చుకోకుండా నిప్పుకప్పిన మానవత్వాన్ని పోల్చుకుంటారు.

28-6-79

— సంపాదకుడు

అవును, అతడూ మనిషే

పుట్టినపుడు అతని పేరు మనిషి
పెరిగినపుడు అతని పేరు మనిషి
పొట్టకూటికి పోలీసు నౌకరీలో చేరగానే
అతనిపేరు లాఠీ, జైలు, వ్యాను, తుపాకీ

అతని పిల్లలకు కూడ భయం చెప్పడానికి
అర్భకురాలైన తల్లికి పనికొచ్చే బూచి
తోటి పిల్లలతో కలిసి తన పిల్లలు కూడ
గేలిచేసే, రాళ్ళు విసిరే టార్గెట్

బూట్ల డెక్కల చప్పుళ్ళు సమసి
కడక్ డ్రెస్‌ల కరకరలు నలిగి
పాదాలు నేలను, నిజ శరీరం గాలిని
తాకినపుడు అతడు మనిషి

స్త్రీకి ప్రేమను
పిల్లలకు మమకారాన్ని పంచిచ్చే
కుటీరంలో అతనిలో జీవాణువులు
స్పందించినప్పుడు
కాకీదుస్తులు నిర్జీవంగా
చూరుకు వేళ్ళాడుతుంటాయి

ఆకలిని గుర్తించినపుడు అతడు మనిషి
అధికారాన్ని ప్రశ్నించినపుడు
అతడు మనిషి
తన వాడలో, తన వూళ్ళో
తన వాళ్ళలో వున్నపుడు అతడు మనిషి
తనవాళ్ళెవరో కానివాళ్ళెవరో
కళ్ళు తెరిచినపుడు అతడు మనిషి.

— వరవరరావు

నవల - సీరియల్ :

కొలిమంటుకున్నది

అల్లం రాజయ్య

(గత సంచిక తరువాయి)

24

కరకర పొద్దు పొడిసింది. మొగులు నెత్తురు పులుముకున్నది. సీకటి జేల్ల నుంచి భూమితల్లి సలాకలు ఇరుగ్గొట్టుకొని బయటపడి ఎలుగుల ఒళ్లిరుసుకున్నది- తాళ్లతోపుల సిలుకలు రెక్కలు తపతప కొట్టి పొద్దు పొడుపును పొగిడినయ్. సెట్ల మీన పచ్చులు గుంపులు గుంపులుగా లేసి ఆకసంల కెగిరినయ్.

బీదోల్ల గుడిసెల మీన్నుంచి, నెత్తుట్ల తడిసిన బజాట్ల మీన్నుంచి, దొర బంగుళ మీన్నుంచి, దొర పడారి గోడల రెట్టలిరిసి కట్టేయబడ్డ బీద రైతుల మొఖాల మీన్నుంచి ఎండపొడ నవ్వుతంది-

బాలమల్లు అవులించి లేసి కూకున్నడు. పక్కబల్లమీనున్న చత్వారపద్దాలు కండ్లకు బెట్టుకున్నడు- గూట్లె యాప పుల్లందుకొని అక్క అవుతలికి బోయిండు-

“గీ దెబ్బతోని కూలి లంజకొడుకుల మదమనిగినట్టే- కాపోతే దొరతోనేనా పరాసికం- గిదెప్పుడో సెయ్యాల్సింది- ఆలిశ్యమైన అవ్వల్దర్జగయ్యింది. ఊరుకు మర్నగాలం పుట్టిందా? గుడిసెల్ల ఎవడున్నట్టు లేదు- మట్ల మీద గొడ్లు ఒర్లుతన్నయ్- ఆకిల్లు పాడుబడుతన్నయ్- ఎవతి లేసి అలుకు జల్లనట్టున్నది. ఆడి ముండలకు సుత మదమెక్కింది బంచత్- పొద్దు పొడిసేదనుక మంచాల మీన్నుంచి లేత్తలేరు. దొరసాండ్ల సిరచ్చింది-” గిట్ల ఇసారిచ్చుకుంట వాగుతొవ్వ బట్టిండు-

ఎవలో ముసలోడు భూమి మీనికి అంగిపోయి ముంత సేతబట్టుకొని కట్టె పొడు సుకుంటత్తండు-

ముసలోడు బాలమల్లు ముంగటికచ్చిండు-

“ఏందిరో భూమా! కండ్లు గన్పడతలేవా? మదమారా! దూరం నుంచి నడువ్ బంచత్” అన్నడు కోపంగా-

ముసలయ్య కట్టె బిగ్గిత బట్టుకొని మెడెత్తి కుడిసెయి నొసలు కడ్డం బెట్టుకొని బాలమల్లును తేరిపార జూసిండు-

సూసి మొఖం మాడ్సుకొని కాండ్రికిచ్చి ఊంచి నడుక సాగించిండు-

"హన్నా- ముసలోనికి పొగరు బగ్గనే ఉన్నది- తన్ను తందునా బంచత్-" మీనిమీని ఉరికిండు.

"అందరి పొగరు అణిసేటందుకు కాలం రావాలెనయ్యా!" ముసలయ్య ఆగకుంట ఎల్లిపోయిండు.

బాలమల్లు తుపుక్కున ఊంచి, కిరకిర పండ్లుదోమి ముంగటికి వడిసిండు- ఎండపొడ కండ్లమీన బడ్తుంటె తూరుపుకెల్లి సెయ్యడ్డం బెట్టుకొని సూసిండు- సూసినోడు సూసినట్టుగనే కండ్లు నిలబడిపోయి నిలుసున్నడు.

ఆగుల నుంచి అగొడ్డుమీనికి మనుషులు ఎక్కుతండ్లు- ఒక్కడుగాదు ఇద్దరు గాదు, ఏలు- సేతుల్ల గొడ్డండ్లు, గుతుపలు, ముల్లిగట్టెలు, తలలకు రుమాల్లు.

బాలమల్లు గుండాగిపోయింది- ఎనుకకుమర్రి గడిలబడేదనుక ఉరికిండు.

ప్రతాపరెడ్డి పులితోలు కుర్సిల కూకున్నడు- తుప్పతుప్ప ఊంచుకుంట సెడ ఘాసుమాటలు తిడ్తుండు- పట్లగట్టేసిన సర్సింహం లతిమ్మ రైతుల్ల శరీరాలు ముల్లు గుచ్చ సందులేకుంట పికిలిపోయినయ్- జనప కట్టు తాళ్ళమీన నీల్లు బోసిచ్చిండు- కట్లు బిగుసుకొని నెత్తుర్లు కార్తున్నయ్- ఒళ్ళంతా నెత్తురు గడ్డకట్టి ఒకటే మంట- మీనికెల్లి దొర తిట్లు.

"ఐపోయింది- అంతా అయేపోయింది" బాలమల్లు ఎగపోసుకుంట సెప్పిండు.

"సరిగ్గ సెప్పి ఏడువు-"

"మంది దొరా! మంది."

"కలువరిత్తన్నవా? నాత్రి తాగింది దిగలేదా?" దొర సవ్విండు.

"ఎక్కడి మందో! సీమలపుట్ట బెదిరినట్లు, ఉసిల్లెల్లినట్టు- మనూల్లె కత్తండ్లు దొరా!" బాలమల్లు ఎనుక కెనుకకు సూసిండు బెదురుగొడ్డోలె- పొద్దుగాలపొద్దుగాలనే పెయ్యంత సెమటకు తడిసిపోయింది.

దొర ఉలికిపడ్డడు- మీసాలదిరినయ్- మొఖంలో కోపం జాగలో భయం- గుడిసేసే- కుర్సిల నుంచి లేసిండు- బంగులెక్కిండు- బంగుళ మీన్నుంచి పార సూసిండు.

ఊరు పక్కకు ఉసికేత్తే రాలకుంట జనం....

ఎనుక బాలమల్లు సేతులు పిసుక్కుంట పిస్సలబడిపోయి నిలుసున్నడు.

"నడువ్– నాత్రి తాగి ఏడ పన్నరో లంజకొడుకులు సిదిమెల తయారుజెయ్య్– ఇగో నువ్వో తుపాకందుకో ! పెద్దరువాజ మూయించు– ఎంత మందచ్చినా నారోమం పీకలేరు. ఎంతమంది నచ్చినా ఎనుకకు మర్రి సూసేది లేదు– లంజకొడుకుల పిట్టల గాల్చినట్టు కాలుత్తా. ముకుందరెడ్డి, గౌరయ్య జాడా పత్తాలేదు నాత్రి బొయినోళ్ళు" బరండి కీనందుకున్నడు– తుపాకి లోడు సేసుకున్నడు– కిటికీ తెరిచిండు.

జనం కదిలిండ్లు– మాదిగిండ్లల్ల నుంచి జనం కలిసిండ్లు– దప్పులు, సేతుల్ల కట్టెలు, గొడ్డండ్లు–

దొర కిటికీ మూసిండు.

వాడలు దద్దరిల్లేటట్టు అరుపులు, కేకలు, మొత్తుకోల్లు– దడదడ దప్పులు, ఈలలు–

ఇల్లిల్లు కదిలింది– మాలేశగ బతికేటోనికానించి కూలోడు, బీదోడు బక్కోడు దండుల గలిపింది. దండు గదిలింది. సెంద్రయ్య ముంగటున్నడు. ఎనుక ఆనంద మున్నడు– ఎవదో సడిమందిల ఎర్ర రుమాలు పేగు కట్టెగ్గట్టుకొని ఎత్తి పట్టుకున్నడు–

ఎడ్డి బానరికి పూనకమచ్చినట్టుక సంకకు దప్పేసుకొని కాళ్లిరిగి బోయేటట్టుగ ఎగురుకుంట– సేతుల సిర్ర ఇరిగి పోయేటట్టు కొట్టుకుంట– "దొరోని మదం అంచాలె" నని గొంతిక తెగిపోయెటట్టుగ అరుత్తండు.

రాజెల్లి దేవుడచ్చిన దానితీర్గ ఎంటికలిరబోసుకొని ముంగట ఉరుకుతంది– పల్లికాంబ పిడికిల్లు బిగిచ్చి అరుత్తంది– "గడిల మనుషుల ఇడిసిపెట్టాలె–"

అల్ల కాళ్ల దుమ్ము ఆకసంల కంట పొగతీర్గ లేత్తంది– పెఢీ పెఢీన కేకలు–
దండు మూడు పానాదుల కాడికచ్చింది–
సెంద్రయ్య మొండి గోడమీని కెక్కిండు–
"దొరల జులుం – నశించాలె–"
"దున్నేటోనికే – భూమిగావాలె"
"పట్టుకున్న రైతుల – ఇడిచి పెట్టాలె"
"షికాలు, కౌంస్కీత్తాలు– పరంపోగులు– పంచాలె"
"రైతుకూలి సంఘం – వర్ధిల్లాలె–"
బొత్తయ్య బొంగురు గొంతికతోటి.
"ధాయపోశాలు–" అరిచిండు–

సెంద్రయ్య "అపరుహై" అన్నడు. జనం మొత్తుకున్నరు– ఎడ్డిబాసడు పూనకం ముదిరి పోయింది– బొచ్చె ఎగిరి పడంగ ముంగటి కురికిండు–

"ఎట్టిపనులు– రద్దుగావాలె" అరుపులు, కేకలు– మళ్ల దండు కదిలింది. వాడ వాడలు తిరిగింది–

గడి ముంగటికచ్చి ఆగింది–

పెఢీ పెఢీన అరుపులు, కేకలు–

"రైతుల విడిచి పెట్టాలె–"

"దున్నేటోనికే భూమి–"

"రాయపోశాలును సంపిన దొరోడు దిగిరావాలె–"

గడిల నర్సింహం అరిచిండు "దున్నేటోనికే భూమి." గడి బయట జనం అందుకున్నరు, మల్లికాంబ గిదగిద తలుపులకాడి కురికింది–

"ఓరి దొరోడా ! సిగ్గు శెరం లేకుంట తలుపులు మూసు కున్నావురో ! కుక్కా నాత్రి మందిని తోలిచ్చినట్టు గాదు. దిగిరా ! దమ్ముంటే దిగిరా !" బద్దిలింగయ్య–

"నీయిల్లు గాలగదరో దొరోడా ! నీపీన్గెల్లగదరో దొరోడా !" రాజెల్లి తిట్ల సాతకాక ఏడుత్తంది.

మదునమ్మ మట్టితీసి సాపిచ్చుకుంట తూర్పార బడుతంది.

పొట్టి గుండయ్య గిదగిద ఉరుకచ్చి తలుపుల తన్నిండు.

"దొరోడా ! మాటమాటకు తప్పని పంచాతులు బెట్టి తలె ముంతలమ్మిత్తివి గాదురా ! బర్రెనమ్మి కట్టిన దండుగు– అవునమ్మి కట్టిన దండుగు. మాటకు పది రూపాలు దంచి పుచ్చుకుంటివి గాదురా ! కక్కు– లంజకొడుక తీసుకున్న దండుగులు కక్కు !"

"మూడేండ్ల పెట్టుబడి ఎగబెడ్తివి గాదురో !" పాలేరు మొందోడు– పండ్లు గొరికిండు.

"గుంజుకున్న మా భూములు మా కియ్యి."

"దండుగుల్ కక్కు."

"ఎగబెట్టిన పెట్టుబళ్ళు కక్కు."

గడి పొంచున్న పెద్దపులి తిర్గున్నది– సడీ సప్పుడు లేదు– ఏప సెట్టుమీని పిట్టలు లేసిపోయినయ్.

జనంలో గుసగుసలు.... తర్జన భర్జనలు....

బొత్తయ్య పెద్దరువాజ నెగబాకిండు.

బంగుళ కిటికీ తెరుచుకున్నది- రివ్వు రివ్వున రాళ్ళు- గూనపెంకలు బొల బొల మొత్తుకున్నయి-

అరుపులు, ఈలలు,-

తుపాకి పేలింది- పెద్దరువాజ మీని బొత్తయ్య కింద బడ్డడు. ఎడం పెయ్యి దండ నుంచి బొలబొల నెత్తురు కారింది-

అరుపులు మిన్ను ముట్టినయ్. ఎవలో పేగులు తెగిపోయేటట్టు ఏడుత్తండ్లు- ఎవలో కంఠం పగిలిపోయేటట్టు తిడుతండ్లు-

పొరుగూరి సంభయ్య తలుపులు ఎగబాకిండు- మల్లా తుపాకి మొరిగింది- సంభయ్య కిందబడి గిలగిల తన్నుకొని పాణమిడిసిండు-

ఎక్కడినుంచచ్చిండో గుడ్డిగట్టయ్య

"సూత్తరేంరా! మీకండ్లు పత్తత్తులు కాంగ సూడుండ్రి- ఆడు మీన్నుంచి టుపాకినేసి అందరిని సంపుతడు- మీసేతులు పడిపోయినయా? దరువాజలు తలుపులు తవ్వండ్రి-" గుడ్డిగట్టయ్య సేతుల కట్టెత్తి పిచ్చిలేసినోని తీర్గ తలుపులు గొట్టిండు-

గొడ్డండ్లు లేసినయ్. కర్రలు లేసినయ్. ఫెళ-ఫెళ మట్టిపెళ్ళలు కూలు తన్నయ్. గడ్డపారల ఖనేల్-ఖనేల్- ఎన్నేండ్ల పాతగోడో! ఎన్నేండ్ల తలుపులో-

తలుపులు ఇరిగినయి - గోడలు కూలినయి-

జనం కదిలిండ్రు- ఈలలు, కేకలు-

గడిలోపల సొచ్చిండ్లు- తుపాకి పేలుతనే ఉన్నది- పోరగండ్లు, ఆడోల్లు, ఎక్కడోల్లు గింత మంది?

ఎవడు సత్తండో ఎవడు సూసేటట్టులేదు-

బొత్తయ్య ఉరుకుతండు. సెంద్రయ్య ఉరుకుతండు.

ఎడ్డి బానడు పులితోలు కుర్సి కీలు కీలు ఇరిసిండు- మందిలిసిరేసిండు- కసపిస తొక్కిండు- ఎడ్డిబానడు పులితోలు పండ్లతోని పట్టి పీకుతండు- పంబాలోడు గొర్రె పిల్లను గావుపట్టినట్టు-

నర్సింహం తతిమ్మకట్లు గోసిండ్లు- కుర్సీలు ఇరుగుతన్నయి- మెగురాలు పీకుతండ్లు- పూలసెట్లు పీకిండ్లు- పరధాలు సినిగినయి- ఇంకా అయిదంటే అయిదే నిమిషాలైతే-

కాలం ఆగిపోయింది- బజాట్ల బరుర్రిబరుర్రిన జీపుల సప్పుడు- మైకుల ఎవలో మొత్తుకుంటాండు, కాకి బట్టలోల్లు రానే అచ్చిండ్లు-

"జేగర్తా ఒక్కడు కదిలిండంటే బతుకడు." మైకులనుంచి

జనం ఆగిపోయిండ్లు- పోలీసోల్ల తుపాకులు జనం రొమ్ము బొచ్చెల్లకు గురి సూసున్నయి

బంగుళ మీన్నుంచి తుపాకీ కాల్పులు ఎక్కువైనయి. జనం పిట్టలతీర్గ కింద బడుతండ్లు-

మల్లికాంబ గిదగిద పోలీసోల్ల జీపుకాడికురికింది- "వాన్నాపుమను- నీ కండ్లు కాకులు గద్దలు బొడువా! తుపాకి గ కిరికికి గురిపెట్టి కాల్వు సాతగాదా! ఇద్దేనాకియ్యి అన్నా లెంగ సంపుతండు"

డి. యస్. పి మాట్లాడలేదు- మల్లికాంబ ఆడికీడికి ఉరుకుతంది- జనం మొత్తుకుంటాండ్లు- ఎటోల్లటు ఉరుకుతండ్లు- ఎటూరికినోడు మళ్ల ఆడికే అత్తండు.

కిటికీల తుపాకీ కాల్పులాగిపోయినయి-

పోలీసోల్లు కింద దునికిండ్లు- మల్లికాంబను పట్టుకున్నరు.

జనంకు అంతా సమఝయ్యింది. ఉరుకులు పరుగులు-

దొరికినోడు దొరికిండు. దొరుకనోడు ఉరికిండు

కాసేపటికి- లొల్లి మగ్గింది-

పోలీసోల్లు ముసలోల్లు, ముడిగోళ్లతోటి ఆడోల్లతోటి వ్యాన్లు నింపిండ్లు-

దొర మీసం దిద్దిండు-

25

ప్రతాపరెడ్డి లొల్లి మగ్గినంక గిదగిద ఉరుకచ్చి డి. యస్. పి నవనీతరావుతోని అలాయి బలాయి తీసుకున్నడు. నెత్తిమీన ముసుగు లేసుకున్న పట్వారి గౌరయ్య, మాలిపటేల్ ముకుందరెడ్డి వ్యాన్ల నుంచి కిందికి దిగిండ్లు- నెత్తురు కారే కొసఊపిరు నోల్లను, సచ్చినోల్లను కుప్పేసుకున్నరు-

ప్రతాపరెడ్డి వ్యాన్ల మందిని పరకాయించి సూసిండు- కండ్లు పుల పొడిసిండు మొఖం మాడిపోయింది- నర్సింహం, బొత్తయ్య, పెంద్రయ్య, ఆనందం, గిట్లా

తనకు కావాల్సినోల్లు దొరుకలేదు— ప్రతాపరెడ్డి గుండెలు దబడ దిబడ గొట్టుకున్నయి. ముచ్చెమటల్ పోసినయి.

జీపులు కదిలినయి వ్యాన్లు కదిలినయి.

అంబటాల్లయ్యింది— వ్యాన్లో మల్లికాంబ నిలుసున్నది. మల్లికాంబ సేతులకు బేడీలేసిండ్లు— మల్లికాంబ మొఖంలభయం భీతిలేదు—

"రెడ్డిసాబ్ డర్‌నామత్ ఈడ ఇరువైమంది పోలీసోల్ల నుంచుత— సాయంత్రం వరకు స్పెషల్ పోలీసుల పంపిస్త— ఏలైతే నేనూవస్తా—"

ప్రతాపరెడ్డి పిచ్చి చూపులు చూసిండు—

"మాకేలవుదోంకో—" నవనీతరావు మాట పూర్తి సెయ్యక ముందే దొర అందుకున్నడు—

"ఇన్నూరు మందచ్చిన గీ ఊళ్లే ఉండలేం— మీరే అందకుంటే ఇయ్యాల్టితోని నాపని ఆఖరే— మినిష్టరుతోని మాట్లాడ్త— ఈల్లందరిని కొర్తికేపిత్త—"

నవనీతరావు తలవంచుకొని టోపితీసి గోక్కున్నడు—

వ్యాన్ల మల్లికాంబ గొంతిప్పింది.

"దున్నేటోనికే భూమి—" మిగతా కంఠాలు జతకలిసినయి. నవనీతరావు డ్రైవరుకు సైగచేసిండు.

జీపు కదిలింది— ముకుందరెడ్డి కండ్లు నిలబడి పోయినయి— పట్వారి కూలబడి పోయిండు—

వ్యానులు వాడలు తిరుగుతన్నయి—

ఏడినుంచచ్చిండో గుడ్డిగట్టయ్య కట్టె పొడుసుకుంటచ్చిండు— ఒళ్లంత నెత్తురు ముద్దతీర్గున్నది. వ్యాను ముంగట సేతులడ్డం బెట్టినిలుసున్నడు. వ్యాను ఆగింది. పోలీసోల్లు తుపాకు లెక్కుబెట్టిండ్లు—

"సంపుండ్లిరా ! సంపుడ్లి ! గీ రాజ్జెంల బీద లంజెకొడుకులుండ కుంట సంపుండ్లి— ! కట్టంల మేముంటే మమ్ముల్లాదుకుంటరా ! దొరకు సాయ మచ్చిండ్లు ! ఊరును శెపాల పెంటజేసి పోతండ్లు ! అరేయి— గింత గాసునూనెబోసి అగ్గి తల్గ బెట్టి పోండ్లి ! అవ్వా ! రాజెల్లవ్వా ! మల్లవ్వా ! వారీ ! సమ్మన్నా ! పిలక బొందయ్యా ! పోండ్లి బిడ్డాపోండ్లి గొడ్లగాసుడు తప్పుద్ది ! తన్నులు గుద్దులు తప్పుతయి. నీ బాంచెన్ ! నీ కాలుమొక్కుత—?" గుడ్డిగట్టయ్య వ్యానువెంట నికనికలు పడుకుంట ఏడుస్తాండు—

నవనీతరావు జీపచ్చింది—

"ఎందుకాపిండ్లు— ముసలోన్ని ఎక్కియ్యండ్లి. నడు బంచత్—" గట్టయ్య నెత్తిమీన పిస్టల్‌తో పోటు పొడిసిండు.

గట్టయ్య కింద పడ్డడు. పన్ను సేతుల్లకు దీస్కొని లేసిండు ఏం రాజ్జెం— సావు రాజ్జెం— దొరలరాజ్జెం దొంగలరాజ్జెం— ఇగో పిరికెడు పన్ను దీసుకొని కొడు తన్న— గీ రాజ్జెం గంగల కలుత్తది. మీబల్జెం— దుట్టుతనం గోదాల్ల కలుత్తది. అరిఘోష పుచ్చుకుంటాండ్లు— మీకు గిప్పుడు తుపాకులున్నయ్. బక్క సక్కోల్లను అదిరిచ్చుక బెదిరిచ్చుక రాజ్జెం నడుపుకత్తండ్లు— మెగోలైతె గీడ దున్నెటోల్లకు భూములిప్పియ్యండ్లి! కట్ట పడ్డోనికి కంకెడు కూడు దొరికేటట్టు సెయ్యండ్లి— అట్ల సాతగాదో నా సేతికి తుపాకు లియ్యండ్లి—"

"మాదెర్ సోతు— ఎక్కు—" అమీన్ సాగర్ రెడ్డి గట్టయ్య డొక్కల తన్నిండు.

లబలబ మొత్తుకోంగ గుడ్డిగట్టయ్యను వానెక్కిచ్చిండ్లు—
గుడ్డిగట్టయ్య ఇంకా వదుతతూనే ఉన్నడు—
పోలీసోడు పోటు పొడిసిండు— నోట్లెనెత్తురూరింది.
"నక్సలైటు నాకొడుకా నోరుముయ్యి" నవనీతరావు.

"కొడుతరు. ముసలోల్లను ముడిగోల్లను సంపుక తింటరు— నివద్ది అన్నోడు నచ్చలేటు— నోట్లే నాలికలు బీకుండ్లి— మాకండ్లల్ల కనిపాపలు పొడుపుండ్లి— మీరేం జేసిన సూడం— మాట్లాడం— గిదంతెందుకు? ఆకలిగాకుంట మాకడుపులు కోసెయ్యండ్లి ఓ పెద్దొరా!"

వ్యాన్లు కదిలినయి— బర్రిబర్రిన దుమ్ము లేపుకుంట—

గుడ్డిగట్టయ్య నోట్లె నుంచి నెత్తురు కార్తంది. కుడిసేత తుడుసుకున్నడు. సెయ్యంత నెత్తురే— ముడ్డిపేగు సింపి నెత్తురు రాసిండు—

"ఎర్రజెండా నెగిరేత్తం" గొంతికే తెగిపోయేటట్టు అరిసిండు—

నెత్తురంటిన గుడ్డపేగు లేతెండలో రెపరెపలాడుతుండంగ, వాన్లు, జీపులు ఊరు దాటినయి—

పెండ్లాం పిల్లలతోని ఊరిడిసి పోయేటందుకు ప్రతాపరెడ్డి, సామాన్లు సదురుకుంటండు—

పొద్దెక్కుతన్నది— అంతకంతకు ఎండ తీవ్రమయితంది ఎండలో ఊరంత ఎర్రగా మండి పోతన్నట్టుగా కనిపిత్తంది.

కొలిమంటుకున్నది

పరిచయం :

తెలుగులో కవితావిప్లవాల స్వరూపం

ఎస్.వి.ఎస్. రావు

విశ్వ విద్యాలయాల నుండి వెలువడే పి.హెచ్.డి. థీసిస్సులన్నీ సర్వ సాధారణంగా గ్రంథాలయాల చెదపురుగుల మధ్య విశ్రాంతి తీసుకుంటూ కొన్ని తరాలపాటు పిల్లల్ని కంటాయి. అలా కాకుండా వెల్చేరు నారాయణరావుగారి పరిశోధనా గ్రంథం శ్రామిక ప్రజల కోసం కవిత్వం రాస్తున్న విప్లవ రచయితలకు ప్రమాణ గ్రంథం కాబోతుందనడంలో అతిశయోక్తి లేదు. అభ్యుదయ కవిత్వం అవతరించి అర్ధ శతాబ్దం కావస్తున్నా సాహితీపరులు యిన్నాళ్లగా ఎదురు చూసిన సిద్ధాంత గ్రంథం లభించిందనే తృప్తి కలుగుతుంది పై గ్రంథం చదివేక. అందుకు కారణం అవకాశవాదులు, పరమఛాందసులు మినహాయిస్తే సామాన్యప్రజల జీవిత వాస్తవికతే కవితా వస్తువు కావాలని, వారి కందుబాటులో ఉండే రూపంలోనే కవిత్వం ఆధునిక యుగంలో కొనసాగాలనీ దృఢంగానమ్మే యువకవులు, పాఠకులు సహితం శిల్పంలోనూ, సాహిత్య విమర్శలోనూ దాదాపు పురాతన సాంప్రదాయాల ప్రభావం నుండి బయట పడలేక పోతున్నారు. సాహితీరంగానికి యుగపురుషుడైన గురజాడ యాదృచ్ఛికంగానో ఉద్దేశపూర్వకంగానో సూచించిన కవితారీతిని కాలదన్నుకొని భావకవిత్వం ఊబిలో దిగబడిన నవ్యాంధ్ర కవిత్వాన్ని శ్రీశ్రీ పునరుద్ధరించిన తరువాత కూడ తిలక్ చెప్పినట్లు 'నిర్వచనం లేని కవితా కంటక వనాంతరాలు' దారినే పయనించడం వలన కవిత్వం ఏ తరహాకు చెందినదైనా మధ్యతరగతి విద్యావంతుల మధ్యనే చెలామణి అవుతోంది. ఇటీవల వెలువడిన వచనకవిత మధ్యతరగతి పాఠకలోకం దృష్టిలో కూడ ఆమోదం, అవగాహన పొందలేక పోతుంది. స్వానుభవం ద్వారా యీ సత్యాన్ని గ్రహించిన విప్లవకవులకు అమరజీవి సత్యమే సరియైన దారి చూపేదా అనిపిస్తోంది. విప్లవోద్యమాల్లో పాల్గొంటున్న శ్రామికప్రజలు, విప్లవచైతన్యాన్ని ప్రబోధించ దలచిన యువకవులు ఈనాడు గేయ మార్గాన్నే ఎన్నుకుంటున్నారు గురజాడ అడుగుజాడల్లో, కవితారంగంలో మరోమలుపు రాబోతున్న సమయంలో వెలువడిన నారాయణరావుగారి గ్రంథం నూతన మార్గానికై అన్వేషిస్తున్న సాహితీపరులకు సాధికారంగా చేయూతనిస్తుంది.

నారాయణరావుగారి గ్రంథంలో గల సుగుణం రొటీను పద్ధతిలో నడిచే వ్యాఖ్యానం, విమర్శ యిట్లాంటి ముఖ్యేతర విషయాలు పట్టించుకోకుండా నేరుగా మానవజాతి

చరిత్రలో సాహిత్యం ఎలా ఉద్భవిస్తుంది. దానికిగల మౌలిక లక్షణాలేమిటి నాగరికత పెరిగిన కొద్దీ ఏ ఏ పరిణామాలు పొందుతుంది అనే అంశాలు సూచన ప్రాయంగానైనా చేపట్టడం నుండి వర్గసమాజాన్ని నిర్మూలించగల సాంఘిక విప్లవోద్యమానికి కవితారంగంలో మార్గదర్శక మవుతుంది. యావద్భారతంలో వాల్మీకిని ఆదికవి అన్నా, ఆంధ్రంలో నన్నయ్యను ఆదికవిగా పరిగణించినా లోతుగా ఆలోచిస్తే కవిత్వాన్ని శూన్యంలోంచి సృష్టించలేదని స్ఫురిస్తుంది. లోతుగా ఆలోచిస్తే లిఖిత సాహిత్యానికీ, లిఖిత సాహిత్య సాంప్రదాయానికీ వారు ప్రతినిధులు మార్గదర్శకులు మాత్రమే. 'భాష లేఖనం కన్న బహు ప్రాచీనతరమైనదన్న అంశం కొత్తగా రుజువు చెయ్యవలసిన పనిలేదు– కవి రాయనిదే కవిత్వం ఉండడం సాధ్యం అనే అభిప్రాయం కూడా మనకి కలగలేదు– లిఖిత సాహిత్యం అలిఖిత వాఙ్మయంతో పోల్చి చూస్తే చాలా అర్వాచీనమైనది' అని మనకు జ్ఞాపకం చేస్తూ 'నన్నయ్యకి పూర్వం నుంచీ వుండి, నేటివరకూ అవిచ్ఛిన్నగా ప్రజల నోళ్లల్లోవున్న ఈ సాహిత్యానికి సరియైన పేరు లేదు' గనుక 'ఆశు సాహిత్యమని నామకరణం చేశారు నారాయణరావుగారు. కేవలం అక్షరరూపం పొందటమే గాక 'లేఖనవిద్య కవితా సృష్టినీ, స్వరూపాన్ని పూర్తిగ మార్చేసిందని' పరిశోధన ద్వారా రుజువు పరచడమే కాక యీ విధమైన ఆశు కవిత్వంలో కనపడే లక్షణాలన్నింటినీ క్రోడీకరించి మొదటి అధ్యాయంలో ప్రజాజీవితానికి యీ తరహా సాహిత్యం ఎంత సన్నిహితంగా ఉంటుందో విశదీకరించారు. లిఖిత సాంప్రదాయానికి నన్నయ్య మూలపురుషుడైనా ఆ రోజుల్లో ప్రజాబాహుళ్యానికి చదివి వినిపించే పురాణం గనుక భారతంలో కూడ యీ ఆశుకవిత్వం ధోరణి ఛాయా మాత్రంగా గుర్తించవచ్చుని సోదాహరణంగా నిరూపించారు కూడా. అంతదాక పోనక్కరలేదు. పండితం మన్యులకు శిరోధార్యమైన భారతం కూడ ఆదిలో అన్నిదేశాల్లో లాగే అనామకంగా ప్రజానీకం యావత్తూ తీర్చిదిద్దిన వీరగాథకు పరిణామ క్రమంలో ఏర్పడిన లిఖిత రూపం అనికూడ సూచించారు రామాయణం విషయంలో యీ విషయం అందులోనే కనబడుతుంది. లవకుశులు కీర్తించిన రామాయణ గానం ఆశుకవిత కాని ఒట్టిపట్టిన ఆధునిక కావ్యంకాదు. గ్రీకు భాషలోని ఇలియడ్, ఒడెస్సీ యీ విధంగా జనించినవే అన్నాడు జార్జి టామ్సన్. మనం ఈనాడు భావకవిత్వం అంటున్న లిరికల్ పొయట్రీ కూడ వాద్య సహాయం అవసరం గల గేయవ్యాసాంగమే. ఆశు సాహిత్య లక్షణంగల కథాకథనం పోతన్నలో చూడవచ్చునంటారు నారాయణరావుగారు. పోతన విలక్షణత్వం యిదివరకే గుర్తింపుకు వచ్చినా ఉత్తమ భావకవిగా పరిగణించడం పరిపాటి. నేటిదాకా లిఖిత సాంప్రదాయానికి నిలకడ కల్పించిన తిక్కన

తెలుగు పలుకుబడితో సామాన్య ప్రజానీకాన్ని ఆకర్షించిన పిదప వీరశైవ మతాన్ని తీవ్రంగా ప్రజల్లో ప్రచారం చేయదలచిన సోమనాథుడు భాషలోనూ, శిల్పంలోనూ ఆశుమార్గాన్నే ఎన్నుకున్నాడు. మన ప్రాచీన సాహిత్యంలో శ్రీనాథుని గూర్చి ఎక్కువగా చర్చించకపోయినా పద్యరచన ఆశుమార్గానికి చెందినదనే భావించాలి అంటారీయన (పే. 210). ప్రజాజీవితానికి పూర్తిగా దూరమై శిల్పమే ధ్యేయంగా భావించిన ప్రబంధ యుగం లిఖిత సాంప్రదాయానికి పరాకాష్ఠ. అయినప్పటికి ఆశు సాంప్రదాయం ఎన్నడూ నశించిపోలేదు. 'పల్నాటి చరిత్ర' వంటి సుదీర్ఘమైన వీరగాథ ప్రజలు సృష్టించుకున్నారు. దాన్ని ఎవరు వ్రాసేరనడం వ్యాకరణం సజావు వుందా అనడం అర్థంలేని ప్రశ్నలు. ప్రజలాదరించే గేయ సాహిత్యానికీ సూత్రాలు వర్తించవు. ఆదికాలంలో శివకవులు, తాళ్లపాక కవులు, వేమన, శతకకవులు, పదకర్తలు ఆధునిక యుగంలో గురజాడ, స్వాతంత్ర్యోద్యమంలోను ఆ దరిమిలాను ప్రజాఉద్యమాలలోను వెలువడిన పాటలు, పద్యాలు, బుర్రకథలు యీకోవకే చెందినవంటారు నారాయణ రావుగారు. ప్రామాణిక సాహిత్యంపై తిరుగుబాటు వచ్చినప్పుడల్లా యీ సాహిత్యం పండితుల దృష్టిలోపడింది. లేనప్పుడు దాని దారిన అది నడిచింది (పే. 209) నారాయణరావుగారి సమీక్ష యీ రీతిలో నడుస్తుంది గ్రంథమంతటా.

అనాది నుండి సాహిత్యంలో గోచరించే యీ రెండు విభిన్న మార్గాలను గుర్తించడం, వీటి పరస్పర అనుబంధాన్ని, ప్రభావాన్ని చర్చించడంతో పాటు నారాయణరావుగారు యీ నూతన దృక్పథంతో ఆధునికాంధ్ర సాహిత్యంలో వెలువడిన పరిణామాలను పరిశీలించేరు. గ్రంథంలో అధిక భాగాన్ని ఆక్రమించిన రెండవ భాగంలో ప్రజాభ్యుదయానికి దోహదం కాగల సాహిత్యం, శిల్పదృష్ట్యాకూడా వినూత్నమైన శయ్యాగీతులకు పునాదులేర్పరచిన కవిత్వం గురజాడ మహాకవి ప్రసాదించినా ఆరోగ్యకరమైన ఆయన సూచించిన మార్గాన్ని తిరస్కరించి నిరర్థకమైన భావకవిత్వాన్ని ఆహ్వానించ డానికి కారణం అచ్చుయంత్రం ద్వారా లిఖిత సాంప్రదాయాన్ని మెచ్చుకొనే మధ్యతరగతి పాఠక లోకం ఏర్పడడమంటారు వేల్చేరు వారు. వారి అంచనా ప్రకారం గురజాడది ఆశు సాహిత్య సాంప్రదాయ మార్గం, గేయకవితగా గుర్తిస్తేనే దాన్ని ఆమోదించగలం, ఆశు లక్షణం, శ్రావ్యత, ప్రధానాంశాలు గనుక అభ్యుదయ భావాలు గల గురజాడ కవిత్వం కూడ తిరుపతికవుల లాగే కాల ప్రభావానికి ఎదురీతగా నిలిచిపోయిందంటారు. గురజాడని గూర్చి ప్రతిపాదించిన యీ సిద్ధాంతాన్ని పూర్తిగా అంగీకరించలేము. కారణం వ్యాసం చివరలో వివరిస్తాను గాని గురజాడ కవిత్వాన్ని గూర్చి మొట్టమొదటి సారిగా యీక్రింది విధంగా శ్లాఘించడం నారాయణరావుగారి

గ్రంథంలోని ప్రత్యేకత, విశిష్టత, 'ఆయన రాసింది గొప్పకవిత్వం అనడానికి ఆయన కవిత్వంలో భాష, భావము, ఛందస్సు, సంగీతము కలిసిన పరిపూర్ణరూపం కారణం' (పే 82) అనాటి విమర్శకులీ సత్యాన్ని గ్రహించలేక పోవడం వల్లే గురజాడను విస్మరించడం జరిగిందని రావుగారి ఊహ. భావకవిత్వంలో యీనాడు సర్వసాధారణంగా అంగీకరించిన లోపాలు ఆత్మాలంబక అంతర్ముఖత్వం, కాల్పనికదృష్టి సామాజికస్థాయిలో నిత్యజీవిత సంఘర్షణ నుండి దూరంకావడం యిత్యాదులు వివరించడం జరిగింది నారాయణరావు గారి గ్రంథంలో కూడ. గురజాడలో గల కాల్పనికతను మాత్రం భావకవులు ఆదరించారన్నారు వస్తుతః కాల్పనికత అభ్యుదయకవితలో దానికి స్థానంలేనట్లు ఈ నిర్ణయం కూడా పూర్తిగా నిజంకాదు. 1930 ప్రాంతాల్లో ఆర్థిక మాంద్యం విశ్వవ్యాప్తంగా వర్గ సమాజన్ని ఖండించే అభ్యుదయ కవితను ప్రోత్సహించడం తద్వారా శ్రీశ్రీ నవ్యాంధ్ర కవిత్వానికి అసలు రూపాన్ని నిర్ణయించడం వివరించిన నారాయణరావు గారే 'శ్రీశ్రీకో కాల్పనికతా ప్రయోగవాద లక్షణం ఏనాడు పోలేదు_ కాల్పనికావేశంతో గూడిన విప్లవ చైతన్యం శ్రీశ్రీది' (పే.185) అంటారు. ఇటీవల వెలువడిన దిగంబర కవులను గూర్చి ప్రస్తావిస్తూ వరాభిలాగే తీవ్రమైన విమర్శలకు గురిఅయినా కవితారంగంలో పాతబడిన ధోరణుల విధ్వంసనలోనూ సామాజిక పరిస్థితులకనుగుణ్యమైన మార్పురావాలని సూచించడంలోనూ తమలక్ష్యాన్ని సాధించేరంటారు. వచనకవిత్వం పట్ల నారాయణరావు గారికి ఎక్కువ నమ్మకం లేదు. విద్యావంతులైన కొద్దిమందికే పరిమితం కావడం సూచించేరు (పే,189-191) ప్రజా జీవితానికి సన్నిహితమైన ఆశు సాంప్రదాయమే విశిష్టమైనదని వారు భావించడం నుండి యిటీవల గేయరూపంలో వెలువడిన విప్లవకవిత వంగపండు ప్రసాదరావు, గద్దర్ వంటి కవుల కృషిని ప్రశంసించి గురజాడ సంకల్పించిన కవితా విప్లవం యిదే మార్గంలోనే ఫలవంతమవుతుందని ఆశను వ్యక్తంచేసారు (పే.213)

గేయకవిత యీనాడు మన కత్యవసరమని సూచించిన వేల్చేరు నారాయణరావు గారి పై ప్రతిపాదనలన్నింటినీ యథాతథంగా మనం అంగీకరించనవసరం లేదు కాని యీనాటి విప్లవరచయితలు విధిగాచదవదగ్గ శ్రేష్ఠమైన విమర్శనా గ్రంథంగా దీనిని ఆహ్వానించ వలసి ఉంటుంది. గేయం ఛందోబద్ధమైన సాంప్రదాయ కవితకన్నా వచనకవిత్వంకన్నా వస్తుతః గొప్పదని భ్రమపడనవసరంలేదు. చాకలి పద్దులకు సంగీతం నేను కూర్చగలనని సవాలు చేసాడుట రోసినీ ఒకసారి కవిత్వంలో మనం మెచ్చుకొనే శాశ్వతత కూడ వివాదాస్పదమైన అంశమే. Northrop Frye వంటి విమర్శకుడే

కీట్సు, టెన్నిసన్ unmupical Poets అంటాడు ఒకదగ్గర (Structure of verse -ed. H. Gross) ప్రస్తుత సామాజిక పరిస్థితుల దృష్ట్యా గేయకవిత వాంఛనీయ మనడం వేరేవిషయం. ఈ అంశం తరువాత ప్రస్తావిస్తాను. వెల్చేరు నారాయణరావు గారి గ్రంథంలో కనపడే ముఖ్యాంశం అభ్యుదయ కవితకు బెర్టొల్ బ్రెక్ట్ నాటక సిద్ధాంతం ప్రాతిపదిక కావాలనడం బహుశా బ్రెక్ట్ సిద్ధాంతాన్ని నవ్యాంధ్ర కవితా విమర్శకు అన్వయించడం బహుశా యిదేమొదటిసారి. సాంప్రదాయవాదులు కీర్తించే రససిద్ధాంతాన్ని కుటుంబరావు గారొకసారి స్పష్టంగా ఖండించినా అభ్యుదయ కవిత్వాన్ని గూడ రసాత్మక దృష్టితోనే విలువకట్టడం యీనాటికి కూడ మనం మానుకోలేదు. కవితా వస్తువు మాట అటుంచి చైతన్యోత్పాదనమే అభ్యుదయ కవిత్వానికి ఏకైకలక్ష్య మని ప్రతిపాదించి బ్రెక్ట్ సిద్ధాంతాన్ని యీ క్రింది విధంగా పాఠకులకంద జేసేరు నారాయణరావు గారు. "సమాజం నుంచి శ్రోతల్ని విడదీసి వారి మనస్సు చుట్టూ ఒక సౌఖ్యావరణాన్ని కల్పిస్తుంది, ఆనంద కవిత్వం. సమాజ వ్యవస్థపట్ల జాగృతి కలిగించి అందులో భాగస్వామిగా వ్యక్తిని చైతన్యవంతుణ్ని చేస్తుంది చైతన్యకవిత్వం- ఆనంద కవిత్వం సుఖదాయకం యథాస్థితి సంరక్షకం. చైతన్య కవిత్వం శక్తిదాయకం. విప్ల వాత్మకం" (పేజీ 178) పాశ్చాత్య సాహిత్యానికి భాష్యకారుడైన అరిస్టాటిల్‌కు వ్యతి రేకంగా వెలువడిన బ్రెక్ట్ సిద్ధాంత ప్రభావం నాటకరంగంలో కనిపిస్తోందీనాడు అన్ని దేశాల్లో. సోషలిస్టు వాస్తవికతకు బ్రెక్ట్ నిర్దుష్టమైన నిర్వచనం చేకూర్చేడని పలువురి అభిప్రాయం గనుక యికమీదటనైనా నారాయణరావుగారి గ్రంథం ద్వారా పైసూత్రాలు ఆంధ్రసాహితీ లోకానికి పరిచయం కావడం ముదావహమైన విషయం. బ్రెక్ట్‌నాటక సాహిత్యంలో విప్లవాత్మకమైన గేయాలకు గల ప్రాముఖ్యత కూడ గమనించ దగ్గ విషయం.

గేయసాహిత్యం యీనాడు ఎందుకవసరమో వివరించే ముందు నారా యణరావుగారి అభిప్రాయాలను గూర్చి లోతుగా ఆలోచించ వలసి ఉంటుంది. సాంఘికాభ్యుదయ ప్రబోధం దృష్ట్యా గురజాడ సామాన్య ప్రజలకు చేరు వైన గేయాన్ని చేపట్టేడని నిర్ణయించడం అనుమానాస్పదమైన విషయం. గురజాడ వ్యక్తిగతంగా సంగీత ప్రియుడు అయి ఉండవచ్చు. కాని ముత్యాల సరం ఛందస్సును ఎంచుకోవడం ప్రధానంగా పాశ్చాత్య సాహిత్యంతో గల పరిచయం నుండి- స్వయంగా ఆయన ఆంగ్ల భాషాధ్యాపకుడు- ప్రయోగ వాది గనుకననే మనం భావించాలి. వంగ భాషలో మైకేల్ మధుసూదనదత్తు కాలంనుండి నూతన ఛందస్సులను సాంప్రదాయ వ్యతిరేకత కనువైన శిల్పసామగ్రిగా వాడుకోవడం ప్రారంభమైంది. అప్పారావు

గారికి వంగసాహితీ పరులతోగల పరిచయం నిర్వివాదాంశం. "మీరు వ్రాద్దామనుకొన్న రాజకీయ పద్యాక్యావాన్ని ప్రారంభించారా? జానపద గేయాలు వివిధ ఛందస్సులలో పద్యాలు వ్రాయడానికి ఉపక్రమించండి" అని శంభు చంద్రముఖర్జీ గురజాడకు లేఖ వ్రాసేరు 1884 లో. అచ్చు యంత్రం ద్వారా లిఖితసాహిత్యం ఏర్పడి ఆశు సాంప్రదాయాన్ని స్వీకరించిన అప్పారావుగారి కవిత్వం మూలపడిందనడం, భావకవిత్వానికి సౌకర్యం ఏర్పడినదనడం తేలికైన అంచనా అని నాఅభిప్రాయం. అప్పారావుగారి కవిత్వానికి ఆదరణ లోపించడం, భావకవిత్వానిదే పైచేయి కావడానికి ప్రధానకారణం ఆనాటి ఆంధ్రదేశం రాజకీయంగా వెనుకబడిన దేశం గనుకనే. ఆంధ్రదేశం నిన్న మొన్నటి వఱకు పారిశ్రామికంగా వెనుకబడిన ప్రాంతమే. దూరాన్నున్న చెన్నపట్నం తప్పించి పల్లెసీమలు తప్పితే పట్టణాలు అభివృద్ధి చెందని దేశం. ఆంగ్ల విద్యాభ్యాసం కూడా ఆలస్యం గానే ప్రారంభమయింది. జమీందారీ వ్యవస్థ కూడ యితర ప్రాంతాలకన్న ఎక్కువకాలం కొనసాగింది. రాయప్రోలు గురజాడల కవిత వెలువడిన 1909 లోనే ఎజ్రాపౌండ్ (Ezra pound) కవనసంపుటాల ప్రచురణ ఆంగ్ల సాహిత్యంలో. భావకవిత్వానికి పరాకాష్ఠ అనదగిన 'కృష్ణ పక్షం' 1925 లో వెలువడితే 1922 నాటికే వేస్ట్‌లాండ్ (Waste Land) దశకు చేరుకుంది పాశ్చాత్య సాహిత్యం. పారిశ్రామికాభివృద్ధి, సాంస్కృతిక వికాసము, సమకాలీన రాజకీయ వ్యవస్థ యీ అంతరానికి కారణాలన వచ్చు. సోవియట్ విప్లవం జరిగిన 15 సంవత్సరాల దాకా ఆర్థిక మాంద్యం ద్వారాగాని సామ్యవాద ఉద్యమం మన సాహిత్యకారుల దృష్టిలో పడలేదు. గురజాడ కవితలోనే "ఆంగిలేయుల ధర్మరాజ్యము జ్ఞానమును స్వాతంత్ర్య మిచ్చును సంతతము వర్ధిల్లు గావుత!" ధోరణి అమాయకత్వం కనిపిస్తుంగి. Early years of shelley అనే గ్రంథం గురజాడ డైరీలో కనబడుతుంది. కాని షెల్లీని మెచ్చుకోగల తత్త్వంకాదు వారిది. ఆంగ్లంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడైన విలియంమోరిస్ గూర్చిగాని స్విన్ బర్న్‌ను గూర్చిగాని ఆలోచించినట్లు ఆధారాలులేవు. ఆనాటికి రాజకీయలక్ష్యం బూర్జువా ప్రజాస్వామ్యం. దానినీ నాడు ఎలా నిర్వహిస్తున్నామో వేరే చెప్పనవసరం లేదు. నిరక్షరాస్యులైన సామాన్య ప్రజనీకాన్ని ఉద్దేశించి గురజాడ గేయంపై ఆప్యాయత చూపేడనడం నమ్మదగిన విషయంకాదు. అదే విధంగా భావకవిత్వానికి విశేష ప్రచారం, గౌరవం లభించడానికి కారణం పరోక్షంగానైనా గాంధీజీ తిరోగమన నాయకత్వం అయిఉండవచ్చు. తిరిగి అణగారిన మత ప్రబోధం, నైతిక సూత్రాలు వల్లెవేయడం, భారతీయ నాగరికతలో అనాది నుండి కనపడే ఊహానా మాన

వత్వం, జీవకారుణ్యవాదం ఆసరాగా వినియోగించుకొని వర్గచైతన్యాన్ని కప్పిపుచ్చడం- వీటి నుండి మేధావులకు కళాకారులకు స్వాతంత్ర్యోద్యమంలో స్థానంలేకుండా పోయింది. వీరేశలింగం గురజాడ వంటి నిజాయితీ పరులు ఆశించిన సంఘ సంస్కరణకు బదులు కేవలం నిరర్థకమైన జాతీయభావానికే ప్రాధాన్యత హెచ్చడం నుండి ఆత్మాశ్రయ కవిత్వానికి పది సంవత్సరములపాటు (1920-30) ఆయువు లభించింది. అదనంగా భావ కవిత్వాన్ని యీ దృష్టితో పరిశీలించడం అవసరం. ఇతర ప్రాంతాలకన్న ఆంధ్రదేశం వెనుక బడడం కూడ జరిగింది. నజ్రుల్ యిస్లాం 1922లో 'అగ్నివీణ'తో విప్లవకవితా దుందుభిని మ్రోగించాడు. 1926లోనే కర్షకలోకానికి మేలుకొలుపుగీతం వ్రాసేడు. మనభావకవుల సమకాలీనుడైన కుమారన్ ఆశాన్ కవిత్వం కేరళలో ఉత్తమమైనదని నా అభిప్రాయం.

ప్రాచీనాంధ్ర కవిత్వంలో గూడ నారాయణరావుగారు సూచించినట్లు సామాన్య ప్రజల మధ్య పెరిగిన ఆశుసాహిత్యానికీ రాజాస్థానాలకు చెందిన లిఖిత సాంప్రదాయానికీ గల అంతరానికి గల అసలు కారణం కరడు గట్టిన ఫ్యూడల్ వ్యవస్థ పాశ్చాత్య సంపర్కం ఏర్పడేదాకా రాజ్యం చేయటం, ఏ యితర దేశంలోనూ గోచరించని కులవ్యవస్థ, సాంస్కృతికరంగం పై బ్రాహ్మణవర్గం అధికారం చెలాయించడం యిత్యాది ప్రత్యేక పరిస్థితులనుండి అని గమనించవలసి ఉంటుంది. వెల్చేరు వారు సాంఘిక పరిస్థితులను బుద్ధిపూర్వకంగానే తమ పరిశోధనా పరిధిలోనికి స్వీకరించలేదు. (పీఠిక - చివరిపేరా) పాల్కురికి సోమనాథుడు మట్టుకు తనలక్ష్యం మత ప్రబోధమైనా సామాన్యప్రజల్లో ప్రచార సాధనంగా పాండిత్యాన్ని వెనక్కునెట్టి ప్రజల నాకర్షించగల గేయ మార్గాన్ని చేపట్టాడు. కాని మధ్యయుగంలోని పాశ్చాత్య దేశాల్లోవలె మత సంస్కరణోద్యమం బూర్జువా ప్రజాస్వామ్య స్థాపనకు అవసరమైన రాజకీయోద్యమంగా పరివర్తన చెందడం జరగలేదు. ప్రజాకవి వేమన కూడ సంఘ సంస్కర్తగానే ఆగిపోయాడు. రాజవంశానికి చెందిన వ్యక్తి అనే ప్రతీతి ఉంది. మార్టిన్ లూథర్, మిల్టన్, వోల్టేర్ వంటి సాహిత్యకారులు లోపించడంవల్ల ముఖ్యంగా ప్రబంధయుగం నుండి లిఖిత సాంప్రదాయం పూర్తిగా నిరుపయోగమైన పంథా నవలంబించింది, భారతదేశంలోని యితర ప్రాంతాలతో పోల్చిచూసిన. ఆంధ్ర సాహిత్యం నన్నయ నుండి స్వతంత్ర మార్గాన్నికాని సామాజికాభివృద్ధికి దోహదం చేయగల సాహిత్యాన్నిగాని సృష్టించేందుకు ప్రయత్నించలేదు. తలాతోకాలేని పురాణాల అనువాదం, మితిమీరిన శృంగారాన్ని కథావస్తువుగా చేపట్టిన ప్రబంధాల బనాయించడం మనకి సంక్రమించిన మూలధనం. బహుశః ముస్లిమ్ దండ యాత్రలవల్ల క్షీణించిన

మన భూస్వామిక వ్యవస్థలో కవికి మేధావిగా ప్రత్యేక స్థానాన్నీ గౌరవాన్నీ కల్పించారు శ్రీనాథుడు. పదకవితలను ఎప్పుడో ఒకసారి యీసడించినా నారాయణరావుగారే సూచించినట్లు ఆకు సాంప్రదాయాన్ని గౌరవించి 'పల్నాటి చరిత్ర'లో చేయి చేసుకోవడం, ప్రజాజీవితంపై చాటువులల్లడం బట్టి ఆవిధంగా భావించడానికి వీలుంది. కాని విజయనగర సామ్రాజ్య స్థాపనతో కవుల అంతస్తు సామాజికంగా తిరిగి క్షీణించినట్లు విశదమవుతుంది. ఫ్యూడలిజం నుండి వలసరాజ్యాంగం పరివర్తన చెందడం రాజకీయ స్వాతంత్ర్యం అనిర్వచనీయమైన మోక్షాన్ని ప్రసాదిస్తుందని గుడ్డిగా నమ్మడం, గత ముప్ఫయ్యేళ్లలో సామ్యవాదంపేరుతో హీనాతి హీనమైన ధనికవాద వ్యవస్థ నెలకొల్పడం – యీ విధమైన పరిణామాల ద్వారా నిజాయితీపరులైన కవులకు తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకుందికి ఒకే ఒక మార్గం మిగిలి ఉంది. జార్జి టామ్సన్ మాటల్లో "Our Contemporary poetry is not the work of the ruling class – What does big business care about poetry? – but of a small and isolated section of the community, the middle class intellingentsia, Spurned by the ruling class but still hesitating to join hands with the masses of the people, the proletariat who alone have the strength to break through the iron ring of monopoly capitalism." (Marxism & Poetry, 2nd ed. 1954) ఆ విధమైన ప్రజాకవి మాత్రమే. గోథే మహాకవి వాక్రుచ్చినట్లు "...And when man in his along is dumb / I have God's gift to utter what I suffer" అని తన బాధ్యతను నెరవేర్చగలడు. నిరక్షరాస్యులే అత్యధిక సంఖ్యాకులైన భారతదేశం వంటి వలస దేశాల్లో కవి అన్నవాడు శ్రామిక ప్రజల్లో ప్రచారానికనువైన గేయ మార్గాన్నే ఎన్నుకోకతప్పదు. వర్గ సమాజం కొనసాగినంత కాలం ఆత్మాశ్రయ కవిత్వానికి మేధావులు మాత్రమే అర్థం చేసుకోగల వచన కవిత్వానికి అవకాశాలు తక్కువ.

చండీఘర్ నుండి 21మంది ప్రముఖ హిందీ రచయితలు, మేధావులు కలసి ఒక ప్రకటనలో పంజాబులోని పోలీసు ఉద్యమాన్ని సమర్థిస్తూ, దానిపై ప్రభుత్వ నిర్బంధ కాండను వెంటనే నిలిపి వేయాలని డిమాండు చేశారు. పోలీసులు యూనియన్ ఏర్పరచుకోవడంతో సహా వారి డిమాండ్లను అన్నింటినీ, పంజాబు ప్రభుత్వం ఆమోదించవలసిందిగా వారా ప్రకటనలో కోరారు.

కోడి కూతలో నిప్పులు కురిసెను

భోగి

పండితపురమను పల్లెసీమలో
తూరుపు కొండలు ఎర్రబారెను
చైతన్యమ్మను చెకుముకిరాయితో
ఆకలిపేగులు రగిలిమండెను ॥పండిత॥

కాకిరెక్కలకు కత్తులు పుట్టెను
కోడికూతలో నిప్పులు కురిసెను
పూలచెట్లకు బాంబులు పూసెను
కొండలు కోనలు కోయనిలేచెను
॥పండిత॥

చీమలు పెరిగి చిరుతలాయెను
మేకపిల్లలకు రోషమువొచ్చి
పోరుసేతుమని హోరుపెట్టెను ॥పండిత॥

పంజరమందలి చిలకపిల్లలు
పట పట పట పట పట పట మనుచు
ఇనుప ఊచలను కొరికివేసెను
రెక్కలు విప్పి వాడల చొచ్చెను
విప్లవవీరుల పాటలుపాడెను ॥పండిత॥

నల్ల నల్లని మబ్బుల గుంపులు
తళ తళ తళ తళ తళ తళ మనుచు
ఫెళ ఫెళ ఫెళ ఫెళ ఫెళ ఫెళ మనుచు
పిడుగుల ధారలు పుడమిని రాల్చగ
మేడలు మిద్దెలు గడగడ లాడెను
॥పండిత॥

కబడ్దార్

వంగపండు

కబడ్దార్ - కబడ్దార్
కంపినీల వాడా
కదిలింది - కదిలింది
కార్మిక సేనా - ॥కబడ్దార్॥

గుంజి గుంజి మా నెత్తురు
ఇంజెనులో బోసేము
పానకాలు తాగేందుకు
పంచదార జేసేము
పంచభక్ష పరమాన్నం నీకా ?
వుప్పులేని గంజినీరు మాకా ?
పంచుతాం - పంచుతాం
జనశక్తిని పెంచుతాం ॥కబడ్దార్॥

చుక్క చుక్క చెమట గక్కి
చకాృలను దిప్పినాము
చక్కెర ముక్కలు జేసి
బస్తాలను నింపినాము
అమ్ముకోని గడించేది నువ్వా ?
ఎమ్ములతో మిగిలేది మేమా ?
కండబలం చూపిస్తాం-
గుండెబలం చూపిస్తాం- ॥కబడ్దార్॥

ఇంకుతున్న నెత్తురల్ల
ఇటికె బెడ్డ జేసేము
గాలి తగిలె బంగ్లాకి
గదులు గదులు గట్టేము
వెలుగులోను ఇరగబాటు నీకా ?
చీకటిలో ఎంగిలాకు మాకా ?
నిప్పులోను బొగ్గులుమై
రగిలి రగిలి మండుతాము ॥కబడ్దార్॥

నరాలన్ని నారజేసి
నరజాతికి బట్టనేసి
కన్యాకుమారి నుండి
కలకత్తా పంపేము
అసుపత్రి పుల్లుగుడ్డ మాకా ?
ఊలుకోటు - నూలుసూటు నీకా ?
వుప్పెనలా పొంగుతాము
వురకలేసి మింగుతాము ॥కబడ్దార్॥

ముప్పదిలక్షల క్రోసులు
మెయిన్ రోడ్డు పోసేము
మారుమూల గ్రామాలకు
మార్గాలను వేసేము
కారులెక్కి తిరుగుతుంది నీవా ?
కాటికాడ బతుకుతుంది మేమా ?
కాసుకో - కాసుకో -
చూసుకో - చూసుకో ॥కబడ్దార్॥

మాచ్కుండూ - హీరాకుడ్
ప్రాజెక్టులు గట్టేము
నీటిని నిలబెట్టేము
నిప్పును పుట్టించేము
రాత్రి పగలు జేసింది మేమూ ?
రాజులాగా కులికేది నీవా ?
శ్రమశక్తిని జూపిస్తాం
సమరాజ్యం స్థాపిస్తాం- ॥కబడ్దార్॥

భూస్వామ్య సంస్కృతికి 'సర్వోదయ' మజిలీ

వినోబా భావే భావజాలం

సమాజంలో ఆర్థిక పునాదికి అనుగుణంగా మారే ఉపరితలాంశాల్లోని భాగాలే మతం, సంస్కృతి కూడా. కాని ఆర్థిక పునాది మారకుండానే విప్లవపోరాటాల ప్రభావంతో నూతన సంస్కృతికై పోరాటం జరగడం ఎంత వాస్తవమో ఆర్థిక పునాది మారుతున్నా పాతసమాజంలో ఉద్భవించిన మతం, సంస్కృతి ప్రభావాలు యింకా నెలకొని వుండడం కూడా అంతే వాస్తవం.

దేశాన్ని పారిశ్రామిక వంతం చేస్తున్నామని చెబుతున్న పాలకవర్గం భుస్వామ్య విధానాన్ని కాపాడేందుకు ఒకప్రక్క భూసంస్కరణలను అసలు జరుపుతున్నట్లు ప్రజల్ని మోసంచేస్తూ మరోప్రక్క వ్యవసాయ విప్లవానికై పోరాడే రైతాంగ ఉద్యమాలను అణచివేస్తూండడం ఎంతనిజమో కార్మికవర్గ సంస్కృతి లేదా ప్రజాసంస్కృతి నెలకొనకుండా భూస్వామ్య సంస్కృతిని కాపాడేందుకు ప్రయత్నిస్తూంటుందనేది కూడా అంతే నిజం. నిన్నటి వినోబాభావే గోవధ నిషేధోద్యమ చరిత్ర దీనినే ఋజువుచేస్తూంది.

శాఖాహరులు, మాంసాహరులు- ఇందులోకూడా వివిధ జాతుల మాంసాహరులు కలసియున్న మన సమాజంలో ముఖ్యంగా ప్రజాస్వామ్య రక్షకులుగానూ మతాతీతమైన లౌకికరాజ్య రక్షకులుగానూ తమనుతాము చాటుకునే జనతా ప్రభుత్వం ఒక సర్వోదయ నాయకుడిగా సాధుముసుగులో చెలామణి అవుతూన్న భావేగారి 'నైతికబలానికి' లొంగి

మైనారిటీ ప్రజల ఆహారనియమాలపై నిషేధాన్ని విధించబూనుకోవడం ఆ ప్రజల స్వాతంత్ర్యానికి గొడ్డలి పెట్టు మాత్రమే. హిందూమతంలో నుండి పుట్టిన "గోమాత రక్షణ" భావాన్ని "గోవధనిషేధం" పేరుతో చట్టంగా తీసుకురావడం ద్వారా మత కల్లోలాలను రెచ్చగొట్టేదీ ప్రభుత్వమే. "లౌకికరాజ్యం" (Secular state) గా చెప్పే భావానికి కూడా తిలోదకాలివ్వడమే.

పైదంతా వర్గ స్వభావం కలిగిన ప్రభుత్వంపై 'నైతికవత్తిడి' తెచ్చిన భావేగారి సంస్కృతి స్వభావం తెలుపగా, దానికిగల రాజకీయ పునాది క్రింది భాగంలో చూద్దాం:

1950 లలో తెలంగాణా రైతాంగ పోరాటాన్ని అణచివేసేందుకు నెహ్రూ ప్రభుత్వం పోలీసుచర్య ప్రారంభిస్తే రెండోప్రక్క సర్వోదయ ముసుగులో "హృదయ మార్పు" పేరుతో భూస్వాములు మనస్సు మార్చుకొని తమమిగులు భూములను స్వయంగా దానం చేయాలంటూ భూదానోద్యమాన్ని నిర్వహించి, రైతాంగ పోరాటాలను సాయుధమార్గం నుండి మళ్ళించి- నీరుగార్చి, భారతపాలకవర్గాలకు ముఖ్యంగా భూస్వామ్య వర్గాలకు ఊడిగంచేసేందుకు నడుంకట్టిన వ్యక్తి వినోబాభావే. ఆ ఉద్యమ ఆచరణ చూసిన మన ప్రజానీకానికి నేడు దానిపై వివరించాల్సిన అవసరం లేదు.

అలాగే దేశాన్నంతను జైలుగా మార్చి ఇందిరాగాంధి నియంతృత్వం చెలాయిస్తూ పాలకవర్గపార్టీకి వ్యతిరేకులైన వారితోసహా విప్లవకారులను, విప్లవాభిమానులను నిర్బంధించి, చిత్రహింసలకు గురిచేయడం చివరకు కాల్చివేయడం జరుగుతున్నా భూస్వాములు "మార్చు కోలేనటువంటి హృదయాన్ని" తాను మార్చుకోని ఇందిరా రక్షణకై క్రమశిక్షణ పేరుతో మహాభారతంలోని "అనుశాసన పర్వాన్ని" ఉటంకిస్తూ అత్యవసర పరిస్థితిని సమర్థించిన వ్యక్తి భావే.

"ఆవులను పట్టిపోయిన తర్వాత వుంచుకోవడం లాభదాయకం కాదని కసాయి వాళ్ళకు వాటివయస్సుతో నిమిత్తం లేకుండా 30 నుండి 50 రూపాయిలకు అమ్మివేయడం జరుగుతోంది" "ఆవులకన్నా గేదెలకే ప్రాముఖ్యత నిస్తున్నారు" [పాలు అధికంగా యిస్తాయని,] ప్రజల పౌష్ఠికాహారం పాలు- పాలిచ్చే పశుసంపదను రక్షించాలనే రాజ్యాంగాల్లో గల ఆర్టికల్- 48లో ఇమిడియున్న స్పిరిట్ వల్లనే "అన్ని పశువులను వధించరాద" నేటీహారు ప్రభుత్వ చట్టాలోని కొన్ని క్లాజులను తొలిగిస్తూ ప్రత్యేక కారణాలవల్ల "ఆవులు-దూడలను వధించరాదని నిషేధిస్తూ" ఉత్తరప్రదేశ్ (యు.పి.) ప్రభుత్వం చేసిన చట్టాన్ని సుప్రీంకోర్టు సరియైనదిగా 1959లో పేర్కొనడం జరిగింది. అదేతీర్పులోని యీభాగాలు, "రాజ్యాంగంలో పొందుపరచిన చట్టాలను శాసనసభ

సరిగా అర్థంచేసుకొని దాని ప్రజావసరాలను గుర్తిస్తుందని కోర్టులు భావించాలి" అన్న భాగానికి భిన్నమైనవిగావు సరికదా రెండవ దానిలో భాగంగానే మొదట పేర్కొన్న భాగాలను అర్థంచేసుకోవాలి. అప్పుడే గోవధ నిషేధంలోని కోర్టు పేర్కొన్న స్పిరిట్ గాని, ప్రజావసరాలను శాసనసభలు గుర్తిస్తాయని పేర్కొనడంలోని స్పిరిట్ గాని అర్థం కాగలదు.

గోవధ నిషేధం ప్రస్తుతం కేరళలోనూ బెంగాల్‌లోనూ అవసరమా ? వివరంగా కేరళను యు. పి. ని పోల్చిచూద్దాం.

గోవధ నిషేధం అమలులోవున్న యు.పి.లో ఆవుల సంఖ్య గత 20 సంవత్సరాలలో పెద్దగా పెరగకున్నా గేదెల సంఖ్య గణ నీయంగా పెరిగింది. కాని నిషేధం లేని కేరళలో అదే కాలంలో ఆవుల సంఖ్య విపరీతంగా పెరిగింది. పాడి వుత్పత్తిలో కూడా యు. పి. లో గేదెపాలు అధికంకాగా కేరళలో తొంబది శాతం ఆవుపాలే. అలాగే గత ఇరవై సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు పైబడిన ఆవుల సంఖ్య ఎద్దులతో పోలిస్తే యు.పి. లో సగానికి తక్కువగా వుంటే కేరళలో మూడురెట్లకు మించివున్నాయి.

నిరాహారదీక్షను ఆపి కనీసం ఒక్క సంవత్సరం ఆగమన్న కేరళ – బెంగాల్ ముఖ్యమంత్రుల విజ్ఞప్తులను, దేశీయవ్యవహారశాఖా ప్రతినిధి బృంద విజ్ఞప్తిని కాదని ఆ రాష్ట్రాలలో నిషేధం అమలు జరిపే చట్టంలేదనే నెపంతో వినోబా భావే నిరాహార దీక్ష ప్రారంభించడంలో ఇందిరా హస్తం వుండడం, జనతా ప్రభుత్వం మొదట అది రాష్ట్రాల వ్యవహారమని జోక్యం కలగజేసుకోనన్నా చివరకు కేంద్రమే చట్టం తేవాలని నిర్ణయించడానికీ, దీనిని సమర్థించే లేదా వ్యతిరేకించే వివిధ పార్టీల వారికీ వారివారి స్వార్థ పూరిత రాజకీయాలే కారణమన్నది యథార్థం.

ఏది ఏమైనా మార్పును కోరే ప్రజానీకం భూస్వామ్య విధానంతోపాటు భూస్వామ్య సంస్కృతిని నిర్మూలించేందుకు ఇందిరా – మొరార్జీలతోపాటు యిటువంటి భావేలను కూడా ఎదిరించి పోరాడే సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలి.

ఉజ్వల

సంకేతం అందుకో

డొక్కలు ఏడుస్తున్నాయి
కండ్లు మండుతున్నాయి
గుక్కపెట్టి ఏడుస్తోన్న
పసిపాప ఆకలికి
దిక్కులు వణికిపోతున్నాయి
చుక్కలు నేల కురుస్తున్నాయి

వేల మైళ్ళ దూరాన వున్న నీకు
సంకేతాన్ని అందిస్తున్నాను
అందుకొని
మరో పది మందికి అందించు
ఒక కొత్త తరంగాన్ని సృష్టించు.

— యర్రపల్లి జగన్మోహనరావు

వానరుడు నుంచీ నరుడు వరకూ

(i) మానవుడు – సస్తనజాతి జంతువులు

స్థూలంగా జంతుజీవితానికి సంబంధించిన అనేక రూపాలు విభిన్న పరిసరాలకు, పరిసరాల మార్పుల పరంపరకు అలవాటు పడటంలో, అనేక స్థాయిలకు సంబంధించిన విజయాలతో, సహజ ఎన్నికతో అనంతకాలంలో పరిణామం పొందాయి. భూమి మీద విభిన్న భాగాలలో విభిన్న వాతావరణ పరిస్థితులతో మాత్రమేగాక అన్ని భాగాల్లోనూ జంతురూపాలు అగాధ మార్పుల దీర్ఘపరంపరకూ గురిఅయ్యాయి. పరిసర మార్పులు కారణంగా ఏ జంతుజాతీ ఎన్నడూ దానిపరిసరాలకు పూర్తిగా అలవాటుపడదు. ఒక నిర్దిష్టదశలోని పరిస్థితులకు అసాధారణంగా అలవాటుపడిన అవయవాలుగల జంతుజాతి పరిస్థితుల మార్పుతో శక్తిహీనంకావచ్చును. ప్రత్యేక పరిస్థితికి, ప్రత్యేక ఉపయోగానికి అలవాటుపడని అంగాలుగల ఇతరజంతుజాతి అభివృద్ధిపొంది అధికం కావచ్చును.

మనిషి పున్నతజాతి జంతువులకు చెందిన సస్తనజాతిలో ఒకడు. మనిషికి సమీప సస్తనజాతి జంతువులు వానర సదృశ జంతువులు, కోతులు, కుక్క, పిల్లి వంటి మాంసంతినే జంతువులు, గుర్రం, పశువులవంటి డెక్కల జంతువులు ఇతర సస్తనజాతి జంతువులు. తొలి సస్తనజాతి జంతువులు చెట్లమీద జీవించేవి. ఈ పాత కాలపు చెట్లమీద జీవించడం నుంచీ మాంసంతినే జంతువులు, డెక్కల జంతువులు భూమి మీద జీవించడానికి అనేక మార్గాల్లో అలవాటుపడి వేరైనవి. అలా వేరైన జంతువుల అవయవాలు మృదువైన కీళ్ళను కోల్పోయినవి. రెండు కాళ్ళమీద రెండు చేతుల మీద దృఢంగా నిలవటం, వేగంగా కదలటం నేర్చుకున్నవి. కొమ్ములు, డెక్కలు, వెన్నెముకలు, కోరలు మొదలైన దెబ్బతీసే, దెబ్బకాచుకునే అనేక అంగాలను అభివృద్ధి చేసుకున్నవి. గడ్డిని తినడానికి లేదా మాంసాన్ని చీల్చడానికి దంతాలను, దూరం నుంచీ వాసన చూడడానికి ముట్టులను అభివృద్ధి చేసుకున్నది. ఈ క్రమంలో ఆదిమపున్నతజాతి జంతువుల పూర్వులైన మరొక బృందం చెట్లలోనే వుండిపోయి మొత్తంమీద ఆదిమ సస్తనజాతి జంతువుల అవయవ నిర్మాణాన్ని భద్రపరచాయి. ఆ ఆదిమ సస్తనజాతి జంతువుల జీవిత పరిస్థితులకు నిశిత వాసనా శక్తికంటే మంచి కంటిచూపు, వేగం బలంకంటే చురుకుదనం, వంచనా స్వభావం అవసరం. వాటి ఆహారం ఆకులు, పండ్లు కాబట్టి బలమైన దంతాలు అవసరంలేదు. కళ్ళు పరిపూర్ణ త్రిపరిమాన చూపులో అభివృద్ధి పొందినప్పుడు ముట్టి క్షీణించిపోతుంది. వంకర గోళ్ళు సన్నితమైన కుదుళ్ళలో పొడిగిన

సమతలమైన గోళ్ళుగా చిన్నవయినవి. చిన్నవస్తువులను నిపుణంగా నిర్వహించగలిగే విధంగా బొటనవేలు ఇతర వేళ్ళకు ఎదురుగా కదిలేటట్టు, వేళ్ళు సులభంగా కదిలే స్థితికి పరిణామం పొందాయి. ఈ అభివృద్ధులతో కలిసి అంతిమంగా మెదడు పెద్దదిగానూ, సంకీర్ణంగానూ విస్తరించింది. ఇతర శరీర అంగాలను, బాహ్య ప్రపంచంతో ఆ అంగాల అన్యోన్య క్రియలను అధికారంచేసి క్రమబద్ధం చేయటం మెదడు వ్యాపారం. ఒక ప్రత్యేక పరిస్థితికి లేదా ప్రత్యేక వుపయోగానికి అతిగా అలవాటు పడటం వలన కలిగే నష్టాలు లేకుండా వృద్ధిపొందిన అంగం మెదడు ఒక్కటే. కాబట్టి ఆదిమవున్నత సస్తనజాతి జంతువులు మారిన పరిస్థితులకు ఎక్కువగా అలవాటు పడే మార్గంలో పరిణామం చెందాయి.

నిటారునిలువుగా నిలబడటం విస్తృతమైన సంకీర్ణమైన మెదడు మినహాయించి తక్కిన వాటిల్లో సమాన లక్షణాలుగల వానర సదృశ సస్తనజాతి జంతువులు మనిషికి జీవించివున్న దగ్గరబంధువులు. కొన్ని ఆదిమజాతి జంతువులు వృక్షసంబంధ అలవాట్లను వదులుకొని భూమిమీద జీవించటం నేర్చుకున్నప్పుడు మానవ పరిణామంలో మొదటిదశ సంభవించదని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. మాంసంతినే జంతువుల, డెక్కల జంతువుల మొదటి ప్రాచీనులు వేల సంవత్సరాలకు పూర్వం చేసినది ఇదే. కాని మనిషి చాల వున్నత పరిణామాత్మక స్థాయిలో ఆదిమజాతి జంతువుల నమూనాలను అనుసరించాడు. అందుచేతనే మార్పుకు సంబంధించిన పరిణామాలు మనిషిలో ఇతర సస్తన జంతువులకంటే భిన్నంగా వున్నాయి. అప్పటికే మనిషికి మనం పూర్వం పరిశీలించినట్టు ఇతర జంతువులకన్నా మంచి మెదడు వుంది. నేలమీద నడవటం నేర్చుకోవటంతో మనిషి ఇకమెదడు అభివృద్ధి పొందటంలో మాత్రమే బతికే అవకాశం వున్న జీవిత మార్గానికి నిబద్ధుడయ్యాడు.

జంతువులు ప్రకృతిలో భాగం. జంతువులకూ పరిసరాలకూ మధ్య అన్యోన్య క్రియ పూర్తిగా ప్రతిక్రియా రహితమైనది. ఒక పరిసరాలలో ఒక కాలంలో పెరిగే మొక్కలు మేతకోసం తిరిగే పశువుల మందలతో నాశనం అవుతాయి. ఈ విధంగా జంతువులు ప్రకృతిమీద మార్పును కలుగజేయడం వాస్తవం. కానీ ఇది నదీ ప్రవాహం గట్టులను కోయటం వంటి చైతన్యంలేని క్రియ మాత్రమే. తేనెపట్టులు, పక్షిగూళ్ళు, ఉభయచరాల నీటిపట్టులు యీ సూత్రాలకు మినహాయింపుకాదు. జంతువులు చేసే యీ పనులన్నీ శారీరక వారసత్వంగా సంక్రమించిన పరిసరఅనుగుణ్య సహజాత రూపాలు.

అయినప్పటికీ తక్కువజాతి జంతువులకు, వున్నతజాతి జంతువులకు మధ్య అనేక స్థాయీభేదాలు వుంటాయి. అవి పరిసరాలతో అనుగుణ్యతకు సంబంధించి వుంటాయి. ఇతర రంగాలలో ప్రత్యేక పరిస్థితిని, లేదా ప్రత్యేక ఉపయోగానికి అలవాటు పడటం లేకపోవటంతో మనుష్యేతర ఆదిమ జంతువులకు మెదడు సాపేక్షంగా పెద్ద పరిమాణంలో వుంటుంది. ఈ కారణంతో ఇతర జంతువుల కంటే అవి ఎక్కువగా పరిసరాలకు అనుగుణ్యం అవుతాయి. ఎప్పటికప్పుడు ఆహారం లభించే శత్రువుల నుంచీ ఆత్మరక్షణకు సహకరించే చెట్లమీద వుండటంవల్ల ఆదిమజాతి జంతువులు ఈ మార్గంలో పరిణామం పొందాయి.

మానవుని తొలిప్రాచీనులు ఈ ప్రకృతి సహజ ప్రయోజనాలను వదులుకున్నప్పుడు జంతువులకు ప్రకృతికీ మధ్య గుణాత్మక మార్పును పొందిన నూతనదశ సేంద్రియ జీవిత పరిణామంలో తెరుచుకున్నది. దంతాలు చేతులు కాళ్ళ విషయంలో తొలిప్రాచీనులు ఆత్మరక్షణ చేసుకోలేరు. వాళ్ళు వీటిమీదే ఆధారపడి వుంటే తప్పని సరిగా నాశనమయ్యేవాళ్ళు. మన మెదడుకంటె చిన్నదైనప్పటికీ వానర సదృశ జంతువుల మెదడుకంటె పెద్దమెదడు ప్రాచీనులకు వుండేది. అంతేకాక నిట్టనిలువుగా నిలబడగలగటం వలన రెండు చేతులను మెదడు నడిపించేది. ఆ చేతులవలన ప్రకృతి పరిస్థితులకు కేవలం అలవాటుపడి బతకటంకాక ప్రకృతి పరిస్థితులను తమ ప్రయోజనాలకు అనుగుణ్యంగా, చైతన్యవంతంగా ఉపయోగించుకునే శక్తి లభించింది. మొత్తం శరీర భారాన్ని పాదాలమీద మోపటం వలన మనిషి బొటనవేళ్ళకు గట్టిగా పట్టుకునేశక్తి పోయింది. మనిషి చేతులు స్వేచ్ఛను పొందటంతో చేతివేళ్ళు సున్నిత చలన సమర్థాలయినాయి. ఇది నెమ్మదికరిపం. కొత్తగా నిలబడటం వలన వచ్చిన మొదటి ఫలితం ఆహారాన్ని, ఇతర వస్తువును చీల్చటం, పగలగొట్టటం వంటి పనులు చేతులకు సంక్రమించటం వలన దవడలమీద వొత్తిడి తగ్గిపోయింది. ఈ క్రమంలో దవడలు చిన్నవి అవుతూ మెదడు విశాలం అవుతుంది. మెదడు విస్తృతమైతే చేతులమీద అత్యంత సన్నిహిత అధికారాన్ని పొందుతుంది.

పనిముట్ల వాడకం, మాట్లాడగలగటం అనే మనిషికి సంబంధించిన రెండు ప్రధాన లక్షణాల జీవశాస్త్ర మూలాలను చేయి, మెదడుల సమాంతర అభివృద్ధిలో మనం పరిశీలించాలి.

మానవేతర ఆదిమ జంతువులు కర్రలు, రాళ్ళు మొదలైన ప్రకృతి ముడి వస్తువులను ఉపయోగించగలవు- వాటిని ఒక మేరలో తక్షణ ప్రయోజనానికి అను

గుణ్యం చేయగలవు. కాని చేతితో ఉపయోగించే ఇలాంటి వస్తువులకూ, రాతిరుదురుపు సాధనాలు, సమ్మెటలు, గొడ్డళ్ళు, కుదురులవంటి అనాగరికమైన మానవుల ఆదిమ పనిముట్లకూ మధ్య గుణాత్మకమైన వ్యత్యాసం వుంది. పనిముట్టు వినియోగానికి కాక వుత్పత్తి కోసం ప్రణాళిక వేసిన వుత్పాదక శ్రమ ఫలితం. ఒక ప్రత్యేక వుత్పత్తి ఫలితాన్ని వుద్దేశించి పనిముట్టును చేతితో వుపయోగిస్తే, పనిముట్టు తయారీ ఒక ప్రత్యేకమైన ఉత్పత్తి రూపాన్ని ఉద్దేశిస్తుంది. ఈ కారణం వలన ఉత్పత్తి సాధనంగా పనిముట్టును చేతితో ఉపయోగించటం కంటే పనిముట్టును తయారుచేయటానికి, ఎక్కువ స్థాయి సంకల్ప పూర్వక కార్యాచరణ అవసరం అవుతుంది.

పనిముట్ల వాడకం వున్నతస్థాయి బుద్ధి కుశలతను లేదా భాష నుంచీ విభజించటానికి సాధ్యంకాని కొత్తరకం బుద్ధి కుశలత అవశ్యం చేస్తుందని వూహించవచ్చును. ఈ దశలో చేతికి సంబంధించిన సంచలన అంగాలను, భాషాంగాలను మెదడులో పక్కపక్కనే వుండే రెండు కేంద్రాలు అజమాయిషీ చేస్తాయి. ఈ కారణంతో మనం ఒక దాని నుంచీ మరొకదానికి 'వ్యాప్తి'ని సామాన్యంగా గమనించవచ్చును. చేతిచలనాలను స్వాధీనం చేసుకోటానికి కేంద్రీకృత కృషితో పిల్లలు నాలుకను కదపటం లేదా ప్రకాశంగా పదాలను వుచ్చరించటం నేర్చుకుంటారు. పిల్లలు మాట్లాడేటప్పుడు పెద్దవాళ్ళ కంటే స్వేచ్ఛగా చేతులను, తలను కదిలిస్తారు. మాటలను అనుసరించే ఈ కదలికలు ఆదిమ లక్షణాలు. ఆటవికులలో, వానర సదృశ జంతువులలో ఈ అవయవ కదలిక అతిగానూ, విస్తారంగానూ వుంటుంది. కొన్ని ఆదిమ భాషలలో మాటలకు అనుగుణ్యమైన అవయవ కదలిక సన్నిహితంగా అవిభాజ్యంగా వుంటుంది. చేతులను, తలను అనుగుణ్యంగా కదిలించకపోతే ఆ భాషల్లోని మాటలు పూర్తి అర్థాన్ని వ్యక్తం చేయలేవు. కాబట్టి 'వ్యాప్తి' ఎన్నడూ నాశనం కాకుండా వుండేటట్టు మాట్లాడటంలో మనం శ్రద్ధగా వుండాలి. దీనినుంచీ తొలి మానవుని శారీరక క్రియలను, వాటి సంకీర్ణతాస్థాయిని బట్టి ఏదో ఒక స్థాయిలో వుచ్చారణాంగాల ప్రతి స్పందనా చర్యలు అనుసరిస్తాయని వూహించ వచ్చును. తర్వాత యీ కంఠధ్వనులు శారీరక శ్రమలను నడిపించే సాధనాలుగా చైతన్యవంతంగా అభివృద్ధి పొందుతాయి. చివరకు ఆ కంఠధ్వనులు చేతుల ప్రతిస్పందనా చర్యలతో పూర్తిచేయబడే స్వతంత్రభావ ప్రసారవాహికలుగా రూపొందుతాయి.

(ii) రెండవ సంకేత విధానం

పరిణామ క్రమంలో జంతు ప్రపంచానికి సంబంధించిన అనేక రూపాలు అవయవ నిర్మాణంలోనూ, పనిచేసే రీతిలోనూ మారుతుండే ప్రకృతి పరిసరాలకు

అనుగుణ్యంగా మార్చుకుంటాయి. మెదడు పరిమాణం, సంకీర్ణతలు వున్నతజాతి జంతువులను తక్కినీ జంతువుల నుంచి వేరు చేస్తుంది. ప్రకృతి పరిసరాలకు వున్నత జాతి జంతువులు ఎక్కువ నైపుణ్యంతో, ఎక్కువ బుద్ధి కుశలతతో స్పందించ డానికి మెదడు పరిమాణం సంకీర్ణతలే కారణం.

మొదటి వెన్నెముకలేని జంతువులు భూమి మీద ఐదువందల మిలియన్ల సంవత్సరాలకు పూర్వమే అవతరించాయి. చేపలు నాలుగు వందల మిలియన్ల సంవత్సరాల పూర్వం, సస్తన జాతి జంతువులు రెండు వందల మిలియన్ల సంవ త్సరాల క్రితం, మనిషి మూడు మిలియన్ల సంవత్సరాల క్రితం పరిణామం చెందాయి. తుట్టతుదకు మానవుడు ఆవిర్భవించిన పరిణామాత్మక స్థాయిని మనం అధిరోహించటంలో నూతన లక్షణాలు అధికం కావటాన్ని ఈ వంఖ్యలను బట్టి మనం గ్రహించ వచ్చును. మానవ ఆవిర్భావం గుణాత్మక మార్పుఫలితంగా మాత్రమే వివరింపగలిగిన వేగవంతమైన క్రమ క్రమ అడుగుల అభివృద్ధితో విశిష్టమైంది. వేగ ఈ మార్పును మెదడు నిజవ్యాపార పరిధిలో విశ్లేషించే పద్ధతిని పావ్‌లోవ్ సంకల్ప చర్యల మీదరాసిన గ్రంధంలో నిరూపించాడు.

ప్రతిబింబం అనేపదాన్ని పావ్‌లోవ్ ప్రేరణకు ప్రతిక్రియ అనే అర్థంలో వాడాడు మననోట్లోకి ఆహారం పోగానే లాలాజలం దానిని చుట్టి మృదువుగా చేసి జీర్ణానికి అనువుగా చేస్తుంది. కుక్కల మీద క్రమబద్ధ పరిశీలన పరంపరలు చేసి పావ్‌లోవ్ నీటిలో ఆహార సంబంధం నరాల పోగులనుంచీ మెదడుకూ లాలాజలగ్రంధుల చలన స్థానమైన నోటి వెనక్కూ ప్రయాణం చేసే చలన పరంపరను ప్రారంభిస్తుందని నిరూపించాడు.

ప్రతిబింబ చర్యలు సంకల్పంగానూ వుండవచ్చు, అసంకల్పంగానూ వుండ వచ్చు. అసంకల్ప చర్య ఆగర్భంగా వుంటుంది. అసంకల్ప చర్య అభివృద్ధి కావ డానికి అవసర పరిస్థితులు జాతులలో ప్రతి ప్రాణికీ పుట్టుక నుంచీ వుంటాయి. కోడిపిల్ల ముక్కుతో పొడిచి తినటం నేర్చుకోదు- చిన్నబిడ్డ తల్లిపాలు తాగటం నేర్చు కోదు- ఇవి అసంకల్ప చర్యలు.

వాస్తవ ఆహార సంబంధం లేకుండానే లాలాజలం వూరేటట్టు చేయవచ్చును. కొన్ని సమయాలల్లో ఆహారాన్ని కంటితో చూడటమే, వాసనచూడటమే లాలాజలంతో నోరు తడికావటానికి సరిపోతుందని మనకు తెలుసు. ఈరకం ప్రతిబింబచర్య సంకల్ప

చర్య. కొన్ని వాసనలను, కొన్ని దృశ్యాలను ఆహారానికి గుర్తులుగా పరిగణించటం మనం నేర్చుకుంటాం.

'నేర్చుకోవటం' అంటే ఏమిటి? పావ్‌లోవ్ ఒక కుక్కకు క్రిమబద్ధ సమయానికి అన్నం పెట్టి, ఆ పద్ధతికి కుక్క అలవాటు పడిన తర్వాత ప్రతి ఆహార సమయానికి ముందు ఒక గంట మోగించేవాడు. తర్వాత గంట మోతకే కుక్కకు లాలాజలం ఊరటాన్ని గమనించాడు. ప్రయోగంలో సృష్టింపబడిన పరిస్థితులను అనుసరించి ప్రేరణ గంట మోతకు బదిలీ చేయబడింది. తర్వాత కొన్ని సమయాలలో గంట మోగించి అన్నం పెట్టలేదు. అప్పుడు లాలాజలం ఊరలేదు. అంటే కొత్త పరిస్థితులను అనుసరించి ఏర్పాటు చేయబడిన విరుద్ధ ప్రేరణ పూర్వం అలవాటైన ప్రతిబింబ చర్యను అణచివేసింది. ఇలాంటి సంకల్ప చర్యలు సక్రమంగా పనిచేసే మజ్జాముఖం (Cortex) లేకుండా పనిచేయవని పావ్‌లోవ్ నిరూపించాడు.

ఒక నిర్దిష్ట జంతువులోని అసంకల్ప, సంకల్ప చర్యలు మొత్తంగా కలిసి పావ్‌లోవ్ వివరించిన మొదటి సంకేత విధానమైన ఇంద్రియ వ్యాపార ఐక్యతగా రూపొందుతాయి. ఈ విధానం జంతువుల పరిణామాత్మక దశను అనుసరించి అభివృద్ధి పొందే లక్షణం. మనిషిలో ఈ మొదటి సంకేత విధానం పూర్తిగా కొత్తరకం ప్రతిబింబచర్యల పునాదిని సృజించే విధంగా సంకీర్ణంగా రూపొందుతుంది. ఈ కొత్తరకం ప్రతిబింబ చర్యలు మిగిలిన వాటితో కలిసి పనిచేస్తూ రెండవ సంకేత విధానంగా పరిణమిస్తాయి.

పావ్‌లోవ్ శిష్యులలో ఒకడు మరొక ప్రయోగాన్ని చేసాడు. ఒక చిన్నబిడ్డ వేలుకు విద్యుత్తును తగిలించాడు. ఆబిడ్డ తనవేలును లాగివేసింది. కొంతకాలం తర్వాత విద్యుత్తును తగిలించే ముందు ఒకగంట మోగించాడు. ఇలాచాలాసార్లు గంట మోగించగా బిడ్డ గంటమోతకే వేలును లాగేసింది. తర్వాత గంటమోత చేయటానికి బదులుగా ప్రయోగకారుడు 'గంట' అనే శబ్దాన్ని అనేకసార్లు పుచ్ఛరించాడు. బిడ్డ 'గంట' అని పుచ్ఛరించిన శబ్దానికి వేలు ముడుచుకుంది. తర్వాత మాట వుచ్ఛరించడానికి బదులుగా 'గంట' అనే పదాన్ని ఒకకార్డు మీదరాసి బిడ్డకు చూపించాడు. ఆమాటను చూసి బిడ్డ వేలుముడుచుకుంది. చివరకు బిడ్డ గంటను గురించి ఆలోచనకే వేలును ముడుచుకోవటం జరిగింది.

ఈ ప్రయోగం విద్యుదాఘాత ప్రేరణకు ప్రతిబింబ చర్యగా వేలును ముడుచుకోవటమనే అసంకల్ప చర్యతో ఆరంభమై గంట మోతకు వేలును ముడుచుకోవటమనే

సంకల్ప చర్యకు దారితీసింది. ఇది బాహ్యప్రేరణకు కేవల అనుగుణ్య స్పందనలు. ఈ రెండు కూడా మొదటి సంకేతవిధాన పరిమితుల్లోకే వస్తాయి. కాని బిడ్డ పదానికి సంబంధించిన ధ్వనికి చూడటానికి, ఆలోచనకు ప్రతిక్రియ ప్రదర్శించి నప్పటి స్పందనలు మొదటి సంకేత విధానానికి సంబంధించినవికావు. ఈ సందర్భాలలో పదాన్ని ప్రయోగించటం నుంచీ బిడ్డక్రియా శీలంగా సాధారణీకరించ గలుగుతోంది. పదం కేవలం మరొక సంకేతం కాదు, అది 'సంకేతాలకు సంకేతం' ఈ రకమైన స్పందనలు రెండవ సంకేత విధానానికి సంబంధించినవి. ఈ విధానంలో సహజ ప్రేరణలు జ్ఞానేంద్రియాల మీద పనిచేసే కేవల పరాశ్రయ ప్రకృతి దృగ్విషయాలు కాక ఆత్మాశ్రయ విలువతో సామాజికంగా శక్తిని పొందే కృత్రిమ ధ్వని. 'గంట' అనే పదధ్వనితో 'గంట' అనే వస్తువుకు సంబంధించిన అర్థాన్ని తప్ప మరొక అర్థాన్ని వ్యక్తం చేయలేని సహజశక్తి ఏమీలేదు. ప్రతిభాషలోనూ 'గంట' అనే వస్తువు విభిన్నపదాలతో వ్యవహరింపబడటం దీనికి నిదర్శనం. గంటరూపం సామాజికంగా నిర్ణయింపబడినట్టే, గంట సారాంశం కూడా సామాజికంగానే నియతం అవుతుంది. 'గంట' అనేపదం ఒకగంటమోత, ఒకగంట ఆకృతి, ఒకగంట వ్యాపారాలను తెలియ జేయటంతోపాటు ఏదోఒక గంటనే కాక అన్నిగంటలకు ప్రతినిధిగా వుంటుంది. 'గంట' అనే పదం ప్రత్యేక గంటల ప్రత్యేక గుణాల నుంచీ వేరుచేయబడిన సామాన్య లక్షణాల మొత్తం సంక్షేపానికి ప్రతినిధిగా వుంటుంది. సంగ్రహంగా ఆ పదం భావనను నిర్దేశిస్తుంది.

పావ్‌లోవ్ పరిశోధన లెనిన్ ప్రతిబింబ సిద్ధాంతాన్ని ప్రయోగాత్మక ప్రమాణంతో రుజువు చేసింది.

"పాండిత్య ప్రదర్శనా తత్వశాస్త్రంతో తప్పుదోవలో పడని ప్రతిశాస్త్రజ్ఞుని దృష్టిలో ప్రతి భౌతికవాది దృష్టిలో చైతన్యానికీ బాహ్యప్రపంచానికీ ఇంద్రియజ్ఞానమే ప్రత్యక్షబంధం. ఈ ఇంద్రియ జ్ఞానం బాహ్యప్రేరణకు సంబంధించిన శక్తి చైతన్యానికి సంబంధించిన వాస్తవంగా పరివర్తన చెందటం"1

(iii) సహకారం.

మనం ఇంతకు ముందే గమనించినట్టు రెండవ సంకేత విధాన పరిణామం మెదడు బాగా విశాలం కావటంతో స్పష్టంగా సంబంధించి వుండటాన్ని వున్నత సస్తన జాతి జంతువులలో చూడవచ్చును. ఈఅంశాన్ని సాక్ష్యాధారాలతో నిశ్చయంచేయవచ్చును.

1. లెనిన్ – కలెక్టెడ్‌వర్క్స్.

దెక్కల జంతువులలో ఎక్కువ భాగం చాలా వేగంగా వృద్ధి పొందుతాయి. మాంసం తినే జంతువులు నిస్సహాయంగా పుట్టి అనేక నెలలు పరాధీనంగా వుంటాయి. ఆదిమ జంతువులలో వానర సదృశ జంతువులు మొదటినెల వెనక భాగం మీద గడుపుతుంది. తర్వాత నెమ్మదిగా నడవటం నేర్చుకుంటుంది. మూడు సంవత్సరాలకు స్వాధీనంలోకి వచ్చి పది పదకొండు సంవత్సరాలకు పూర్తిగా ఎదుగుతుంది. మానవ శరీరం సం॥రం గడవకముందు అరుదుగా మాత్రమే నడవ గలుగుతుంది.

తక్కువ జాతి జంతువులకంటే ఆదిమ జాతి పున్నత జంతువులు ఆలస్యంగా పరిణతి పొందడం మాత్రమే కాక వాటి శరీర అంగాలన్నింటిలోను చివరగ పరిణతి పొందేది మెదడు. ఈ వ్యత్యాసం మనిషిలో ఇంకా ఎక్కువగా వుంటుంది. మనిషి మెదడు పుట్టిన చాలాకాలం తర్వాత పరిగణనలోకి వచ్చి శరీరంలో మిగిలిన భాగాలకంటే వేగంగా వృద్ధిపొందుతుంది. ఈ వికాసం మజ్జాముఖంలోని జీవకణాలనుకలిపే నరాల పోగుల నిర్మాణానికీ ముఖ్యంగా చేతులను, వేళ్ళను, నాలుకను, పెదాలను, అజమాయిషీ చేసే మెదడులోని రెండు కేంద్రాలకు సంబంధించి వుంటుంది. ఈ కేంద్రాలు ఇతర సంచలన కేంద్రాల కంటే చాలాపెద్దవిగా వుంటాయి. ఈ నిర్మాణం రూపొందుతున్న అపరిణత దశలోనే ఎక్కువకాలం శాశ్వతంగావుండే సంకల్ప చర్యలు స్థాపించ బడతాయి. మెదడు సంగతి అలావుంచి తొలిమానవుడు తన శరీర రక్షణ విషయంలో దాదాపు అనాథ అని మనం ముందే పేర్కొన్నాం. నిస్సహాయమైన చిన్న పిల్లలను పెద్దవాళ్ళు అసాధారణమైన దీర్ఘకాలం పెంచటాన్ని మనం ఇక్కడ దృష్టిలోకి తీసుకోవాలి. ఈ పరిస్థితి పనిముట్ల వాడకం బాషల అవసరం వుండే సామూహిక, శ్రమ అభివృద్ధిని అవశ్యం చేస్తుంది, సహకరిస్తుంది.

మనం నేర్చుకోవటం అని పిలిచే దానిని జంతుశాస్త్ర భాషలో సంకల్ప చర్యల నిర్మాణం అంటారు. వయసులో వున్న జంతువు అనుకరణతో నేర్చుకుంటుంది. అది తన తల్లిని అంటిపెట్టుకొని వుంటుంది. తల్లిని అనుసరిస్తుంది. తల్లిని వున్నది వున్నట్టుగా అనుకరిస్తుంది. ఈ శక్తి అజ్ఞాత శక్తిగా వుండి ఎక్కువ భాగం పరిణీత దశకు పరిమితంగా వుంటుంది. బాగాపెరిగిన జంతువుకు చిన్నవిషయాలను నేర్చుకోవటానికి కూడా చాలాకాలం పడుతుంది, పూర్వం అది నేర్చుకున్న విషయాలు కూడా ధానికి అతీతంగా వుంటాయి. కానీ ఈ సూత్రానికి ఒక ప్రధానమైన మినహాయింపువుంది. కోతులకు చైతన్యవంతమైన అనుకరణ శక్తివుంటుంది. ఆదిమ వున్నత జాతి జంతువులలో అనుకరణ అభివృద్ధికి స్త్రీలలో సంతానంతో కలసి మందలుగా పరస్పరం కలసి జీవించే అలవాటు నిస్సందేహంగా సహకరిస్తుంది.

చైతన్యవంతమైన అనుకరణం సహకారం వైపుగావేసే మొదటి అడుగు. ఇది పిల్లలలో బాగా కనిపిస్తుంది. పెద్దవాళ్ళు చేసే కార్యాలను కార్యం కోసమే అనుకరించిన తరువాత సకాలంలో పిల్లలు కార్య ప్రయోజనాన్ని భావించి ప్రయోజనానికి అనుగుణ్యంగా కార్యాన్ని సవరించి సహకారాన్ని నేర్చుకుంటారు. కాబట్టి అభివృద్ధి పొందిన చైతన్యవంతమైన అనుకరణ శక్తిని సహకారం సహజ విషయంగా అనుసరిస్తుందని మనం వూహించవచ్చు. కానీ పరిస్థితి అదికాదు. వానర సదృశ జంతువులు, కోతులు గొప్ప అనుకరణ శక్తి కలిగినవైనప్పటికి ఆకస్మికంగా, బలహీనంగా తప్ప అవి సహకరించు కోలేవు.

కాబట్టి సహకార అభివృద్ధికి పనిముట్లను భాషను వుపయోగించటం మీద సన్నిహితంగా ఆధారపడి వుంటుందని మనం భావించవచ్చును. సహకారం లేకుండా సహకారవాహిక, భాష వుండదు. అయితే సహకార వ్యాపారం ఏమిటి? ఒక మెదడుకంటే అనేక మెదళ్ళు గొప్పవనే దీనికి సులభమైన సమాధానం. ఇంత వరకు దృఢంగా నిలిచేస్థితికి అనుగుణ్యంగా మెదడును అభివృద్ధి చేసుకొని మన వానర సదృశ ప్రాచీనులు మెదడు ఇంకా అభివృద్ధి కావటంలో మాత్రమే ఉనికికి అవకాశం వుండే నూతన దశలో ప్రవేశించారు. వాళ్ళు ఇక ముందుకన్నా పోవాలి, నాశన మన్నా కావాలి. వాటి సంతానం అనేకం నాశనం అయినట్టు చారిత్రిక సమాచారం నిరూపిస్తున్నది. సహజ పరిమితులను దాటి మెదడు పరిమితులను విస్తృతం చేసుకోవటం వానర సదృశ ప్రాచీనులకు అనివార్యమయింది. ఈ విస్తృతిని అవి సామూహికంగా నిర్వహించాయి. ఇది వాటికి కొత్త ఆయుధాన్ని యిచ్చింది. తమ పరిసరాలకు అనుగుణ్యంగా కేవలం తమను తాము మార్చుకోవటంతో ఆగిపోక తమ అవసరాలను అనుసరించి జీవనాధారాలను వుత్పత్తి చేయటంతో అవి వాటి పరిసరాలను చైతన్యవంతంగా మార్చటం ఆరంభించాయి. కాబట్టి మనం విభజించి వివరించిన మూడు విషయాలు— పనిముట్లు, భాష, సహకారం— వుత్పత్తి శ్రమ అనే ఒకే క్రమంలో భాగాలు. ఈ క్రమం ప్రత్యేకంగా మానవీయమైనది. ఈ క్రమం నిర్మాణ కేంద్రం సమాజం.

(iv) వానర సదృశ జంతువులలో భాష, ఆలోచన.

భాష, ఆలోచనలు అతి సన్నిహితంగా కలసిపోయి ఆరంభం నుంచి అవిభాజ్యంగా వున్నట్టు కనిపిస్తాయి. కాని పరిస్థితి అదికాదు.

అక్షర భాషా శక్తి లేకపోయినప్పటికి వానర సదృశ జంతువులకు పరిపూర్ణంగా వుపయోగించే విశాల ధ్వనిరంగం వుంది. వాటికి అస్పష్ట ధ్వనుల వాచాలత్వం వుంది. ఆ ధ్వనులకు నిస్సందేహంగా వ్యక్తీకరణ శక్తి వుంది. అయితే ఆ ధ్వనులు కోపం, భయం, కోరిక, అసంతృప్తి వంటి అనుభూతిదశల వ్యక్తీకరణకే పరిమితంగా వుంటాయి. ఈ ధ్వనులతో సుఖంగా నిరంతర సంభాషణలతో గడిపే శక్తి వాటికి వుంటుంది. ఇది భాష మూలరూపం. కాని ఆలోచనతో సంబంధం లేని స్వచ్ఛ అనుభూతి.

వానర సదృశ జంతువులకు సులభ భావనలను భావించే శక్తి కూడా వుండదు. కానీ అందని పండును పట్టుకోవటానికి కర్రను వుపయోగించుటం వంటి ప్రకృతి వస్తువులతో వ్యవహరించేటప్పుడు, ఎదురయ్యే సామాన్య నిత్యజీవిత సమస్యలను పరిష్కరించే శక్తి వాటికి వుంటుంది. ఇది భాషతో సంబంధం లేని ఆలోచనల ప్రాథమిక రూపం.

ఇలాంటి విభేదం పిల్లలలో కూడా వుంటుంది. పిల్లల్లోకూడ ప్రారంభ దశలో భాష, ఆలోచనలు పరస్పరం స్వతంత్రంగా వుంటాయి. తర్వాత దశలో మాత్రమే భాష హేతుబద్ధం అవుతుంది. ఆలోచన వాక్య రూపం ధరిస్తుంది.

ఇప్పుడు మాట్లాడే టప్పుడు తలను చేతులను తిప్పేసంజ్ఞలను పరిశీలిద్దాం. పిల్లలలో రెండురకాల సంజ్ఞలు కనిపిస్తాయి. పిల్లలు తాము వాంఛించే చర్యకు ప్రేరణను కలుగచేసే అనుకరణ సంజ్ఞ ఒకటి. ఉదాహరణకు ఎత్తుకోబడాలనే కోర్కెను ఎత్తుకోబడే కార్యంలో వున్నట్టే పిల్లలు కాళ్ళను చేతులను లేపుతారు. ఈరకం సంజ్ఞలు చాలా చిన్నవయసులో అభివృద్ధి అవుతాయి. రెండవరకం చాలా కాలం తర్వాత కనిపించే మాట్లాడేశక్తి అభివృద్ధిలో నిర్ణయాత్మక దశకు గుర్తుగా వుండి ప్రత్యేకాలను చూపే సంజ్ఞలు. పిల్లలు వస్తువును నిర్దేశించి చూపి దృష్టిలోకి తెస్తారు. తర్వాత ఇక కార్యాన్ని మాటతో రూఢీ చేసి వస్తువులకు నామనిర్దేశం చేస్తారు. సంజ్ఞ వాక్య రూపం ధరించింది. తర్వాతిదశలో ఇదే మార్గంలో పిల్లలు తమ అనుకరణ సంజ్ఞలకు వాక్యరూపం ఇస్తారు. మాట చేయి కలిసి చేసే చర్య భావనల నిర్మాణానికి దారితీస్తుంది.

అనుకరణ సంజ్ఞ వానర సదృశ జంతువులలో సామాన్యం. ఉదాహరణకు ఒక చింపాంజీ చేతిని ఎత్తుతూ పిడికిలి బిగించే రూపంలో మరొక చింపాంజీని అరటి పండు ఇవ్వమని ప్రేరేపిస్తుంది. ఇలాంటివి అనుభూతి సంజ్ఞలైనప్పటికీ వస్తుగత విలువ

వుంటుంది. ఇవి మూగ ఆజ్ఞలు. ప్రత్యేకాలను నిర్దేశించే సంజ్ఞలు వానరసదృశ జంతువులలో చాలా అరుదు.

ఈ సమాచారంనుంచీ పనిముట్లను వుపయోగించటంతో అభివృద్ధిపొందిన సహకారం వానరుడు నరుడుగా పరివర్తన చెందటంలో నిర్ణయాత్మక అంశంగా భావించవచ్చును. మానవజాతి పూర్వదశలోని కూతలు, సంజ్ఞలు సామూహిక శ్రమలో సమ్మేళన, సమన్వయాలు పొంది ఒక కొత్త భావప్రకటనారీతిని రూపొందిస్తాయి. ఈ కొత్త భావప్రకటనారీతిలో ఇంద్రియాలతో గ్రహించబడే బాహ్య ప్రపంచ సాధారణీకరణ ప్రతిబింబానికి మూర్తి కల్పన చేసే శబ్దం ఏకైక మూలంగా వుంటుంది.

దీనిని భాషోత్పత్తికి సంబంధించిన శ్రమసిద్ధాంతంగా పిలవవచ్చును.

"మొదట శ్రమ; శ్రమతర్వాత, శ్రమతోకలిసి భాష— ఈరెండు వానర సదృశ జంతువు మెదడుతో ఎన్నో పోలికలతో బాటు ఎక్కువ పెద్దదైన, ఎక్కువ పరిపూర్ణమైన మనిషి మెదడుగా క్రమంగా పరిణామం చెందటానికి ప్రభావంచేసిన అతిముఖ్యమైన ప్రేరణలు."[2]

2. మార్క్స్, ఎంగెల్స్-సెలెక్టెడ్ వర్క్స్. 3వ సంపుటం. పే. 69

[జార్జి థామ్సన్ రాసిన మానవసారం (ది హ్యూమన్ ఎసెన్స్) అనే పుస్తకంలోని రెండవ అధ్యాయానికి త్రిపురనేని మధుసూదనరావు అనువాదం.]

రచనల కోసం విజ్ఞప్తి

ఆర్థిక ఇబ్బందులు, నిర్వహణా సమస్యలతోపాటు సృజన రచనల విషయంలో కూడ తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నది. కళా విలువలులేని నినాదప్రాయమైన పాటలు, కవితలు, మూసలోపోసిన ఫార్ములా పద్ధతి కథలు, ఇతర భాషల్లోని మంచి రచనలకు (చెడ్డ) అనువాదాలు తప్ప మౌలికమైన ఉత్తేజ కరమయిన కనీసం తృప్తికరమైన రచనలు రావడంలేదు. ముఖ్యంగా సాహిత్య విమర్శ, సమీక్షలు, మౌలికమైన సృజనాత్మక రచనలు కరువయినాయి. ఉత్తమమైన రచనలు పంపించి ప్రజాసాహిత్య ప్రమాణాలు ఉన్నతంగా కాపాడడంలో సృజనకు ఇతోధికంగా సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

— 'సాహితీ మిత్రులు'

శక్తి మేము ధారబోస్తే....

కె. మహిమదయాల్

శ్రమ మేము చేస్తేరో
సిరులు మీకు కలిగెరా
శక్తి మేము ధారబోస్తె
భుక్తి మీకు కలిగెరా
శ్రమ ఎవ్వరిది ఈ సిరి ఎవ్వరిది— అరె
శ్రమ మాదిరో ఈ సిరి మీదిరో ?

రాళ్లమీద చెమటంత
రాలుతుంటె బరువెత్తి
వీపుమీదవేసుకొచ్చి
మట్టిదొక్కి ఇటుకజేసి
బాధపడి బట్టిబెట్టి
కట్టెగొట్టి కాలబెట్టి
ఇటుకదెచ్చి ఇల్లుగడితె
బంగులెమో నాదంటివి
బద్మాషీ దొరకొడక ॥శ్రమ॥

కంకరంత కలిపిపోసి
దిట్టగ దిమ్మిస వేసి
సున్నందెచ్చి దంగుగట్టి
సుట్టూరుగ గోడబెట్టి
నట్టనడమ మేడగడితె
నడిఇంట్ల బండుకోని
నాది బంగులంటివిరో
నంగనాసి దొరకొడక
మేడ మేమే కట్టితిమి
పీడకున్న దొరకొడక ॥శ్రమ॥

తొల్లు తంగెల్లుగొట్టి
మొట్టుదీసి పుట్టదీసి
చెట్టుగొట్టి చెలుకజేసి
వంపుమిట్ట పంపుజేసి
ఎట్టిమేము చేస్తుంటె
పట్టాలుమీకాయెను
భూమిమాదే అంటవురో
బుద్ధిలేని దొరకొడక
చెట్టెవ్వరుగొట్టిరో
చెప్పర ఓ దొరకొడక ॥శ్రమ॥

ముసుర్లన్ని పెడుతుంటె
ముడుసుకోని తడుసుకుంటు
దున్నపోతులగట్టుకొని
దుక్కులన్ని దున్నినాము
గోనెచింపుకప్పుకొని
గోసిపేగు పెట్టుకోని
నడుములో కుల్లెల్లుతుంటె
నడ్డిరుగనారుమోసి
రక్తమంతనీరుజేసి
రాజనాలుపండిస్తె
రాశిమీదగూర్చున్నవు
రాజునని దొరకొడుక
నారెవ్వరు మోసిరో
నాకుజెప్పు దొరకొడక ॥శ్రమ॥

గడ్డపార గన్నుబట్టి
నూతులన్ని దీసినాము
మాడంత పండుతుంటె
తట్టలన్ని మోసినాము
తవ్వేడు సోడిస్తెమేము
తవ్వితిమి బావులన్ని

బావులేమో నాయంటా
    బలిసినవా దొరకొడక
దరులెవ్వరు దవ్వెరో
    దాండిగోడ దొరకొడక ॥శ్రమ॥

తట్టమోసి కట్టబోసి
కాల్వ కట్టలన్ని గట్టి
గండ్లుగలము లేసుకొచ్చి
నీరంత దీసుకొచ్చి
విల్లిజేసి చెర్వులోన
చెర్వు చేడిబోకుంట
నీటికావలి కాస్తుంటె
నీరటి కాన్నంటవురో
    నీతిలేని దొరకొడక
నీరడి పనిజేసేది
    నీవెనార దొరకొడక ॥శ్రమ॥

మా తాతలు, మా తండ్రులు
మా అమ్మలు, మా అవ్వలు
మా అన్నలు, కూలన్నలు
ఎట్టికష్టం చేసినారు

మన్నుదిని మన్నుగక్కి
మట్టలు మా న్యాలదున్ని
ఘనముగాను పంటదీసి
గరిసెలన్ని నింపితెను
గండు కుక్కలాగదిన్న
    గర్విష్ఠి దొరకొడక
నిండు జీతమివ్వకుండ
    నీవుదిన్న దొరకొడక ॥శ్రమ॥

బర్లగాసి గొర్లమేపి
సిరులు మీకు పెంచితిమి
మా శ్రమనె దోసుకోని
మజాగాను మేసినారు
మిగిలిన సొమ్మంత మీరు
మిద్దెలు గట్టించుకోని
ముద్దలాగ దిన్నరు
మొద్దోలె బండుకొన్నరు
మా కష్టం తింటివిరో
    మాయదారి దొరకొడక
మాదె సొమ్మంటివిరో
    మాయదారి దొరకొడక ॥శ్రమ॥

"మన భవిష్యత్తును మనం భగ్నం చేసుకోవద్దు. అది మనది; మన స్వంతం. ధనవంతుల దొరతనం నశించిపోతుంది. దాని చేవలోనే దాని చావు కనిపిస్తోంది. అన్నివర్గ ప్రభుత్వాలూ నశించినట్లె అదీ నశించిపోతుంది. అది అధర్మయుతమైంది. కాబట్టి అంతమైపోతుంది. బానిసత్వం, దాస్యం నశించిపోయినట్లుగానే, గర్వంతో నింగికెక్కి కూర్చున్న ధనస్వామ్యం అధికార శిఖరాగ్రాలమీంచీ అధఃపాతాళానికి కూలిపోతుంది. యిప్పుడైనాసరే దాన్ని పరీక్షగా పరిశీలిస్తే, ఎవరికైనా అది ముసలి వగ్గయిపోయిందని యిట్టే తెలిసిపోతుంది.

కొద్దిమంది కలసి చలాయించే యీ నిరంకుశ రాజ్యాధికారం యే ప్రతిఘటన, పోరాటం లేకుండానే తక్షణం నశించిపోతుందని నేను మీకు చెప్పలేదు. దాని అంతిమ యుద్ధం బహుశా సుదీర్ఘమూ, కష్టభూయిష్టమూ కావచ్చు. ఓ కార్మికవర్గ వారసులారా! ఓ భావియుగ సోదరులారా! భవిష్యత్తులో ఉదయించబోయే బాలల్లారా! పోరాడండి!"

[జాక్ లండన్ 'ఉక్కుపాదం'కు ఫ్రెంచి రచయిత ఆనటోల్‌ఫ్రాంస్ ముందుమాట నుంచి]

చలం జీవితపు ఛాయ - చలం రచన

భారత స్త్రీ దౌర్భాగ్యాన్ని, పిరికితనాన్ని, దీనత్వాన్ని చూసి చలం ఎంతగానో విలపించాడు. మండి పడ్డాడు. స్త్రీని శాశ్వతంగా బానిసత్వంలోకి నెట్టాలనుకున్న సంఘాన్ని, మతాల్ని, పురుష దురహంకారాన్ని అసహ్యించుకుని, కసిపెంచుకుని, తిట్టి, ముఖం మీద ఉమ్మి; స్త్రీ జాతిని వాళ్ళ వాంఛలకి, ఆశయాలకి, ఆలోచనలకి మేల్కొలిపి ధైర్యాన్నిచ్చి, తిరుగుబాటు చైతన్యాన్నిచ్చి ముందుకు నడపడానికి ప్రయత్నించినవాడు చలం.

"దేశాలకి దేశాలు కొట్టుకు పోతుంటే, యింకా పసుపు పారాణుల కోసం, అంటు తప్పాల మీద మెతుకుల కోసం, సిగ్గు బిడియాల కోసం గింజుకులాడే ముసలి అత్తల్నీ, శీల అశ్లీలాల కోసం తెలుగు కథకుల్ని, బడి టీచర్లనీ, పత్రికా విమర్శకుల్నీ చూసి నవ్వొస్తుంది, దిగులేస్తుంది" అని చలం అంటే అతడ్ని తెలుగుజాతి తిట్టుకుంది, భుజాలు తడముకుంది.

ఓటుహక్కు, ఉద్యోగ అవకాశాలు పొందిన నేటి స్త్రీల విషయమై "....అత్త అధికారం నుంచి, భర్త ఆధీనం నుంచి తప్పించుకుంటున్న నవీనస్త్రీ షోకులకీ, సంఘ గౌరవానికీ, fashionsకీ బానిస ఔతోంది. ఒక పురుషుడి నీడకింద నించుని లోకాన్ని ధిక్కరించగలిగే యిల్లాలు, ఈనాడు సంఘ గౌరవంపేర, విద్యపేర, ఉద్యోగంపేర, fashions పేర వెయ్యి మందికి దాస్యం చేస్తోంది. నవీనస్త్రీకి తనచుట్టూ స్త్రీలందరూ అత్తలైనారు" అని బాధపడతాడు చలం. నలుగురిలో "My darling wife", "My reverend husband" అని పిలుచుకుంటూ, ఇంట్లో తిట్టుకునే నాగరికపు జంటల్ని చూస్తే మంట చలంకి.

చలంకి నిర్దుష్టమైన నీతిలేదని చాల మంది నీతిపరుల ఆరోపణ ! ఏదైతే యింత వరకూ సంఘంలో నీతిగా చలామణీ అవుతున్నదో అదికాక తన ఆలోచనలకి ఒక ప్రత్యేకమైన నీతిని ఏర్పరచుకున్నాడు చలం. "కామాన్ని కట్టుకోమనడం అన్యాయమే, క్రూరమే. కాని కామాన్ని తీర్చుకోవటానికి హక్కువుంది కదా అని తమ తమ కామంతో యితర్లని బాధపెట్టడానికి యెవరికీ అధికారం లేదు- భార్యనైనా సరే"- అంటున్న చలం అభిప్రాయంలో నీతిలేదన గలమా ?

"తన మృదుత్వాన్ని, మనోలావణ్యాన్నీ, అమూల్యమైన నిర్మలత్వాన్నీ యెవడికి పడితే వాడికు విచక్షణ లేకుండా అనర్హుడైన వాడికి, తాత్కాలికంగా వాడి ముందు పారెయ్యడం, ఒక నిమిషపు కామం కోసం వృధాచెయ్యడం మూర్ఖమైన పని"

అని మనోదౌర్బల్యానికి లోనయ్యే స్త్రీలను చీవాట్లు పెడతాడు చలం. "ఎప్పుడో యే పురాతన కాలంలోనే రాసేసిన నీతులు యీ నూతన యుగపు నూతన వ్యక్తుల్ని సంతృప్తి పరచగలవా?" అని పురాతన నీతిని నిలదీసి ప్రశ్నిస్తాడు చలం.

పాతివ్రత్యం, పతివ్రతలు అంటే రోత చలంకి. భర్తదుర్మార్గాన్ని, నీచ ప్రవర్తనను అసహ్యించుకోకుండా ఒప్పుకునే పశుప్రాయురాలు, అనాథా, పిరికిదీ- వీళ్ళు పతివ్రతలు చలం ఉద్దేశ్యంలో. చాలమంది పురుషులతో స్నేహం కలిగి, తన భర్తతో తప్ప యితరులతో ఏ సంబంధానికీ ఒప్పుకోక పోయినప్పుడే నిజమైన పాతివ్రత్యం, అంటాడు చలం.

స్త్రీ సంఘ బానిస కాకూడదు. స్త్రీ తన వాంఛల్ని, అభిప్రాయాల్ని నిర్భీతిగా చెప్పుకునే పరిస్థితి పురుషులు, సంఘమూ కల్పించాలి. లేదా స్త్రీలు తిరుగు బాటుచేసి దుర్భర సంసార, సాంఘిక బంధనాలను త్రెంచేసుకుని స్వాతంత్ర్యం పొందాలి. జీవచ్ఛవాలై ఉండటం కంటే జ్ఞానమూ, బలమూ సంపాదించుకునే ప్రయత్నంలో చెడి పోవడమే నయం. ఇష్టం లేని భర్తతో భార్యకాని, భార్యతో భర్తకాని సంసారం చేయడం కంటే, యిష్టమున్న వ్యక్తితో లేచిపోవడం ఉత్తమం- ఇవి చలం గాఢంగా నమ్మిన అభిప్రాయాలలో కొన్ని. స్త్రీలకి సంపూర్ణ స్వాతంత్ర మివ్వకుంటే ఏదో ఒకరోజు స్త్రీజాతి పురుషాధిక్యతను, సంఘ దమన నీతిని, నరక ప్రాయమైన సంసారాల్ని ఎదిరించి పోరాడుతుందని; ఆర్థిక, సాంఘిక స్వతంత్రతని సాధించు కుంటుందని, చలం దృఢ విశ్వాసం.

చలం సౌందర్యారాధకుడు, అన్వేషి. సృష్టిలో ఎన్నో అందాల్ని చూడగలిగిన వ్యక్తి చలం. అందాలకీ, శృంగారాలకీ శత్రువులైన మనుష్యులు చాల త్వరలో అన్ని విధాల అంతరించి పోతారంటాడతను. స్త్రీలలో, నదుల్లో, పసిపాపల్లో, పూవులలో, పిట్టలలో, యిరు సంధ్యల్లో సౌందర్యాన్ని దర్శించి 'ఆత్మానందం' పొంద గలిగాడు చలం. అలా పొందలేని వాళ్ళని చూసి జాలి పడతాడు. జాలి పడటం బాగానేఉంది; కాని భౌతిక దృక్పథంతో చూచినపుడు మనచుట్టూ ఉన్న ప్రపంచంలో అందం కంటే ఎక్కువగా బాధ, దుఃఖము, సమస్యలూ, పేదరికం అల్లుకుని ఉన్నాయి, వీటిని గుర్తించక పోవడం, అందాల్ని మాత్రం గుర్తించడం భావవాద, దృక్పథం; సమస్యల నుండి పారిపోవడం.

మతమూ, నీతి, వేదాంతము మాట్లాడే మనుషుల్ని ఏమాత్రం నమ్మవొద్దని, వాళ్ళందరికీ మతమూ, నీతి ఏమాత్రం లేవని ప్రజల్ని హెచ్చరిస్తాడు చలం. అమలులో

వున్న కట్టుబాట్లకి యెదురు తిరగగల అవసరము, సామర్థ్యమూ ఉన్న మనుషులు ఏ కాలంలోనైనా కొద్దిమంది ఉంటారు; తన తిరుగుబాటు వల్ల తనకిగాని, ఇతరులకి గాని మేలు జరగాలంటే తను కోరే స్వేచ్ఛని అందరికీ అంగీకరించాలన్నది అతని దృక్పథం మతాల్ని, కులాల్ని, సాంప్రదాయాల్ని, చాందస భావాల్ని, కట్టుబాట్లని, విగ్రహారాధనని ఖండించిన చలం ఈశ్వర వాదంలో నమ్మకం పెట్టుకున్నాడు. బ్రహ్మసమాజపు బోధనలు అతని ఈశ్వర వాదాన్ని దృఢపరిచాయి. ఈ విశ్వం యింత అందంగానో, అనాకారిగానో ఉండటానికో చైతన్యశక్తి కారణమని, ఆశక్తి ఈశ్వరుడని చలం విశ్వాసం. ఈ నమ్మకమే జీవితపు చివరిదశలో అతన్ని అరుణాశ్రమానికి నడిపించింది; ఎందరో చలం అభిమానుల్ని తికమకపెట్టి, జవాబు చెప్పకోలేని స్థితిలో పడవేసింది. ఇది చలం జీవితంలో కొందరనుకున్నట్లు ఆశ్చర్యకరమైన, ఊహించని మలుపు ఏమీ కాదు. శరీరక సంబంధం కంటే 'ఆత్మ' సంబంధానికి, 'ఆత్మ' ప్రేమకి, 'ఆత్మా' నందానికి విలువనిచ్చిన చలం ఆఖరి మజిలీ అరుణాశ్రమం.

సాహిత్యం విషయంలో చలంకి కొన్ని స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. "నాతో నా వ్రాత మారుతుంది. నాకలలు, నా ప్రేమలు, నాఆశలు, నానిరాశలూ, అన్నిటినీ పాడుతుంది– నాకలం" అంటాడు చలం. చలం దృష్టిలో– కవిత్వానికి జీవితానికి సంబంధం ఉండాలి. హృదయంలో నుంచి వొచ్చిందా? లేకపోతే ఉత్త చమత్కారమా అనేది ముఖ్యం కవిత్వానికి. ఏదో గొప్ప స్ట్రగుల్ కావాలి గొప్ప కవిత్వం రావడానికి. కళ యెప్పుడూ మానవుడు ఔనత్యాన్ని అందుకోవాలని చేసే ప్రయత్నాన్ని ప్రతిఫలిస్తుంది. అందు వల్లనే జీవితంతో సంబంధం కలిగి ఉంటుంది. కళకి యేదో విషయం కావాలి కదా అని తెచ్చిపెట్టుకుని వ్రాసేవారు చాలమంది. ఉన్న పరిస్థితులకి ఎదురీదనివాడు, ఎక్కడో సంఘంతో విరోధం కల్పించు కోనివాడు గొప్ప కళను సృష్టించలేడు.

గొప్ప కావ్యం వ్రాయాలంటే పదాలుకాదు, సమాసాలుకాదు, వ్యాకరణంకాదు కావలసింది ఆత్మఔన్నత్యం, struggle, rebellion– అంటాడు చలం. ఆత్మ ఔన్నత్యం సంగతి చలంకి తెలియాలికాని, జీవితంలో సంఘర్షణ తిరుగుబాటులేంది గొప్ప కవిత్వం రాదన్నది అక్షరాల నిజం. ఇంకోళ్ళ ఆజ్ఞల ప్రకారం తన కళని వంకర తిప్పటం, కళని ధనానికి దాస్యం చేయించే బానిసత్వం– క్రమంగా కళాకారునిలోని జీనియస్‌ని, స్వేచ్ఛని, ధైర్యాన్ని చంపేస్తుంది. ఇంక జన్మకి తను కలలుకనే అందాన్ని అందుకోలేడు– అన్నది చలం అభిప్రాయం. కళకి ప్రజాదృష్టి

పడడం మంచిదికాని, వ్యాపార దృష్టికాదు. తన కళ ప్రజాహృదయాల్లో పలకడం ఏ కళాకారునికైనా ఉన్నతాదర్శం. కళలో రసం ఉండాలంటాడు చలం. అతనిలోని సౌందర్య దృష్టినుండీ పుట్టుకొచ్చిందే యీ రసపిచ్చి.

“ప్రజలకి అర్థంకాని భాషలో, లేక అనుభవానికి దూరమైన ఉపమానాలతో, ఊహలతో, ఆలోచించే పద్ధతులకి వ్యతిరేకమైన నడకలతో వ్రాస్తే ఎంత విపరీతమైన గొప్పదనం వున్నా ఎక్కడా పలకదు” అంటాడు చలం. ప్రజలలో తమ రచనలు పలకాలనుకున్న ప్రతి రచయితకు చలం యీ అభిప్రాయంతో పేచీ ఉండనక్కరలేదు.

చలం రచనల్లో శైలిని, స్త్రీపాత్రల పోషణని ప్రస్తుతం విశ్లేషించ తలచ లేదు.

సంఘ సంస్కర్తలమని చెప్పుకునే వాళ్ళని, జంతు బలులు జరక్కుండా శాసనం చెయ్యాలనే భూత దయా పరుల్ని చూస్తే అనుమానం చలంకి; వీళ్ళలో చాల మంది దొంగలని, మోసగాళ్ళని. వీళ్ళను గూర్చి చలం “ఎవరో జంతు బలులు జరక్కుండా శాసనం చెయ్యాలనే వాళ్ళకి యెంతదయ జంతువుల మీద ! పంజరాల్లో చిలకల్ని వదలమని సత్యాగ్రహం చెయ్యరాదూ ? జంతు ప్రదర్శనశాలల బోనులు విరగ తన్నరాదా? సర్కసులకి మనుషుల్ని వెళ్ళి చూడ వద్దని ప్రచారం చెయ్యరాదూ? బలిపడే జంతువుల రెండు సెకండ్ల బాధ పెద్దపులులు నాలుగు గజాల బోనుల్లో యావజ్జీవనమూ పడే బాధలో యెన్నోవంతు? కటికవాడి చేతుల్లో చచ్చే పడుచు ఆవు బాధకన్న, గో సంరక్షణ వాళ్ళ ఆత్మలకి స్వర్గం వొచ్చేందుకు, ఊరేగింపులో కాళ్ళీడ్చుకుంటో తిరిగే ముసలి రోగిష్టి ఆవుల బాధ యెన్ని రెట్లు?

హృదయాల్లో నిజమైన దయాస్రవంతి వుదయమైనప్పుడు జంతు బలుల వేపు కాదు; దిన దినమూ మనయెదుట జరిగే నరబలుల వైపు ప్రవహిస్తుంది ముందు.

ఏం తింటున్నాము, ఏం చంపుతున్నామని కాదు ప్రశ్న : హృదయంలో యెంత దయ, యెంత సానుభూతి వుందనేది ముఖ్యమైన విషయం. ప్రజలని కొరుక్కు తినకపోతే చాలు దయాపరులు”— అని నిశితంగా విమర్శిస్తాడు చలం.

కుహనా సంఘ సంస్కర్తలను విమర్శిస్తూ చలం “ఏదికీర్తి, ఏదిడబ్బు. ఏదిఅధికారం, ఏదిఇంద్రియ లాభం ? ఏదిగొప్ప ? ఏది popular దాన్ని వాసన చూసుకుంటో పోతున్నాయి, ఈ ప్రజా ప్రేమికుల ముఠాలు” అంటాడు.

మానవుడి మనోశక్తి లోకంలో శక్తులన్నిటి కంటే గొప్పదని, ఆశక్తి భయంకరమైన గాలి, వేడి, విద్యుచ్ఛక్తుల్ని కూడ అదుపులో ఉంచగలుగుతోందని చలం విశ్వాసం.

సాంఘిక, ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురైన నిరుపేదల్ని, నిర్భాగ్యుల్ని, అట్టడుగు ప్రజానీకాన్ని చూస్తే జాలి చలంకి. చలం ఆలోచనల్లోని క్షమించరాని లోపమేమిటంటే— పేదరికానికి మూలాన్ని, అందులోని దుఃఖాన్ని, దుర్భరత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక పోవడం. చలం అభిప్రాయం ప్రకారం— పేదరికం కేవలం మానసికమైంది. ధనవంతుల చూచి అగ్రహించడం ఈర్ష్య. మహారాజు భోజన పదార్థాలకీ దరిద్రుడి భోజన పదార్థాలకీ లక్ష భేదం ఉండవచ్చుకాని వాటి ఆరోగ్యపు విలువగాని, ఆనందపు విలువగాని సమానమే కావచ్చు. లేక పోవడంలో లేదు బాధ, లేదని యేడవడంలో వుంది బాధ. దీన్ని బట్టి చూస్తే చలంకి ఆర్థిక సమస్యలపైన, ఆర్థిక వ్యత్యాసాలపైన సరైన అవగాహన లేదని తెలిసి పోతుంది.

పేదవారు యింకా నిరుపేదలు కావడానికి, ధనవంతులు యింకా కోటీశ్వరులు కావడానికి ఆర్థిక అసమానతలు, ధనిక వర్గం సాగిస్తున్న దోపిడీ, కారణాలని చలం గుర్తించలేదు. పేదరికం మానసికమైంది కాదు. మొదట అది భౌతికమైంది. భౌతిక పరిస్థితులే మనసును ప్రభావితం చేస్తాయి. ఆర్థిక, రాజకీయ, సాంఘిక స్థితి గతులే మనిషి జీవన సరళిని నిర్ణయించే అంశాలు. కేవలం చలం అనుకున్నట్లు భావాలు కావు.

సౌందర్యారాధన, పేదరికంపై చలంకి ఉన్న అపోహ మానవజాతి మొత్తంగా, దోపిడీకి గురౌతున్న పేదల సమస్యల వైపుగాక, మానవ జాతిలో సగభాగమైన స్త్రీల సమస్యలవైపు అతని దృష్టిని మరల్చాయి. అట్టడుగు ప్రజానీకం ధనికవర్గ, పాలకవర్గ దోపిడీ నుండి విముక్తి కావడంతోనే స్త్రీ స్వాతంత్ర్యం ముడి పడి ఉందని చలం గ్రహించ లేదు. ఇవి రెండూ వేరు వేరు అన్న దృక్పథంలో కొట్టుకపోయాడు. ధనిక వర్గం, పాలక వర్గం, అగ్ర కులాలవారు— వీళ్ళు కుమ్మక్కై— తమ క్రింది వర్గాల, కులాల ప్రజలని శాశ్వతంగా అజ్ఞానంలో, మూఢత్వంలో, బానిసత్వంలో బంధించడానికి ఏర్పరచిన నీతి, సాంఘిక న్యాయం, సాంప్రదాయం, కట్టుబాట్లే స్త్రీజాతి దుర్భర జీవన పరిస్థితులకు విష బీజాలని చలం గుర్తించ లేకపోయాడు.

విపరీతమైన వ్యత్యాసాలతో, రుగ్మతలతో యీ సమాజం యింకా యిలానే కొనసాగడానికి చలం ఒప్పుకోడు. మార్పు కావాలంటాడు. ముఖ్యంగా అతను కోరు

కునేది స్త్రీజాతి నిర్భయంగా తమ హక్కులని, బాధ్యతలని నిర్వర్తించగలిగిన స్వేచ్ఛ నిచ్చే సామాజిక మార్పు. సమాజంలోని చాలా రుగ్మతలు పోవాలంటే కమ్యూనిజం తప్పదంటాడు చలం. సమాజంలోని సమస్యలన్నిటికీ కమ్యూనిజం గొప్ప జవాబు. మనుషులకి ఈ లోకంలో మిగిలిన ఒక గొప్ప దూరపు కల అది, అని చలం అభిప్రాయం. కమ్యూనిజం స్త్రీకి రాజ్యాంగంలో ఆర్థికంగా సంపూర్ణ వ్యక్తిత్వమిస్తుందని చలం ఆశ.

చలంకి కమ్యూనిజంపై అభిమానంతోపాటు ఆరోపణలు, భయాలు ఉన్నాయి. కమ్యూనిజం, కమ్యూనిస్టుల గూర్చి చెబుతూ చలం "నాహృదయంలో ఎందువల్లనో దేశ భక్తి పలకదు. పలకడమే సంభవిస్తే జీవితము వేరే మార్గాన పట్టేది. అట్లానే కమ్యూనిస్టులు మాట్లాడే గుడ్డి చిలుక పలుకుల్ని విని ఎల్లప్పుడు ఏవగింపు కలుగుతుంది. కాని ఆస్తుల్ని, అసువుల్ని, అస్తికల్ని ఒక విశ్వాసం కోసం అర్పిస్తున్న యీ జనాన్ని చూస్తున్నప్పుడు, ఆ పొక్కు త్యాగం వల్ల వాళ్ళ పాదాల ముందు నాశిరసు వొంగుతుంది....

కమ్యూనిజంలో వుండే గొప్పశక్తి ఏమిటంటే, ఏ విషయాన్నైనా సరే– ఆరోగ్యము, విద్య, ఆర్థిక విధానము, దేవుడు, నీతి దేనినైనా సరే– పాత బూజుల్ని దులిపి, ఈనాటి ప్రజాక్షేమపు దృష్టితో చూడగలగడం– పెద్ద బలహీనతేమిటంటే కమ్యూనిజ సిద్ధాంతంలోంచి తప్ప దేనినీ చూడలేకపోవడం, బలహీనత కాదేమో! ఎంత తర్కంతోనూ, సత్య ప్రదర్శనంతో కూడ కమ్యూనిస్టు విశ్వాసాన్ని చలింప చెయ్యలేము. అదే వాళ్ళ బలం...."

"కమ్యూనిజం తప్పదు; కమ్యూనిజం వల్ల చాలా భౌతిక బాధలు పోతాయి. కాని తన ప్రయత్నంలో అంతకన్న విలువైన విషయాన్ని నాశనం చేస్తుందేమోనని, కమ్యూనిజం భౌతికం కన్న వేరైన విలువల్ని అంగీకరించడం లేదు. నిర్దాక్షిణ్యంగా చెట్టులోని జీవనాన్ని ఒకపక్క నాశనం చేస్తేనేగాని చెట్టుచీడని వదల్చలేదు. కమ్యూనిజం డబ్బు విలువల్ని రూపుమాప చూస్తుంది. డబ్బు విలువల మీద గట్టిగా దృష్టి నిలపడం వల్ల, యింకే విలువలూలేనట్టు" అంటాడు.

చలం దృష్టిలో, కమ్యూనిజం నాశనం చేస్తుందన్న విలువలు సౌందర్యదృష్టి, ఆధ్యాత్మిక, శృంగారదృష్టి. చలం అపోహ పడినట్లు కమ్యూనిస్టులు సౌందర్యానికి, శృంగారానికి విముఖులు కాదు. కానీ సౌందర్యం, శృంగారం యివి రెండే జీవిత

సర్వస్వం అనుకునేటంత మూర్ఖులూ కాదు. వీటిని జీవితంలో ఒక భాగంగా మాత్రమే గుర్తిస్తారు. అంత కంటే ప్రముఖమైన సామాజిక జీవిత సమస్యలకే ప్రాధాన్యత ఇస్తారు కమ్యూనిస్టులు. ఇక, ఆధ్యాత్మిక దృష్టికి కమ్యూనిజానికి ఎల్లప్పుడూ చుక్కెదురే. ఆధ్యాత్మిక దృష్టికి ప్రేరణ పలాయన వాదం, నిరాశావాదం. ఈరెండింటికి కమ్యూనిజంలో చోటు లేదు. ఉంటే అది కమ్యూనిజం కాదు. చలం అనుకున్నట్లు, చెట్టుచీడని వదల్చడానికి చెట్టులోని జీవనాన్ని నాశనం చేయరు కమ్యూనిస్టులు. పై పెచ్చు చెట్టులోని జీవనాన్ని కాపాడడానికి చీడ పురుగుల్ని మాత్రం నాశనం చేస్తారు.

చలం "కమ్యూనిస్టుమానిఫెస్టో", కమ్యూనిస్టు సాహిత్యాన్ని చదివినా కమ్యూనిజంలో గట్టి నమ్మకం అతనికి కలగక పోవడానికి కారణం భావాల విశృంఖలత్వం, సౌందర్య, రసదృష్టి, కమ్యూనిజంపై అతనికున్న అపోహలు, అనుమానాలు. వీటిని నివృత్తి చేసుకోవడానికి అతను ప్రయత్నించినట్లు కనపడదు.

ఎందరు అభిమానించినా, అంత కంటే ఎక్కువ మంది అవమానించి, విమర్శించినా, తిట్టినా, దుమ్మెత్తిపోసినా ఇరవయ్యో శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో గొప్ప సంచలనాన్ని సృష్టించిన వారిలో చలం ఒకడు. తను నమ్మిన ఆశయాల, అభిప్రాయాల బాటలో నడిచిపోయిన బాటసారి చలం.

చివరగా, చలం తన రచనల్ని గూర్చి చెప్పిన మాటలతో యీ వ్యాసాన్ని ముగిస్తాను–

"నా రాత ఏ శ్రుతులు, అపశ్రుతులు పలకనీ– అది నేను; నా రక్తం; నా గడచిన జీవితపు ఛాయ–"

– సి. రామచంద్రారెడ్డి

"మానవ సమాజం తరతరాలుగా సంతరించి పెట్టుకొన్న భౌతిక, ఆధ్యాత్మిక విలువల సముదాయాన్నంతటినీ కలిపి సంస్కృతి, లేక నాగరికత అంటాము. ఏ కాలపు సంస్కృతికైనా దాని పునాది భౌతికమే."

ఈ చట్టాన్ని సవరించటం కాదు, నిర్మూలించాలి.

సిఎచ్. శివారెడ్డి

ఈ చట్టం న్యాయాన్ని కాపాడటానికి కాదు
అన్యాయాన్ని అట్టే ఉంచడానికి
అందుకే ప్రజలు విప్లవిస్తారు
చట్టం పునాదులే కదిలిపోతాయి.

సమాజం అభివృద్ధి చెందుతూ వుంది. సమాజం అభివృద్ధి చెందటం అంటే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని బట్టి ఉత్పత్తి సంబంధాలు ఏర్పడతాయి. ఉత్పత్తి సంబంధాల మొత్తం సారాంశం వాస్తవ పునాది ఐన సామాజిక ఆర్థిక నిర్మాణం, దానిమీద ఉత్పన్నమయ్యే నిశ్చిత సామాజిక చైతన్య రూపాలను తెలియజేసే న్యాయ, రాజకీయ ఉపరి నిర్మాణం. ఒకదశలో ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని ఆటంక పరుస్తాయి. అప్పుడు ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలపై తిరుగుబాటు చేస్తాయి. అదే సామాజిక విప్లవం. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిఆర్థిక పునాదిలో మార్పును తీసుకవస్తుంది. ఆర్థిక పునాదిలో మార్పు ఉపరి నిర్మాణమైన న్యాయ, రాజకీయాలలో మార్పుకు దారితీస్తుంది.

కానీ కొందరు మేధావులు, న్యాయశాస్త్ర కోవిదులు, న్యాయవాదులు న్యాయశాస్త్రం (చట్టం)లో తీసుకవచ్చే మార్పు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో మార్పుకు దారి తీస్తుంది అంటున్నారు. ఇది చైతన్యం ద్వారా పదార్థాన్ని నిర్ణయించడమే అవుతుంది. ఇది తలకిందుల సిద్ధాంతం. న్యాయశాస్త్రవేత్తలు దీనికి తార్కాణంగా భూసంస్కరణ చట్టం, కార్మిక (లేబర్) చట్టాలు చూపుతున్నారు. ఏ చట్టాన్నైనా మనం పరిశీలించినప్పుడు ఆ చట్టం ఏ చారిత్రక పరిస్థితులలో చేయబడింది, ఏ ఉపయోగం కోసం చేయబడింది, మొత్తంగా ఏ వర్గ ప్రయోజనానికి అది దోహదం చేస్తుంది అని పరిశీలించాలి. ఆ చట్టం అమలు పరచటంలో ఎంత వరకు ఫలితాన్ని సాధిస్తూ వుంది అనికూడ ఆలోచించాలి. ఆచరణలో ఫలితాన్ని సాధించలేని చట్టం నిష్ప్రయోజనం.

న్యాయ శాస్త్రవేత్తలు చెబుతున్నట్లుగా భూసంస్కరణల చట్టం సమాజంలోని ఆర్థిక, రాజకీయరంగాలలో ఏ మార్పును తీసుకవచ్చింది? భూసంస్కరణల చట్టాన్ని అమలుచేయటానికి ఏర్పాటుచేసిన కోర్టులకు, ఇతరత్రా అయిన ఖర్చులకు కూడా సమానం కాని భూములు కూడ మిగులలేదు అని మన ప్రభుత్వ నాయకులే అంటున్నారు.

భూసంస్కరణల చట్టం ఈ రోజుచేసిన చట్టం కాదు. రైతాంగం ఎప్పుడైతే, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తుందో అప్పుడు వివిధ రూపాలలో ఈ చట్టాలు ఏర్పడుతున్నాయి. పేదరైతులు జమిందారీ విధానాలకు జాగీర్‌దారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడు, జమీందారులను, జాగీర్‌దారులను, ఎస్టేటులను రద్దుచేస్తూ ఈ ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. తెలంగాణాలో ప్రజలు భూస్వామ్య విధానానికి, నైజామ్‌కు వ్యతిరేకంగా పోరాటం సాగించిన ఫలితంగా 1951 వ సంవత్సరంలో భూసంస్కరణల చట్టం చేయబడింది. కానీ ఆ చట్టం అమలు పరచటంలో 160 ఎకరాల భూమి కూడ మిగులలేదు. అంటే వాస్తవానికి మిగులులేక పోలేదు; భూస్వాములు చూపలేదు. ఉపరి నిర్మాణం మీద పునాది, దానిమీద ఉపరినిర్మాణ ప్రభావం వుంటాయి. అయితే చట్టం ప్రభావం ఆర్థిక విధానంమీద చాల తక్కువ మాత్రమే. చట్టం, అమలులోవున్న ఆర్థిక విధానం, అంటే ఆస్తిసంబంధాలను అట్టేవుంచటానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి సామాజిక పురోగమనంలో చట్టం పాత్ర అతిస్వల్పం. ఒకవేళ ప్రజల్ని మభ్యపెట్టటానికి, అనివార్య చారిత్రిక కారణాలవల్ల ఏదైనాచట్టం చేయబడినా, దానిఅమలు చేసే అధికారం ప్రభుత్వానిదే కాబట్టి సక్రమంగా అమలుజరగదు. కారణం ప్రభుత్వం పాలకవర్గ ప్రయోజనాలను కాపాడే రాజ్యాంగ యంత్రం కావటమే.

ఉదాహరణకు 1972 సంవత్సరపు భూపరిమితి చట్టం.

ఈ చట్టం నగ్జల్‌బరీ, శ్రీకాకుళ పోరాటాలు, వివిధ ప్రాంతాల ప్రజలు భూమి కోసం చేసిన పోరాటాల ప్రభావం కారణంగా వచ్చింది. కానీ అమలుచేసే క్రమంలో వాస్తవంగా మిగులు భూమిని చూపలేదు. భూస్వాములు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చినప్పుడల్లా చట్టంలో ఒక్కొక్కసవరణ చేయబడింది. భూస్వాములు మైనరు కుమారులను మేజర్లు చేయటంవల్లనో, కుమార్తెలస్థానంలో కుమారులు పుట్టినట్లు రికార్డులు సృష్టించటంచేతనో, లేనికాలువలు, గుంటలు, గనిమలు ఏర్పరచటం వలననో తమ భూములను మిగులు లేకుండా చూపించ గలిగారు. అప్పటికీ భూములు మిగులువుంటే పాత అగ్రిమెంటుల ద్వారా కాగితాలలో ఇతరులకు స్వాధీనముచేసి మిగులు చూపకుండా జాగ్రత్త పడ్డారు. కాబట్టి భూపరిమితి చట్టం వల్ల సమాజంలో మార్పురాకపోగా, మార్పుకొరకు జరిగే పోరాటాలను ఆపటానికి ప్రయత్నించింది.

లేబర్ చట్టాల పరిస్థితి ఇంత కంటే మెరుగేమీలేదు.

చలనం పదార్థ ధర్మం. మార్పులేకుండా ఏదీలేదు. ప్రతిదీ మారుతూ వుంటుంది. ఉదాహరణకు భూమిని పరిశీలించినప్పుడు సాధారణ మనిషి భూమి నిశ్చ

లంగా వుంది, అది మారటంలేదు అని కూడ అనుకుంటాడు. అదే భూగర్భ శాస్త్రవేత్త "వేల సంవత్సరాలు జరిగే కొద్దీ నిశ్చలంగా కనబడే భూమి ప్రగాఢమైన మార్పులకు గురిఅవుతూ వుంది. గాలి, నీరు, వేడి మొదలైన వాటి రసాయన చర్యల వలన, ఇతర ప్రభావాల వలన భూమి మొత్తం రూపాంతరం చెందుతుంది" అంటాడు. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ ప్రకృతిలో వచ్చే మార్పును కూడ మానవుడు పసి గట్టగలుగుతున్నాడు. నిర్జీవ పదార్థాలే చలనం కలిగి మార్పుకు గురి అవుతున్నప్పుడు, జీవం చైతన్యం కలిగిన మానవ సమాజం మార్పులేకుండా ఎలావుండగలదు?

సమాజంలోని ఆర్థిక విధానంలోని మార్పు ఉపరి నిర్మాణంలో ద్యోతక మవుతుంది. సమాజంలో మార్పుఅంటే ఆర్థిక విధానంలోని మార్పు అనిఅర్థం. సమాజంలో వస్తున్న మార్పు చట్టాలలో మార్పుకు కారణమవుతుంది. పాత చట్టాలు కొత్త సమాజానికి పనికిరావు. కొత్త సమాజం అంటే కొత్త ఆర్థిక విధానం ఏర్పడినప్పుడు కొత్త చట్టాలు వస్తాయి- అంతేకానీ కొత్త చట్టాలు చేయటంవల్ల కొత్త సమాజాలు పుట్టవు. అయితే ఏ దశలోనైనా పాలకవర్గాలే చట్టాలు చేస్తాయి. బానిసవిధానం అమలులో వున్నప్పుడు బానిస యజమానులు చట్టాలు చేశారు. బానిసలు మాత్రం తిరుగుబాటు కూడ చేయటానికి వీలులేని విధంగా చట్టాలుండేవి. ఆరోజు బానిస యజమాని బానిసను చంపే హక్కు కూడ కలిగివుండేవాడు. ఆర్థిక విధానంలో మార్పు రావటంతో చట్టాలలో కూడ మార్పులు వచ్చాయి. బానిస సమాజంలో లేబర్ చట్టాలు చేయటానికి అవకాశంలేదు. పెట్టుబడిదారీ ఆర్థికవిధానం రావటంతో లేబర్ చట్టాల అవసరం పెట్టుబడిదారులకు ఏర్పడింది. కార్మిక వర్గం రాజ్యాధికారానికి వచ్చినప్పుడు ఆ వర్గం మొత్తం ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కాబట్టి ప్రజల చట్టాలు రూపొంది అమలుచేయబడుతాయి. శావగ్నీ (Savagny) అన్నట్టు "చట్టం ప్రజలతోపాటు అభివృద్ధి చెందుతుంది- పటిష్టమవుతుంది- అంతిమంగా ఒక దేశం తన జాతీయతను కోల్పోయినప్పుడు చస్తుంది." ఇంకోవిధంగా చెప్పాలంటే వర్గసమాజం వున్నంత వరకూ చట్టాలుంటాయి. వర్గాలు రద్దు అయినప్పుడు రాజ్యాంగ యంత్రమూ రద్దవుతుంది- చట్టం కూడ అదృశ్యమవుతుంది.

ఈరోజు భారతదేశంలో ప్రజలచట్టం అమలులోవుండటానికి వీలులేదు. ఇక్కడ అర్థవలస, అర్థ భూస్వామ్య విధానం అమలులో వుండటంచేత భూస్వాములు, దళారీ బూర్జువాల వర్గ ప్రయోజనాన్ని కాపాడే చట్టం అమలులో వుంటుంది. అందుకే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రూపొందించిన చట్టాలే ఇప్పటికీ అమలులో వున్నాయి.

ఈ చట్టాలు ప్రస్తుత ఆర్థిక విధానాన్ని అట్టేవుంచటానికి దోహదం చేస్తాయి. ఈ ఆర్థిక విధానం మారాలనీ, దోపిడీ విధానం నాశనం కావాలనీ కోరే ప్రతి ఒక్కడూ ఈ చట్టం దృష్టిలో నేరస్తుడే. కొందరు న్యాయమూర్తులు ప్రజలకు న్యాయం చేయాలన్నా ఈ చట్టాలు అనుమతించవు. అయినా ప్రతి న్యాయమూర్తి ఈ దశలో చట్టాలను యాంత్రికంగా అన్వయించడానికి బదులు సామాజిక మార్పును సృజనాత్మకంగా అన్వయించాల్సిన అవసరం ఎంతైనావుంది. కానీ కొందరు ఉన్నత న్యాయమూర్తులు ప్రభుత్వానికి తమ విధేయతను తెలుపుకోవటానికి చట్టాలను యాంత్రికంగా అన్వయించి ప్రజలకు, సామాజిక పురోగమనానికి అన్యాయం చేస్తున్నారు.

ఉదాహరణకు ఇంతా రమణారెడ్డిగారి కేసు తీసుకోవచ్చు. ఈ కేసులో న్యాయమూర్తి చిన్నపరెడ్డిగారు సామాజిక ఆర్థిక పరిస్థితులను, పురోగమన విధానాన్ని అర్థంచేసుకుని సామాజిక పరిణామాన్ని కొంత సృజనాత్మకంగా అన్వయించి, ఇందులో ముద్దాయిలు రమణారెడ్డి, ఆయన అనుయాయులకు ఏమాత్రం స్వార్థంలేదని, ఇక్కడవున్న భూస్వామ్య దోపిడీని నిర్మూలించాలనే అత్యున్నతమైన ఆశయంతో వారు ఒక భూస్వామిని ఖతం చేశారు కాబట్టి వాళ్ళకు మరణ దండన విధించడం సరికాదు అని తీర్పునిచ్చారు. కానీ సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తులు చట్టాన్ని యాంత్రికంగా అన్వయించి న్యాయమూర్తి చిన్నపరెడ్డిగారి తీర్పు చట్టేతరంగా వుంది కాబట్టి పునర్విచారణ జరపాలని చెప్పారు. దీనిని బట్టి భారత దేశంలో చట్టం ఎవరి ప్రయోజనాల కొరకు వుందో అర్థమవుతూ వుంది. భూస్వాముల చేతులలో రోజుకో మరణాన్ని అనుభవిస్తున్న రైతు కూలీలకు చట్టం (న్యాయం) లేదు. ఒక భూస్వామి ఒక హరిజనుణ్ణి నిలువునా కాల్చినా కేసులేదు. ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసులు రాక్షసంగా కాల్చిచంపినా అడిగే హక్కు ఈ చట్టానికి లేదు.

ఈ దేశంలో దొంగతనాలు చేయడం నేరం కానీ దోపిడీలు చేయటం పెద్ద నేరం కాదు. బియ్యంలో రాళ్ళు కలిపినా, తినే అన్నంలో విషం కలిపినా 6 సంవత్సరాల కంటే శిక్ష లేదు. భారత ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో చేస్తున్న కుట్రలను బహిర్గతం చేసినా, ఈ దోపిడీ విధానాన్ని నిర్మూలించి దోపిడీలేని ఒక కొత్త సమాజాన్ని, సమసమాజాన్ని రూపొందించాలని చెప్పినా ఈ చట్టం మరణదండనను కూడ విధిస్తుంది. ఇప్పుడు భారతదేశంలో అమలులోవున్న చట్టం ఈనాటి చట్టంకాదు. ఇది మధ్య యుగాలనాటి చట్టం. అందుకే ఈ చట్టంలో సవరణ కాదు- ఈ చట్టం నిర్మూలన కావాలి.

పోలోని వాడివే — మా వాడివే....

ఇటీవల కాలంలో దేశ ప్రజలందరినీ ఆకర్షించింది పోలీసుల ఆందోళన. తను ఖాకీ దుస్తులల్లో, బూట్లు, లాఠీలతో గంభీరంగా కనిపించే పోలీసులకు కూడ సమస్యలు వుంటాయన్నది కాపేపటికోపం అణచివేతకు మారుపేరయిన ఆ వేషమూ, ఆ పోలీసు అనే మాట పక్కకుపెట్టి ఆలోచిస్తే సులభంగానే అర్థమవుతుంది.

ఒక్క పంజాబ్ ఉదాహరణే తీసుకుంటే అక్కడ పోలీసు శాఖలో 28,000 కానిస్టేబుళ్ళు, 3,600 హెడ్ కానిస్టేబుళ్ళ పని చేస్తున్నారు. సమ్మెలుచేసి పోలీసుల లాఠీ చార్జీలకు, బాష్పవాయు ప్రయోగాలకు, ఒకోసారి కాల్పులకు కూడ గురయ్యే కార్మికులకు పని గంటల నియమం వుందిగానీ ఈ పనులన్నీ చేయడానికి పనిముట్లుగా ఉపయోగపడుతున్న పోలీసులనే యంత్రాలకు తీరికలేదు. పోనీ నష్టపరిహారమో, ఓవర్ టైమ్ కట్టివ్వడమో కూడ లేదు. వారానికో సెలవు సంగతలావుంచి ఎలాంటి సెలవులూ లేవు.

దొర తిట్టే జీతగానికి పేరుంది. దానికి తిట్టు విశేషణాన్ని, రారా పోరా సంబోధనను చేర్చవచ్చుగాని తనకు పేరుందని దొరకు తెలుసని అది తనకు కూడ దొర జ్ఞాపకం చేస్తుంటాడని జీతగానికి తెలుసు.

కానిస్టేబుల్‌కు నెంబర్ మాత్రమే వుంది. అవమానకరమైన, అసభ్యకరమైన నిందాపూర్వకమయిన అధికారుల ప్రవర్తనే అతడెరిగిన మర్యాద. పై పోలీసాఫీసర్లు మాత్రమే కాదు రాజకీయ నాయకులు కూడ అతని మీదికి సవారే. (నిజానికి ఆ అగ్గిరవ్వే కదా పంజాబ్ పోలీసుల అగ్నిపర్వతాల్ని బద్దలు చేసింది, లావాను ఎగజిమ్మింది. ఒక ఎంఎల్ఎ గారికి కానిస్టేబుల్ సలాం చేయలేదు. తాగిన మైకంలో వున్న ఎంఎల్ఎ గారికి కానిస్టేబుల్ తాగివున్నా డనిపించింది. పేదవాళ్ళు జ్వరంతో కాలిపోతుంటే జ్వరమంటే తెలియని పెద్దవాళ్ళకు వాళ్ళు తాగినవాళ్ళలా కనిపిస్తారు.) వెట్టిచాకిరీకి శిక్ష అమలు చేయవలసిన పోలీసు అధికారుల ఇళ్ళలో పోలీసుల వెట్టిచాకిరీ. ఒక పోలీసు కానిస్టేబుల్ చెప్పినట్లు "వాళ్ళు (ఆఫీసర్లు) మాతో తమబూట్లు పాలిష్ చేయించుకుంటారు. బట్టలుతికించుకుంటారు. ఇంటి దగ్గర పనిచేసే పనిమనుషులకన్న మమ్మలను హీనంగా చూస్తారు. చివరకు మా కుటుంబాలతో జీవించే అవకాశమే మాకివ్వరు."

బ్రిటిష్ ప్రభుత్వకాలంలో చేయబడిన పోలీసు రూల్సే ఇంకా అమలులో వున్నాయి.

పోనీ వాళ్ళ ఆర్థిక పరిస్థితి ఏమైనా మెరుగ్గావుందా- పంజాబ్ పోలీసుల ఉదాహరణే తీసుకుంటే కానిస్టేబుల్ జీతం 125-2$^1/_2$-150 గ్రేడ్‌లో వుండి. ఈ ఆందోళన పుణ్యమా అని ఏడవ రోజునవే దీనిని 400 - 10 - 450 - 15 - 600 - 20 - 660 కి పెంచారు. హెడ్ కానిస్టేబుల్స్ గ్రేడ్ 150-4-190 నుంచి ఇప్పుడు 450-700కి పెరిగింది. అదేం చిత్రమోకాని పోలీసు కానిస్టేబుళ్ళకు ఎక్కువ మంది పిల్లలుంటారు. అందరిలా క్రమబద్ధమైన సంసార జీవితం వుండక పోవడం కారణమేమోపరి మానసిక శాస్త్రవేత్తలు పరిశోధించాలి.

ఈ ఆందోళన ఫలితంగా గెజెట్‌లో ప్రకటించిన సెలవులకు ప్రత్యామ్నాయంగా పంజాబ్ పోలీసులకిపుడు నెలర్రోజుల అదనపు జీతం దొరుకుతుంది.

కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళు, కింది తరగతి ఆఫీసర్లు సాధారణంగా పేద, మధ్య తరగతి రైతాంగం నుంచి, హరిజనుల నుంచి వస్తారు. మొరార్జీ కొడుకో, ఇందిర కొడుకో కానిస్టేబుల్ కావడం ఊహించలేని విషయం. పోలీసుల్లో అత్యున్నత హోదాల్లోవున్న అధికార్లు ధనికరైతుల నుంచి, వ్యాపారరంగం నుంచి, ఉన్నత వర్గాల నుంచి, వర్ణాల నుంచి వచ్చినవారు. పాలకవర్గ పార్టీలకు చెందిన చాలామంది రాజకీయ నాయకులు కూడ ఈ వర్గాలకు చెందిన వాళ్ళే కాబట్టి సాంఘికంగా, సాంస్కృతికంగా, మానసికంగా పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయనాయకులు ఒకరి కొకరు చాల సన్నిహితంగా వుంటారు. అంతేకాకుండా ఆఫీసర్ల బదిలీలు ప్రమోషన్లు ఈ రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే వుంటాయి. అవాంఛనీయమైన, సంఘ వ్యతిరేకమైన చర్యలన్నీ రాజకీయనాయకులు, వారిబంధువులు, వారిస్నేహితులు ఈ పోలీసు అధికారుల మద్దతుతోనే చేస్తారు. అయితే విషాదమెక్కడ అంటే ఈ పనులన్నీ అధికార్లు కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఎస్ఐల తోనే చేయిస్తారు. ఈ భయానక నిర్బంధకృత్యాలు ఎమర్జెన్సీలో పరాకాష్ఠ నందుకున్నాయి. నైతిక, మానవ, రాజ్యాంగ విలువలు అన్నీ మట్టిగలిశాయి. ఎమర్జెన్సీ అంతమైంది. షాకమీషన్లు, భార్గవా కమీషన్లు పుట్టి కొన్ని నోరునొచ్చేలా అరచి చచ్చాయి, కొన్ని బతికి బట్టకట్ట కుండానే చచ్చాయి. ఈ విషవలయం యధావిధిగా సాగుతూనేవుంది.

పోలీసుల్లో వచ్చిన ఈ ఉద్రిక్తతలో వర్గపోరాట స్వభావం లేదుగానీ వర్గవైరుధ్యాల వ్యక్తీకరణ వుంది. పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు ఉన్నత వర్గాలవారు కాగా ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్ళు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కింది తరగతి ఆఫీసర్లు కింది వర్గాలకు చెందినవాళ్ళు. ఈ వర్గ వైరుధ్యం ఏదోరూపంలో వ్యక్తం కాక తప్పదు.

విశాల ప్రజానీకంలో చైతన్యం పెరుగుతున్నట్లుగానే తమ మౌలిక మానవ హక్కుల గురించి, ప్రజాస్వామ్య హక్కుల గురించి చాల ఏళ్ళుగా ముఖ్యంగా ఢిల్లీ పోలీసుల ఆందోళన, యుపి పోలీసుల ఆందోళన కాలం నుంచి పోలీసులకు కూడ స్పృహ పెరిగింది. పోలీసుల్లోకి విద్యావంతులైన యువకులను చేర్చుకోవడం కూడ ఇందుకు దోహదంచేసి వుండవచ్చు. విద్యావంతులైన యువకుల్లో నిరుద్యోగం పెరి గినా కొద్దీ ఇది అనివార్యం.

ఇవ్వాళ దేశవ్యాప్తంగా పోలీసులు ఆందోళన చేస్తున్న ముఖ్యమైన కోరిక యూనియన్ పెట్టుకునే హక్కు. మన హక్కుల ఖజానాలో ఎప్పుడూ మరో హక్కు సాధించడాని కవసరమైన ప్రాథమిక హక్కును భద్రపరచుకోవాలి- అదే సంఘం పెట్టుకునే హక్కు. పోలీసులు కోరిన ఇతర డిమాండులు : 1) పోలీసు కమీషన్ నివేదిక ప్రచురణ, 2) ఎనిమిది గంటల పని నియమం లేదా అదనపు పనికి అదనపు వేతనం, 3) వారానికో సెలవు, గెజెట్‌లో ప్రకటించిన సెలవులు, ఇతర సెలవులు లేదా వీటికి నష్టపరిహారం, 4) ఆఫీసర్లు, రాజకీయ నాయకులు అవమానకరమైన, అసభ్యకరమైన మాటలు వాడకుండా వుండుట, 5) ఆర్డర్లీపద్ధతి రద్దు అంటే వెట్టిచాకిరీ రద్దు, 6) వేతనాల పెంపుదల, ఇంక్రిమెంట్లు, అలవెన్సుల హెచ్చింపు, 7) గృహ వసతి, 8) టెరికాట్ యూనిఫామ్‌లు.

పంజాబ్‌లో ఈ డిమాండులతో పంజాబ్ పోలీసు యూనియన్ పేరుతో చాల చోట్ల పోస్టర్లు పడ్డాయి.

అకాలీ జోతేదార్లు, శాసన సభ్యులు, వాళ్ళ బంధువులు, మద్దతుదార్లు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పోలీసులను కొట్టిన ఉదంతాలు కూడ వున్నాయి. ఇప్పటి ఈ ఆందోళన కూడ పైన ప్రస్తావించినట్లుగా ఇటువంటి సంఘటనతోనే రగుల్కొన్నది.

మే 5వ తేదీన గోవిందపుర్‌లో దలీప్‌సింగ్ పాంధే అనే అకాలీ ఎం ఎల్ ఏ ట్రాఫిక్ డ్యూటీలోవున్న ఒక పోలీసు కానిస్టేబుల్‌ను కొట్టాడు. ఆ కానిస్టేబుల్ చేసిన నేరమేమిటయ్యా అంటే ఎంఎల్ఏ గారికి శాల్యూట్ చేయలేదు. కానిస్టేబుల్ డ్యూటీ మీద తాగివున్నాడని ఎంఎల్ఏ ఆరోపించాడు. వైద్య పరీక్ష చేసిన డాక్టర్ కానిస్టే బుల్ తీవ్రమైన జ్వరంతో వుండడం వల్ల సరిగా చూడలేకపోయాడని చెప్పాడు.

ఈ సంఘటన నిప్పురవ్వగా పనిచేసింది. పాటియాలాలో రెండు వందల మంది పోలీసులు ఊరేగింపు తీసి ఎనిమిది గంటలు ప్రదర్శన చేసారు. రెండు రోజుల్లో

పంజాబ్ అంతా వ్యాపించింది. ప్రదర్శనలు, ఊరేగింపులు, సభలు ప్రతి జిల్లా కేంద్రంలోనూ, పట్టణాల్లోనూ జరిగాయి. ఇది ఇతర రాష్ట్రాలకు కూడ వ్యాపించింది. రాజస్థాన్, గుజరాత్ ముఖ్యంగా పేర్కొన దగ్గవి. ఒక అహ్మదాబాదులో తప్ప మిగతా అన్నిచోట్ల ఎన్ని కవ్వింపు చర్యలు ఉన్నా పోలీసులు ప్రశాంతంగా ఆందోళన కొనసాగించారు. ఒక్క పంజాబ్‌లోనే ఇప్పటికి 800 కి పైగా అరెస్టు చేసారు. రెండు వేల మందిని ఉద్యోగాల్లోంచి తీసివేయాలని ఆలోచిస్తున్నారు. మూడు వందల మందిని అప్పుడే తొలగించారు కూడ. ఆందోళనకారులను శిక్షించడానికి జైళ్ళలోనే రహస్య విచారణ (ఇన్ కెమెరా ట్రయల్స్) నిర్వహించాలని అకాలీ - జనతా ప్రభుత్వం నిర్ణయించింది. ఆందోళనాకారులను అణచివేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతోవున్నది. పంజాబ్ పోలీసు యూనియన్ ఎక్కడ ప్రదర్శన చేయ తలపెట్టినా అక్కడ ప్రభుత్వం దారులన్నీ మూసివేస్తున్నది. వచ్చి పోయే ప్రతి వాహనమూ ఆపి వెతుకుతున్నది— ఎవరైనా పోలీసులుంటే అరెస్టు చేద్దామని. కాబట్టి నలభై జిల్లాల ప్రతినిధులతో ఏర్పడిన పంజాబ్ పోలీసు యూనియన్ ఒక రహస్య సమావేశంలో దీర్ఘకాలిక ప్రతిఘటన ద్వారా ప్రభుత్వం ఈ ప్రతీకార చర్యలు విరమించుకొని తమ డిమాండులన్నీ నెరవేర్చేదాకా పోరాటం కొనసాగించి అరెస్టులకైనా సిద్ధం కావాలని నిర్ణయించింది.

ఈ ఆందోళనకు విస్తృతమైన సహాయ సహకారాలు వున్నాయనడానికి మొత్తం పంజాబును సరిహద్దు రక్షక దళానికి (బి.ఎస్.ఎఫ్), కేంద్ర రిజర్వు పోలీసుకు (సి.ఆర్.పి) అప్పగించడాన్ని బట్టే తెలుస్తున్నది. కొన్నిచోట్ల పోలీసుల నణచడానికి సైన్యాన్ని కూడా తేవలసి వచ్చింది. ఆయుధాగారాల కాపలాను బిఎస్ఎఫ్, సిఆర్పి లను కూడా నమ్మక సైన్యానికి అప్పగించారు.

మరో గమనించ వలసిన అంశం ఏమిటంటే సాధారణంగా పోలీసుల చేతుల్లో వేధింపబడి, దౌర్జన్యానికీ హింసకూ గురి అయ్యే సామాన్య మానవులు కూడా ఈ ఆందోళన పట్ల సానుభూతి చూపారు. దాదాపు అన్ని ప్రగతిశీల ప్రజాతంత్ర సంస్థలు, ట్రేడ్‌యూనియన్లు, విద్యార్థిసంఘాలు, కిసాన్ సభలు పోలీసు ఆందోళన కారులకు తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. పోలీసులకు మద్దతుగా వాళ్ళు ప్రదర్శనలు చేసి అరెస్టయ్యేంత దూరం కూడా పోయారు.

మానవత్వాన్ని మొత్తం హరింపచేసే స్వభావం గల విధినిర్వహణ, మర యంత్రాలుగా మార్చే శిక్షణ పోలీసులను ఎంత మొద్దుబార చేస్తాయంటే ప్రజలపట్ల ఎంత క్రూరంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించేలా చేస్తాయంటే వాళ్ళకు తమ హక్కుల

కోసం పోరాడుతున్న తమ వర్గం సోదరుల భావాలనూ, బాధలనూ అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. వాళ్ళు యిప్పుడు ప్రజలనుంచి తామెట్లా వేరు చేయబడి ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వంతో అధికార స్వామ్యంతో దుర్వినియోగ పరచుకోబడుతున్నదీ తెలిసొస్తున్నది.

ఈ ఆందోళనను ఎట్లా ఎదుర్కోవాలనే విషయంలో రెండు వైఖరులు కనిపిస్తున్నవి. సైన్యాన్ని పిలిచి మొదటినాడే యీ ఆందోళనను తీవ్రంగా అణచివేయాలని పంజాబ్ పోలీస్ యిన్స్పెక్టర్ జెనరల్ అనుకున్నాడు. ఒక సాయుధబలం ఆందోళనను అంతకంటే శక్తివంతమైన మరొక సాయుధబలంతో అణచాలని ఆయన సూచన. మొదటినాడు అదిసాధ్యం కాలేదు. ఐ జి పి తీసుకున్న యీ తీవ్రవైఖరిని ఆర్ ఎస్ ఎస్ జనసంఘ లాబీ, భూస్వామ్య వర్గాల లాబీ, అకాళీదళ్‌లోని ఉన్మాదులు బలపరిచారు. వీళ్ళదే తర్వాత పైచేయి అయింది. ఫలితంగానే బి ఎస్ ఎఫ్, సీ ఆర్ పి, కొంతవరకు సైన్యం కూడా రంగంలోకి వచ్చాయి. కాని బ్యూరాక్రసీలో ఒక వర్గం, కొంత మంది క్యాబినెట్ మంత్రులు పోలీసులతో సంప్రదింపులు జరిపి వాళ్ళ కోరికలు సానుభూతితో పరిశీలించాలన్నారు. కర్రపెత్తనం దృక్పథం పనికిరాదని, పోలీసులను యింకెంతో కాలం యింటి సేవకులుగా చూడడం కుదరదన్నారు.

ఏడవరోజున పంజాబ్ ప్రభుత్వం ఎప్పుడైతే ఒక్కసారి నూరు రూపాయల జీతం పెంచేసిందాన్ని బట్టి ప్రభుత్వం దండోపాయాలను రెండిటినీ సామభేదాలను రెండిటినీ సమతూకంలో వాడదలచు కొన్నదని అర్థమవుతున్నది. ఒక వెంపన పంజాబ్ వేతన కమిషను సిఫారసు చేసిందానికన్నా ఆర్థిక సౌకర్యాలను ప్రకటించింది. మరొక వెంపన తమ సమస్యలను వీధుల్లోకి తీసుకపోయిన పోలీసు వాళ్ళకు తక్కిన వాళ్ళందరూ చూసి భయపడేంతగా గట్టి వాత పెట్టడానికి కృతనిశ్చయమై వున్నది.

ఎక్కువ ఆర్థిక సౌకర్యాలు కూడా పోలీసులనేమీ తృప్తి పరచలేదు. అన్ని తీర్ల నిరసన ప్రదర్శనలు అసాధ్యమైపోయినప్పుడు వాళ్ళిప్పుడు ఆందోళనను దీర్ఘకాలికం సాగించి అరెస్టు కావాలని నిర్ణయించుకున్నారు.

ఈ ఆందోళన పోలీసుల్లో ఆర్థిక, యితర ప్రజాస్వామిక హక్కుల కోసం కలిగిన యీ చైతన్యం దేశంలో తప్పకుండా కొత్త పరిణామాలకు దారితీస్తుంది. ఈ [క్రిమశిక్షణాయుత] క్రింది శ్రేణులు తామింతకాలమూ పాలకవర్గాల చేత సామాన్య ప్రజలకి వ్యతిరేకంగా అమానుషంగా ఉపయోగించుకో బడ్డామని గ్రహిస్తారు. పోలీసులకు యూనియన్లు వస్తే ప్రజాతంత్ర ఉద్యమాలను అణచివేయడానికి తాము ఉపయోగ

పడ కూడదనే ఒక సంఘ చైతన్యం కలుగుతుంది. కింది పోలీసు అధికారులకు కూడా వున్న అవినీతి, లంచగొండి తనం, చెడ్డపేరు తొలగిపోవడానికి కూడా తోడ్పడవచ్చు. కాని ఈ యూనియన్లు నామమాత్రపు యూనియన్లో, కీలు బొమ్మ యూనియన్లో ప్రభుత్వమూ, పోలీసు ఉన్నతాధికారులూ పోలీసుల కొరకు పెట్టిన యూనియన్లో అయితే అవి తప్పకుండా ప్రజాస్వామ్య వ్యతిరేక స్వభావంగల వ్యక్తుల చేతుల్లోకి పోతాయి. ఉన్నతాధికారులూ వారితొత్తుల చేతుల్లో పడుతాయి. అప్పుడవి ప్రజలను అణచివేయడానికి మరింత శక్తివంతమైన పనిముట్లవుతాయి. అంటే ఫాసిజానికి ఉపయోగపడే పోలీసు యూనియన్లు అవుతాయి. కాని కనీసం పంజాబ్ పోలీసు ఆందోళన యీ ప్రమాదాన్ని కూడా గుర్తించి జాగ్రత్త పడుతున్నదనే సూచనలనిస్తున్నది. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బలపరచకుండా ప్రజలపై అణచివేత పనిముట్లుగా వుపయోగపడడానికి నిరాకరించకుండా ప్రజల సహకారాన్ని కోరే నైతికహక్కు తమకు లేదని పోలీసులు గుర్తించిన నాడే వాళ్ళ న్యాయమైన హక్కులు సాధించుకోగలరు. అప్పుడు మాత్రమే ప్రజలకూ, పోలీసు కానిస్టేబుళ్ళకూ మధ్య సద్భావం పెరుగుతుంది.

[సుబాసింగ్ గిల్, అమర్‌సింగ్ ఆజాద్ జూన్ 2 ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జూన్ 9 ఫ్రాంటియర్‌లలో రాసిన వ్యాసం ఆధారంగా - వరవరరావు 21-6-79]

నీకూ, నాకూ — మనకు తెలుసు

భారత్ బాబు

అవునన్నా: నీవూ మా వాడివే
మా రక్తం పంచుక పుట్టిన వాడివే
గుప్పెడు గింజల కోసం
మనస్సునీ, శరీరాన్ని కూడా
తాకట్టు పెట్టాల్సిన జాతికి
నీవూ ప్రతినిధివే
కడుపు చించుకుంటే
కాళ్ళ మీద పడుతుంది
ఆ సత్యం నీకూ తెలుసు
మన వేలితో మనకన్నే
పొడవగల నేర్పరులు
వాళ్ళు నిన్ను నన్ను వేరుచేశారు

నాపై నిన్ను ప్రయోగిస్తున్నారు
అవసరం కాని డ్రిల్లులతో
అర్థంలేని క్రమశిక్షణతో
నీలోని మనిషిని చంపేస్తున్నారు
పశువును వెలికి తీస్తున్నారు
కళ్ళకు గంతలు కట్టి,
భుజాన తుపాకి బెట్టి,
గానుగ ఎద్దును జేసి
ఈవ్యవస్థకు నిన్ను కట్టేస్తున్నారు
విరామ మెరుగని "విధి" తో
నిన్ను చుట్టూ తిప్పుకుంటున్నారు

మరో ప్రపంచాన్ని,
మహా ప్రపంచాన్ని,
కోరిన వీరుల గుండెలు
ఆ ఒరిపిడిలో నలిగి, ముద్దలై
నెత్తురు ఒక్కొక్క బొట్టూ కారుతుంటే
దానితో వాళ్ళఅత్తర్లు వండుకుంటున్నారు
నీకింత ఎండుగడ్డి పడేస్తున్నారు
తమ తెలివికి తామే మురిసి పోతున్నారు
కాని, మాకు తెలుసు
ఈ మోసం ఎంతో కాలం దాగదనీ
ఈ దోపిడి ఎల్లకాలం సాగదనీ
మాకు తెలుసు

నీవూ మనిషివనీ; మా వాడివనీ
మనసుందనీ, ఆలోచించే మెదడుందనీ
తమ రక్షణకై ధనస్వాములు
నీ చుట్టూ అల్లిన పశుత్వపు జడత్వాన్ని
ఛేదించే వెలుగు నీలో దాగుందనీ
మాకు తెలుసు.

మన అందరి కష్టాన్ని దిగమింగి
బొజ్జలు పెంచుకునే యాజమాన్యపు
భయంకర స్వార్థాన్ని
అన్నను తమ్ముడిపైకి ఉసిగొల్పి
శత్రు నిశ్శేషం గావించే పాలకజాతి
క్రూర కుటిలత్వాన్ని
నీవు గ్రహించే రోజు
దగ్గరలోనే ఉందని
మాకు తెలుసు.
అన్నా,
మాకు తెలుసు.

నీవూ నేనూ ఒకటిగ నిలచిన నాడు,
ఈ పీడక జాతి తుడిచి పెట్టుకపోతుందనీ
ఆరోజు తొందరలోనే వస్తుందనీ,
నీకూ, నాకూ
మన శ్రామికవర్గ మంతటికీ,
తెలుసు
ఈ నిజం మనకు తెలుసు.

రోడ్డు మీద సూర్యుడు

కె. రాంమోహన్‌రాజు

రోడ్డంతా కదిలి కదం తొక్కుతున్న సైన్య సంగీతం
ఊరిమీద అలవోకగా వాలిన మబ్బు తునక
బెదిరి పారిపోయింది
పర్వతాలు పట్టుకుని పాకుతూ వస్తున్న
బాలసూర్యుడు స్వర్ణ కేశాలింకా సవరించుకోక ముందే
రోడ్డుమీద నిలువెత్తు మంటలు
అగ్ని తూలికలు ఉష్ణీషాలు ధరించి
ఖడ్గ సంగీతాలు పాడుతూ పొరలుతూ, కెరలుతూ
అలలు అలలుగా, పొరలు పొరలుగా
సూర్య సంతానం సాగుతోంది రోడ్డుమీద
గాలికి మతిభ్రమించి వెర్రిగా పరుగెత్తింది
ఆకాశాన్ని కప్పేసిన జెండాలు దాటి

నినాదాలింకా పైకి అటునుంచి లోకంలోకి
ప్రవహిస్తున్నాయి
సృష్టిలో పరమాణువులన్నీ
విస్ఫోటనకు సిద్ధంగా వున్నాయి
పలుచగా పైకిలేస్తున్న ఊపిర్లు వెచ్చగా
ఆకాశానికి ఎర్ర పూతపూశాయి
పాదాల తాకిడికి రేగిన నేలతల్లి నిట్టూర్పుల ధూళి
ఊరిమీద సింగిణి చిత్రాన్ని గీసింది.
ద్వారాలు తెరుచుకుని, గవాక్షాలు విచ్చుకుని
సుత్తెలూ, కొడవళ్లూ, నాగళ్లూ, కలాలూ, పుస్తకాలూ
మగ్గాలూ, తలలూ, కళ్లూ, మనసూ అన్నీ
సైన్య సంగీతానికి లయగా అడుగేస్తున్నాయి.
అపరిష్కృత సమస్యా వలయాలు,
అంతులేని జీవనదుర్గ విశీర్ణ శిధిలాలు
అన్నీ కళ్లలో రవ్వలు పొదుగుకుని
స్వేచ్ఛవల్ల సహజంగా ఉద్భవించే వికాసంతో
ఉత్సాహంతో, బలంతో, శక్తితో నడుస్తున్నాయి
అరికాళ్ల కింద బొబ్బలు పగిలి రోడ్డంతా నెత్తురు
ఆకాశంలో సూర్యుడు రోడ్డుమీద రక్తంలో ఫలిస్తున్నాడు
నెమ్మదైన అలవాట్లు వద్దు వద్దు
నిర్జీవ క్రమపద్ధతులు వద్దు వద్దు
మరణానంతర ప్రశాంతి కోసం స్వేచ్ఛను త్యాగం చేయొద్దు
ఆడంబర సంస్కృతీ ప్రహసనాలు వద్దు
ఇతర్ల కోసం మానెత్తురు ధారపోతలు వద్దు
పాలిష్ట్ స్టోన్లు పరచిన బాత్‌రూంలో
షవర్ మంద్రంగా మోగుతుంది
కుషన్ బెడ్‌లు సౌంద్ర స్వప్నాల్లో విహరిస్తున్నాయి
రక్తపు బిందువులతో బంతులాడుకునే
నాజూకుతనాల వాళ్ల జీవన రహస్యాలు తెరిచే
తాళంచెవి ఏదో సూర్య కిరణ పుంజాల్లో
పునీతమయ్యే నగ్నమలిన దేహాలకు దొరికింది
రేపటి నుంచి వాళ్లే సూత్రధారులు
ఇంతవరకూ ప్రపంచమంతా ఆభాస నాటకం
ఇంక నాటకం రక్తి కడుతుంది.

కంపూచియా అంటే ఏమిటి?

[ఇటీవల కాలంలో అత్యంత దుష్ప్రచారానికి గురైన విప్లవంగా మాల్కొలమ్ కాల్డ్వెల్ పేర్కొన్న ప్రజాతంత్ర కంపూచియా గురించి, అక్కడ ప్రస్తుతం జరుగుతున్న జాతీయ విముక్తి పోరాటం గురించి మన దేశంలో విప్లవాభిమానుల్లో సైతం ఏర్పడిన సందేహాలు, గందరగోళం ఒక్క కలంపోటుతోనో, ఒక్క వ్యాసంతోనో, ప్రశ్నలకు జవాబులుగానో తొలగించ గలిగేవికావు. అయితే ఒక ఆగ్నేయాసియాదేశం, ఒక వ్యవసాయ దేశం, ఒక మూడో ప్రపంచదేశం తనదేశ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవడానికి, తన కాళ్ళపై తాను నిలవడానికి ఎటువంటి పోరాటాన్ని చేపట్టింది, ఆ పోరాటానికి మార్గదర్శకమైన పంథా ఏమిటి అనేది భారతదేశ స్వాతంత్ర్యం గురించి ఆలోచించే ప్రతి దేశభక్తుడు పట్టించుకోవలసిన విషయం. అందువల్ల కంపూచియా భూగోళము-చరిత్ర మొదలుకొని కంపూచియాపై వియత్నామ్ దురాక్రమణ వెనుకవున్న చారిత్రకతాత్త్విక కారణాలేమిటి అనే మౌలిక అంశాల వరకు ప్రత్యక్ష ఆధారాలతో కూడిన ప్రామాణికమైన రచనలు సృజనలో వీలయినంతవరకు ప్రచురించే ప్రయత్నం చేయదల్చుకున్నాం.

రెండవ ప్రపంచ యుద్ధానికి నేపథ్యంగా 1936 నుంచి 39 వరకు జరిగిన స్పెయిన్ అంతర్యుద్ధం ప్రపంచ ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఎట్లా తమ యుద్ధంగా, తమ కర్తవ్యంగా భావించారో మళ్ళీ ఈనాడు కంపూచియాలో పోల్‌పాట్ నాయకత్వంలో జరుగుతున్న గెరిల్లా పోరాటం తమ పోరాటంగా, తమ కర్తవ్యంగా భావించాల్సిన తరుణం వచ్చింది. అట్లా గుర్తించిన ఐ. ఎఫ్. స్టోన్, నోమ్‌చామ్‌స్కీ, ఎలిజబెత్ బెకర్‌ల అభిప్రాయాలు కూడ యిస్తున్నాం. ఈనాడు అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ధిక్కరించే ఎందరో మేధావులకు, రచయితలకు వీళ్ళు, మాల్కొలమ్ కాల్డ్వెల్ పేర్కొనదగిన ప్రతినిధులు మాత్రమే. – 'సాహితీ మిత్రులు']

భూగోళం

కంపూచియా ఆసియా ఖండంలోని ఆగ్నేయ దిశనవున్న చిన్నదేశం. వియత్నామ్, లావోస్, థాయ్‌లాండ్ దీనికి ఇరుగు పొరుగు దేశాలు. ఈ దేశాలన్నీ ఇటీవల కాలం వరకు అమెరికన్ సామ్రాజ్యవాదానికి నయా వలసలుగా వున్నవే.

కంపూచియా విస్తీర్ణం 181,035 చదరపు కిలోమీటర్లు. ఆంధ్రప్రదేశ్ కన్నా దాదాపు ఒక లక్ష చదరపు కిలోమీటర్లు తక్కువ విస్తీర్ణం. (ఆంధ్రప్రదేశ్ 2,76,814 చదరపు కిలోమీటర్లు). గుజరాత్, కర్నాటకలకన్నా చిన్న దేశం. ఇందులో 16%

వ్యవసాయం, 74% అడవులు. జనాభా 82 లక్షలు. తెలంగాణకన్న తక్కువ. వీరిలో 45% పదిహేను సంవత్సరాల లోపు పిల్లలు.

ఒకే జాతి. పేర్కొనదగిన ఇతర మైనారిటీ వర్గాలులేవు. జననాలరేటు వెయ్యికి 47, మరణాలు 18. జీవన పయోప్రమాణం 45 సంవత్సరాలు. వలస వచ్చే వారితో కలిపి జనాభా పెరుగుదల సంవత్సరానికి 2.3%. శిశు మరణాలు వెయ్యికి 150.

1977 లెక్కల ప్రకారం శ్రామికుల సంఖ్య 26 లక్షలు. వ్యవసాయోత్పత్తి 1974లో 48% వుంటే 76కు 81%కి పెరిగింది.

రాజకీయ చరిత్ర

కాంబోడియా 1864లో ఫ్రెంచి రక్షిత (ప్రొటెక్టరేట్) దేశమైంది. ఇండో చైనాలో ఫ్రెంచి అధికారాన్ని జపాన్ అంతం చేసిన తర్వాత 1945 మార్చిలో ఇక్కడ స్వాతంత్ర్యం ప్రకటింపబడింది. కాని అనతికాలంలోనే రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపానుల ఓటమితో మిత్రదేశాల విజయంతో ఫ్రెంచి వాళ్ళు కాంబోడియాకు తిరిగి వచ్చారు. 1941లో నరోదమ్ సిహనౌక్‌ను ఫ్రెంచివాళ్ళు సింహాసనంపై కూర్చుండ బెట్టారు. అప్పటి నుంచీ ఆయన సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించాడు. 1953లో ఈ స్వాతంత్ర్యం సిద్ధించింది. తన తండ్రిని సింహాసనంపై కూర్చుండబెట్టి తాను ఆయనకు సహాయకుడుగా మాత్రమే తన దేశాన్ని మరింత పటిష్ఠంగా నడుపగలననుకొని నరోదమ్ సురమరిత్‌ను 1955 మార్చి 22న రాజును చేసాడు సిహనౌక్. సురమరిత్ 1960లో చనిపోయాడు.

1970 లో సిహనౌక్ మాస్కోలో వుండగా రక్తపాత రహిత తిరుగుబాటు ఒకటి కాంబోడియాలో వచ్చి మార్షల్ లాన్‌నాల్ అధికారంలోకి వచ్చాడు. సిహనౌక్ పదవీచ్యుతుడయ్యాడు.

సిహనౌక్ మాస్కో నుంచే పెకింగ్ వెళ్ళిపోయాడు. అప్పటి నుంచీ అక్కడే వుండిపోయాడు. కంపూచియా జాతీయ ఐక్యసంఘటన నాయకత్వంలో నేషనల్ యూనియన్ రాయల్ ప్రభుత్వం (గ్రంక్) ఏర్పాటుచేసినట్లుగా ఆయన 5 మే 1970న ప్రకటించాడు. దానికాయనే అధిపతి.

గ్రంక్ సైన్యాలు ఏప్రిల్ 17, 1975 న నామ్‌ఫెన్‌ను కైవసం చేసుకోవడంతో అమెరికా తొత్తు లాన్‌నాల్ ప్రభుత్వం పతనమైంది.

కియూసాంఫన్ నాయకత్వంలో నూతన వామపక్ష ప్రభుత్వం ఏర్పడింది. ఈ వామపక్ష ప్రభుత్వం వెనుకవున్న నిజమైనశక్తి కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుగానీ, దానికి కార్యదర్శి పోల్‌పాట్ అనే విషయంగానీ 1977 దాకా బయటి ప్రపంచానికి తెలియదు.

ఈ కార్మిక–కర్షక ప్రజాతంత్ర కాంపూచియా ప్రభుత్వంపై 25 డిసెంబర్ 1978 న వియత్నామ్ ప్రభుత్వం దాడిచేసింది. కంపూచియా ప్రజలు వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిఘటనా యుద్ధాన్ని కొనసాగిస్తూ కోల్పోయిన జాతీయ స్వాతంత్ర్యాన్ని తిరిగి సాధించుకోవడానికి పోరాడు తున్నారు.

ప్రజాతంత్ర కంపూచియా (17 ఏప్రిల్ 1975 నుంచి 25 డిసెంబర్ 1978 వరకు) ప్రభుత్వం. అధ్యక్షుడు కియూసాంఫన్. ప్రధాని పోల్‌పాట్. ఉపప్రధానులు ఇయాంగ్‌సారీ (విదేశాంగశాఖ) వాన్‌వెట్ (ఆర్థిక శాఖ) సాన్‌సెన్ (రక్షణశాఖ) ప్రచార, సమాచార, సాంస్కృతిక, విద్యాశాఖ మంత్రి శ్రీమతి యున్‌యట్. ప్రజారోగ్యం థియోన్ థియోన్, సాంఘిక, ప్రవర్తన - శ్రీమతి ఇయాంగ్ తిరత్.

టనెల్ చివరన నిప్పంటుకున్నది (ప్రసిద్ధ రచయితల అభిప్రాయాలు)

ఐ. ఎఫ్. స్టోన్:

రచయిత, పత్రికారచయిత. ఆయనా, ఆయన భార్యా కలిసి వాషింగ్టన్ డి.సి. నుంచి ఐ. ఎఫ్. స్టో వీక్లీ అనే పత్రిక నడుపుతున్నారు. వియత్నామ్‌లో అమెరికా విధానాలను సవాల్ చేసిన సమాచారానికి, విశ్లేషణకు తొట్ట తొలి ఆధారం ఈ పత్రిక. అమెరికా వ్యతిరేక వియత్నామ్ యుద్ధాన్ని తొలినుంచీ బలపరచిన మేధావి.

"నేను వియత్నామ్ దురాక్రమణను ఖండిస్తున్నాను. ఇది సామ్రాజ్యవాదం' లాటిన్ అమెరికాలో మనమేం చేసామో, తూర్పు యూరపు దేశాల్లో రష్యా యేం చేసిందో, ఆగ్నేయాసియాలో ఇప్పుడు వియత్నామ్ ఆ పనిచేస్తున్నది బలవంతమైన పెద్దదైన పొరుగువారి అధికారం బలవంతంగా ఒక ప్రభుత్వాన్ని (చిన్న దేశంపై) రుద్దడం. సామ్రాజ్యవాదమంటే ఇదే. వియత్నామీయులు తమంత తాము ఒక చిన్న వియత్నామ్‌ను సాధించుకున్నారు. ఇప్పుడు వియత్నామ్ అమెరికా అయింది. ఇప్పుడు వాళ్ళకు శక్తివంతమైన ఆయుధాలున్నాయి, విమానాలున్నాయి. వియత్నామ్‌లో ఎట్లా చేసామో అట్లా ఇవ్వాళ వియత్నామ్ సులభంగా పట్టణాల్లో ప్రవేశించి ఆక్రమించుకో గలదు. కాని ఒకసారి నువ్వు పట్టణాలకు అలవాటు పడ్డావంటే నీకింక గ్రామాలు వుండవు. ఈ పరిస్థితి చాలకాలం కొనసాగితే నేనేమీ ఆశ్చర్యపడను.

వియత్నామీయులు చాల సామ్రాజ్యవాద స్వభావం గల వారని నా కెప్పుడూ అనిపిస్తూ వుండేది. నేను అమెరికా యుద్ధాన్ని వ్యతిరేకించిన రోజుల్లో కూడ ఈ వాస్తవం నా స్ఫృహలో వున్నది. వాళ్ళు ఖ్మేర్ ప్రజలనుంచి మెకాంగ్ డెల్టాను కైవసం చేసుకొని కొద్దిశతాబ్దాలు మాత్రమే గడిచింది. ఇది పాతవైరమే. దక్షిణానికి, ఈశాన్యానికి వ్యాపించున చైనా నాగరికతకు వియత్నామ్ చివరి మజిలీ అయితే అదే ప్రాంతానికి వ్యాపించిన భారతీయ నాగరికతకు కాంబోడియా చివరి మజిలీ.

ఇందులో కొంతబాధ్యత రష్యా మీద కూడ వుంది. చైనా తనపై దాడిచేయదనే హామీ లేకుండా కాంబోడియాలోకి వియత్నామ్ ప్రవేశించేదికాదు. ఆ హామీ చైనా యిచ్చింది కాదు రష్యాయిచ్చింది. చైనా దాడిని నిరోధించడానికి వియత్నామ్ రష్యాతో రక్షణ ఒడంబడికలు చేసుకున్నది; చైనా సైన్యాలను వియత్నామ్‌లోకి పంపించడానికి భయపడుతుందని ఆశించింది.

మనం ఆ సమస్యలో ప్రవేశించి ఆ ప్రాంతానికిగానీ ప్రపంచానికిగానీ చేయగల ఉపకారం ఏమీలేదు; ఉన్న సమస్యను మరింత జటిలమూ, రక్తపంకిలమూ చేయడం తప్ప. మనం కంబోడియాను నాశనం చేసాం. అక్కడున్న భయంకర మైన కష్టాలకు కారణం ఇదివరలో అమెరికా దురాక్రమణ; ప్రతి ఒక్కరూ మట్టిని తవ్వి, ఆహారాన్ని సరఫరా చేసుకోవడం కన్న మనం చేసిన నష్టం తర్వాత కంబోడియాకు మిగిలిన మార్గం ఏముంది? అందువల్ల చాలమంది కష్టపడి వుండవచ్చు. కాని ఆ కష్టాలకంతా ముందూ వెనుకా మనమే బాధ్యులం. నిక్సన్, కిసింజర్ చేసిన పని అది. వియత్నామీయులు అంతకన్నా భిన్నంగా చేస్తారనుకోను. వియత్నామ్‌కు కాంబోడియా నుంచి ఏ ఉపద్రవమూ లేదు. అది చాల స్పష్టం. కాంబోడియాకు చెప్పుకోదగిన సైన్యం లేదు; అది వియత్నామ్‌పై దాడి చేయబోవడం లేదు. చిన్న దేశాలను పెద్ద దేశాలు కబళించటం నేను సహించను. ఈ దురాక్రమణ నాకు మింగుడు పడడంలేదు. వియత్నామ్‌కు (కాంబోడియాతో) సరిహద్దు తగాదాలు వుంటే వుండవచ్చు, కాని అది దేశాన్ని మొత్తంగా ఆక్రమించడానికి సాకయితే ఎట్లా?

నోమ్‌చామ్‌స్కీ :

సుప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త. అమెరికాలోని మసెచుసెట్స్ సాంకేతిక సంస్థలో అధ్యాపకుడు. వియత్నామ్‌లో అమెరికా జోక్యానికి వ్యతిరేకంగా క్రియాశీలంగా పోరాడినవాడు.

"చాల విషాదకరమైన పరిస్థితి. కాంబోడియాకు, వియత్నామ్‌కు రెండింటికీ విషాదకరమైందే. వివాదాస్పదమైన సరిహద్దు వుండొచ్చు, చారిత్రికంగా తమకు

నష్టం జరిగిందని కంబోడియన్లు భావిస్తున్నారు. వాళ్ళ దృష్టిలో, వాళ్ళు వియత్నామ్ అధికారాన్నీ, దానినుంచి వస్తున్న ఆక్రమణ స్వభావాన్నీ ఎదుర్కొంటున్నామని భావిస్తున్నారు.

ప్రపంచాభిప్రాయంలో తాము చాల నష్టపడతామని వియత్నామ్ అనుకోవడం లేదు. మరీ ముఖ్యంగా, తమపట్ల సానుభూతి అపారంగా వున్న ప్రపంచ దేశాల్లో తమపట్ల సానుభూతి సడలిపోతుందని ఊహించడంలేదు. ఉదాహరణకు, యూరపులో వున్న వామపక్షాల దృష్టిలో, ఇతర వామపక్ష ఉదారవాదుల దృష్టిలో కాంబోడియా (పోల్‌పాట్) ప్రభుత్వం గురించి ఈ గ్రూపులు విస్తారమైన పిచ్చి ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తు దుష్ప్రచారం ఇదివరకెన్నడూ జరగలేదు. అబద్ధాలు ఎంతపెద్ద కుప్పగా ఈ ప్రచారంవల్ల కుప్పపడ్డాయంటే పీటి అట్టడుగున సత్యమెక్కడో నడ్డివిరిగి కూలిపోయింది. వాళ్ళకు వాస్తవికతతో పనిలేదు. పిచ్చి అనే మాట కూడ వాళ్ళకు సరిపోయే బలమైన మాట కాదు. ఈ ప్రచారం ఎంత ఉధృత స్థాయికి చేరుకున్నదంటే, ఒకవేళ తాము చేసింది దురాక్రమణ అని ఖండించినప్పటికీ, కాంబోడియాలో (పోల్‌పాట్) ప్రభుత్వాన్ని పడగొట్టాల్సిన అవసరం వుంది అనే భావనతో దాని తీవ్రత తగ్గుతుందని వియత్నామ్ ఊహించింది. ఇదీ వాళ్ళ అంచనా అని నేను భావిస్తున్నాను. ఇంత పిచ్చిగా కాంబోడియాను ఖండించడం ఏ ప్రాణిరక్షణకూ దోహదం చేయలేదు– కాని వియత్నామ్ దురాక్రమణకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి మాత్రం ఈ ప్రచారం దోహదం చేసింది."

ఎలిజబెత్ బెకర్ :

బెకర్ వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు రిపోర్టర్. కాంబోడియాపై వియత్నామ్ దురాక్రమణ ప్రారంభం కావడానికి రెండు రోజులముందే ఆమె కాంబోడియా నుంచి తిరిగి వచ్చింది.

"వియత్నామ్ గురించి ఇంకా చిన్న దేశమనీ, పేద దేశమనీ అనుకోవడానికి వీలులేదు. అది ప్రపంచంలో మిలిటరీ బలంలో అయిదవ స్థానాన్ని ఆక్రమించింది. వియత్నామ్ ఇండో-చైనా కమ్యూనిస్టు పార్టీని ప్రారంభించింది. ఆ దేశాల కమ్యూనిస్టు పార్టీలపై దానిదే పెత్తనం. వాళ్ళు కాంబోడియాకు సహాయం చేసారు. కాని ఇండో చైనాలో తమ మాటకే చెల్లుబడి అనే భావనతోనే చేసారు. కాంబోడియాలో జనాభా తక్కువ– ఆహారం ఎక్కువ. వియత్నామ్ ఎక్కువ పారిశ్రామికీకరణ పొందింది. ఆహారం కావాలి. వంతెనలు, ఆహారము వంటి విషయాల్లో ఆర్థిక

'తిక్క' తుపాను

ఆంధ్ర దేశానికి 'శని' పట్టిందని ఒక పత్రిక సంపాదకీయమే రాస్తే, ఇంకో పత్రిక ప్రకృతి 'పగ' పట్టిందని రాసింది. శనివారం మిట్ట మధ్యాహ్నం (మే 12) పూట గంటకు నూరూ నూటయాభై కిలోమీటర్ల వేగాన వుండి వుండీ 'గాలి కసురు' దాని వెంట వాన– ఆరుగంటల కాలంలో నాలుగు వందల పైచిలుకు మిల్లీమీటర్లు.... గాలీ, వానా.... గాలివాన!

మొత్తం ముప్పైయారు గంటలసేపు మనుషులు చేతుల్లో గుండెలు పట్టుక్కూచున్నారు, భయం భీతాహం ముట్టడిలో. 13వ తారీఖున తెల్లారేప్పటికల్లా యేముంది? విధ్వంసం!

మే మాసం యీ నెల్లూరు– ఒంగోలు ప్రాంతాలకు తొలకరి జల్లుల్నే తీసుకొస్తుంది గాని తుఫాను బీభత్సాల్ని కాదు. ఎనభై అయిదేళ్ల క్రితం ఎప్పుడో బంగాళాఖాతంలోని వాయుగుండం దక్షిణ కోస్తా ప్రజలకు ప్రాణగండమైందట. ఆ తర్వాత 1927లో నవంబరు మాసంలోనే కొట్టింది ఈనాటికీ ముసలీ ముతకా కథలుగా చెప్పుకుంటున్న 'పెద్ద గాలివాన'. దీపాల పిచ్చయ్యశాస్త్రీ దువ్వూరి రామిరెడ్డీ అప్పట్లో పద్యాలకు పద్యాలే రాసి అచ్చుకి పంపారు. ఇంకా పిమ్మట 1940లోనూ 1977, 78ల లోనూ వచ్చిన గానివానలన్నీ నవంబరు మాసం తెచ్చిన మోసాలే. మే మాసం యీ సంవత్సరంలో తెచ్చి పెట్టిన సర్వనాశనం యీ 'తిక్క'తుఫానుకే చెందాలి. దీన్ని వాతావరణ శాస్త్రజ్ఞులు 'ఫ్రీక్' అంటున్నారు.

వాతావరణ శాస్త్రం (మీటిరియాలజీ) శాస్త్ర స్థాయి సందుకుందా లేదా అనే విషయం ఇప్పటికీ తేలని విషయమే. నిర్ధారణగా అది దేన్నీ చెప్పలేదు. అయితే యీ మారు మాత్రం దానిది మిడతంభొట్లు జోస్యం కాగలిగింది. ఎక్కడో తమిళనాడు కోస్తాలో నాగపట్నానికి కొన్ని వందలమైళ్ళ ఆగ్నేయాన ఒక చిన్న వాయుగుండం ఏర్పడిందని, అది తిరిగ్గా బలం పుంజుకుని వాయవ్యదిశలో పయనించి తమిళనాడు ఉత్తర కోస్తాను దాటగలదని, దక్షిణ తీరాంధ్రం జల్లులతో పులకరించవచ్చని

సహకారం కొరకు ఇండోచైనా సమాఖ్య అనే సంస్థను ఏర్పాటు చేయాలన్నది వియత్నామ్ తలంపు. అది కాంబోడియాను కలవర పరచిన ఆలోచన. కాంబోడియాతో ఈ విషయంలో సహకారం వుంటుందని వియత్నామ్ విశ్వసించింది. కాని 1976లో ఈ సమాఖ్యలో చేరడానికి కాంబోడియా నిరాకరించింది. నాతో కాంబోడియన్లు ఏమన్నారంటే వాళ్ళు కనుక ఈ సమాఖ్యలో చేరితే కాంబోడియా మరొక లావోస్‌గా మారుతుందని– లావోస్‌లో ఈనాడు నలభై వేల వియత్నామ్ సైన్యాలు వున్నాయి."

రేడియో ప్రసారాలు రెండు రోజుల్నుంచీ చెవినిల్లుగట్టుకు చెబుతూవచ్చిన మాటలు, మే 11 నాటికి మాయమాటలనిపించాయి. ఈ వాయుగుండం మరెవరికో గాక తమకే ప్రాణగండంగా పరిణమించనున్నదనే విషయం 12 ఉదయానికల్లా దక్షిణ కోస్తావాసుల చైతన్యాన్ని ఒక్క పెట్టున 'ఎలెక్ట్రిఫై' చేసివేసింది. నాటు-మోటు పడవల్లోనూ తెప్పల్లోనూ చేపలవేటకు సముద్రం మీదికివెళ్ళే 'పట్టపువాళ్ళ'కు ఇది సకాలంలో చేసిన హెచ్చరికే. తుఫాను తాకి నాకివెయ్యనున్న కోస్తా ప్రాంతాల నుంచి జనం తరలింపు గూడా ఆలోచనా పూర్వకంగానే సాగిందని చెప్పాలి. దివిసీమ ఘోరానుభవం నుంచి ప్రభుత్వాధికారులూ ప్రజలూ సరైన పాఠాన్నే నేర్చుకున్నారు. నేర్చినదాన్ని అమలూ చేశారు. అయితే మాత్రం?

సరిగ్గా ఏ స్థలంవద్ద తీరాన్ని దాటనుంది యీ తిక్కలమారి తుఫాను?

ఈ ప్రశ్నకు వాతావరణ శాస్త్రజ్ఞుల వద్దనే జవాబులేదు. నెల్లూరన్నారు, కావలి అన్నారు, కొత్తపట్నం (ఒంగోలు వద్ద) అన్నారు, చెప్పినమాట చెప్పకుండా. చివరికి జరిగిందేమిటి? కావలి వద్ద మాత్రం కాస్త తొంగిచూసింది. సింగరాయకొండకూ టంగుటూరికీ (ప్రకాశం జిల్లా) మధ్య మరింత నిక్కబెట్టింది. నిలిచినచోట నిలవకుండా తిక్కరేగిందానిలాగు ఇంకా వాయవ్యంగా వూగుతూ సాగిపోయింది. అందుచేత, ముందనుకున్న దానికంటె ఎంతో ఎక్కువ ప్రాంతాన్ని హెచ్చుతగ్గులతో పంజా దెబ్బ తీసింది. పడమట మహబూబ్‌నగర్ దాకా, తూర్పున గోదావరి మండలాల దాకా యీ అకాల ప్రళయం తన తడాఖా చూపింది. అయితే ముఖ్యంగా మాత్రం, ప్రకాశం జిల్లాలోని కందుకూరు తాలూకాకు, ఆ తర్వాత కనిగిరి తాలూకాకు, తగినంత చావుదెబ్బ, నెల్లూరు జిల్లాలోని కావలి, కోవూరు తాలూకాలకు గూడా తగల్లేదు.

ఆర్. సి. సి. కట్టడాలు ఏమీకాలేదు. దేవాలయాలేమీ కాలేదు (మహిమా గిహిమా ఏమీలేదు). పెంకుటిళ్లూ (భవంతు లంటా రిక్కడ) ఒకరకంగా ఫర్వాలేదు. ఎటొచ్చీ గుడిసెలకే పాకలకే వచ్చింది 'వండ'! గుడిసెలంటే గుడిసెలా? ప్రతీ హరిజనవాడ, ప్రతీ అరుంధతీయ పాళెం, ప్రతీ ఎరుకల, బుడబుక్కల, యానాదుల, వగైరా వగైరా (అక్షరాలా వగైరాలే!) గూడేలు- అన్నీ గుడిసెలే పాకలే అయినప్పుడు, తగిలిన పంజాదెబ్బ వీటికే. 'ఇంటి' కప్పులు తాటాకూ ఎండుగడ్డితో వేసినవి గనక మొదట్లో ఇవి పుప్పరాని కెగిసి తర్వాత మరెక్కడెక్కడో చప్పగా నేలమీద కుప్పగూలినట్లు కూలాయి. తల దాచుకోవడమెట్లా? ప్రాణం నిలుపుకోవడమెట్లా? అలుబిడ్డలెట్లా? అత్యంత ప్రాథమికమైన యీ ప్రాణభయం, లక్షలాది నిరుపేదల నిస్సహాయత్వాన్ని క్రూరంగా హేళన చేసింది.

అంత కొద్దికాలంలో అంత ప్రచండంగా కురిసిన వానలవల్ల యీ మెట్ట ప్రాంతంలోని చెరువులు చెప్పి పెట్టకుండా నిండిపోయి, అంతటితో ఆగక, గట్లను కోసుకుంటూ గ్రామాల్లోకి అకస్మాత్తుగా తరలించిన జల ప్రళయం భవంతులనైతేం ఖాతరు చెయ్యలేదంటే మరి వాడల, గుడిసెల, పాకేల సంగతెందుకు? గోద్రెజ్ బీరువాలకు బీరువాలే నీటివాలున పడిపోయాయంటే, నిరసులైన మనుషుల, నోరులేని ఎడ్ల, గొడ్ల, గొర్రెల, మేకల సంగతెందుకు? పొగాకుబేళ్లే రైలు కట్టదాకా కొట్టుకురాగా, వరి కుప్పల మాటెందుకు?

అంతేకాదు. శ్రీకాకుళం జిల్లాలో కొన్నిచోట్ల సముద్రం వుప్పునీరు చెలియలి కట్టను కోసుకుని లోపలికి వచ్చేసింది. మరికొన్నిచోట్ల బకింగ్‌హాం కాలువను కూడా దాటింది. నెల్లూరు జిల్లాలో కూడా ఒకటి రెండుచోట్ల జరిగిందిదే. 'వుప్పెన'లేదు, నీలిమంటాలేదు గాని, ఎంతో పంట పొలం చవుడెక్కిపోయింది, చాలదూ? అలాగే, వాగులూ వంకలూ– ముఖ్యంగా ప్రకాశం జిల్లాలోని పాలేరు– పొంగి పరవళ్లదొక్కి– పంట పొలాల్లో యిసక మేటలు వేసింది. 'కొరివిగాలి' అని జనం పేరుబెట్టిన ఒక మంటలగాలికి చెట్ల, తీగల, పొదల ఆకులలములన్నీ కమలినట్టు మాడినట్టుగా మారి పోయాయి,

దీన్నటుంచి, నష్టం లెక్కలు చూద్దాం. ఇవన్నీ ప్రభుత్వం తీసిన లెక్కలే; కాబట్టి ఎక్కించాల్సినవే గాని తగ్గించాల్సినవి కావు:

— ప్రాణం పోయినవాళ్లు, శ్రీకాకుళం జిల్లాలో 485 మంది, నెల్లూరు జిల్లాలో 79 మంది, గుంటూరు జిల్లాలో 16 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 11 మంది, కర్నూలు జిల్లాలో 10 మంది, చిత్తూరు జిల్లాలో ముగ్గురు, కడపజిల్లాలో ఇద్దరు– మొత్తం 606 గురు.

— కూలిన యిళ్లు మొత్తం యాభైయారు లక్షలు.

— ఇల్లూ వాకిలీ లేకుండా పోయినవాళ్లు 25 లక్షల మంది,

— చచ్చిన పశువులూ వగైరా ఒక లక్ష దాకా,

— చవుడెక్కిన భూమి 26,860 హెక్టార్లు. హెక్టారొకంటికి అధమ పక్షం 250 రూపాయలు ఖర్చు చెయ్యందే, యీ చవుడు విరగదు.

— ధ్వంసమైన పొగాకు బారన్లు (రైతులవద్ద పొగాకు కొని నిలవజేసే పెద్ద యిటుక కట్టడాలు– జింక్ షీట్లో ఆస్బెస్టాస్ రేకులో పైటి కప్పు) 20,500.

— ధ్వంసమైపోయిన ముగ్గాలు శ్రీకాకుళం జిల్లాలో 24,000, నెల్లూరు జిల్లాలో 15,000.
— పాడైన వరిపంట కిమ్మత్తు మూడు కోట్లా యిరవై లక్షల రూపాయలు.
— పడిపోయిన అరటి తోటల కిమ్మత్తు ఐదు వందల డెబ్భైఐదు కోట్ల రూపాయలు.
— ధ్వంసమైన తమలపాకు తోటల కిమ్మత్తు ఒక కోటీ ఎనభై లక్షల రూపాయలు.
— నాశనమైన నిమ్మతోటల కిమ్మత్తు ఆరు వందల యాభై ఐదు కోట్ల రూపాయలు.
— పడిపోయిన మామిడి తోటల కిమ్మత్తు ఒకకోటీ నలభై యొక్క లక్షల రూపాయలు.
— చెడిపోయిన కూరాకు తోటల కిమ్మత్తు పదిహేడు లక్షల రూపాయలు.
— పనికిరాకుండా పాడైన పత్తి, మిర్చి, వేరుశెనగ (పల్లీలు) వగైరా మెట్ట పంటల కిమ్మత్తు ఇరవై కోట్లా డెబ్భై తొమ్మిది లక్షల రూపాయలు.

ఈనష్టం అంకెల్లో ఏమి కనిపిస్తుంది? పైగా, ఇదంతాకూడా, కాస్తోకూస్తో ఘాస్తితంటూ వున్న రైతాంగానిదే. రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కార్మికులు ఇళ్లా వాకిళ్లా లేక చెట్ల కిందనో ఆఫీసుల్లోనో పడివుండాల్సిన అనాధులైపోయారు. అస్తి పరుల్లో ఒకరిద్దరు తమ నష్టాన్ని తలచుకుని గుండె ఆగి చచ్చిపోతే, మరో ఒకరిద్దరు ఆత్మహత్యకు దిగినట్లు శ్రీకాకుళం జిల్లా టంగుటూరు భోగట్టా. నలభై యెకరాల పొలంలో యిసక మేట వెయ్యగా గరీబుకంటె గరీబైన (కనీసం మనోభావంలో) పెద్ద రైతు ఒకడు దిగ్భ్రిమనుంచి తేరుకోవడం మాటలు కాదు. కాబట్టి యీ నష్టం కళ్లకు కట్టాలంటే, అనుకోకుండా అకస్మాత్తుగా దెబ్బతిన్న నిర్భాగ్యుల ముఖాలు చూడాల్సిందే. మారు బట్టలే లేకుండా మురికితో దుర్వాసనతో అలాగే బతుకీడుస్తున్న వాళ్ల శరీరాలు చూడాల్సిందే. వెంగళ్రావు నగర్‌లనీ ఇందిరా నగర్‌లనీ పేరు పెట్టుకుని, 1977-78 నాటి తుఫాను తర్వాత వూళ్ల వెలుపల లేచిన కాంగ్రెస్ మార్కు కొత్త మురికివాడలన్నీ నామరూపాలే మిగలనంతగా నేలమట్టమై, వెదుళ్లా, తాటాకూ ప్రియమై, వట్టి నేలమీద బారైన పేసవి ఆకాశం కింద, తేళ్ల-పాముల మయమైన స్థలాల్లో నివసించక తప్పని ప్రభుత్వ దయోపహతుల స్థితిని చూడాల్సిందే. రైతాంగం, చేనేత కార్మికులు, మత్స్య పారిశ్రామికులు– అనేక వర్గాల ప్రజలకు నిజంగానే ఇది తీర్చలేని ఆపద. పడిపోయిన ప్రతిగుడిసెకీ రెండువందలయాభై రూపాయలిస్తామని ముందు మాటిచ్చి తీరా రొఖ్ఖం యిచ్చేసమయానికి నూటయాభై రూపాయలు చేతబెట్టినప్పుడు, జనం నివ్వెరపోయింది. ఇచ్చింది తీసుకుంది. అందులో ఆడాళ్ళను దబాయించి పాతికో పరకో చేజిక్కించుకొని పుట్టెడు కష్టంలో తప్పతాగిన మగాళ్లున్నారంటే ఆశ్చర్య మెందుకు? నిజానికి, యీ నూటయాభయేకాదు, ఆ రెండువందలయాభై యిచ్చినా, మళ్లీ

యిల్లులేచేనా? లేచిన యిలాంటికొంపలు మరోతుఫాను తాకిడికి నిల్చేనా గెల్చేనా? పటు నిరాశ అంటే ఇదే. ఇలాంటప్పుడే మనస్సు అలివి తప్పుతుంది. ఇలా జరక్క తప్పదని ప్రభుత్వానికి ఎరికేగనక, నాలుగైదు రోజులపాటు సారాదుకాణాల్నీ బార్లనీ మూసి వేయించింది. ఈ ముష్టిడబ్బులకు వెదుళ్లూరావు, తాటిఆకులురావు. జనంలో ఒకభాగం యిలా యెంతిచ్చినా తీసుకునేందుకు అలవాటు పడింది. అంతేకాదు-పేదసాదల్నటుంచి కాసింత వున్నవాళ్లకూడా, ఎగబడ్డారు. అధికారులకు చూపిన గుడిసె చూపకుండా రెండుమూడు చూపినవాళ్లున్నారు. అలాచెప్పమని భార్యల్ని అధికారులవద్దకు బల వంతాన పంపినవాళ్ళూ ఉన్నారు. ఇలాంటి ఒక ఘటనలో, ఒకానొక అభిమానవతి పదుగురియెదటా తానాడిన అబద్ధానికి హేళన, ఖండన ఎదురైనప్పుడు, భర్తమీది కోపాన్ని తనమీదనే చూపుకుని ఆత్మహత్య చేసుకుంది.

వారం రోజులపాటు ఎలెక్ట్రిక్ దీపాలే మర్చిపోయారు ప్రజలు. నెల రోజులు దాటినా రైలు సౌకర్యాలు పూర్తిగా అందడంలేదు. బస్సులరద్దీ చెప్పబన్లేదు. ప్రభుత్వ మేమో 'యుద్ధ ప్రాతిపదిక' మీద తుఫాను బీభత్సాన్ని ఎదుర్కొంటానంది. అందు వల్లనే నేమో ముఖ్యమంత్రి హెలికాప్టర్ యాత్రలు లెక్కకు మిక్కుటమయ్యాయి. తాను చూచిపోయిన రెణ్ణాళ్లకీ మాజీప్రధాని ఇందిరాగాంధీని ఎక్కించుకుని మళ్లీ తయారు. ఆవిడ బహిరంగ సభలు ఐదేసి నిమిషాలైనా లేవంటే, ఏవో కొన్ని కన్నీటి బొట్లు, సానుభూతి మాటలు, వచ్చే ఎన్నికల్లో లక్షలాది ఓట్లకు ముందుగా జరిగే క్షేమా తతంగాలే ననిపిస్తూంది. మొండికేసినట్టు చిట్టచివర- మాస్కోయాత్రకు ముందు-వచ్చి, వచ్చినట్టే వచ్చి తుర్రుమన్నాడు ప్రస్తుత ప్రధాని మొరార్జీ. విశాఖపట్నం నుంచి కూడా కలెక్టర్లు వచ్చి, జిల్లాలవారీ తాలూకాలవారీ పని విభజనతో,ముష్టి సహాయం పంచుతున్నారు. ధోవతులిస్తున్నారు, చీరలిస్తున్నారు, బియ్యమిస్తున్నారు, రొక్కమిస్తున్నారు. బాగుందిగాని, దీనితో యింత అపారమైనక్షోభ, మాటలతో చెప్పలే నంతటిదైన్యం, వైదొలగిపోతుందా?

దివిసీమలో తుఫానూ, వుప్పెనా కొద్దిప్రాంతంమీద కేంద్రీకరించి కలిగించిన నష్టం, ఆకస్మికతవల్ల, అసంసిద్ధతవల్ల, చాలాఎక్కువ. ముందుగా హెచ్చరికలుచేసి, రెడీగా వుండికూడా, యీనెల్లూరు-ప్రకాశం జిల్లాల్లో ముఖ్యంగానూ, మహబూబ్ నగర్ ఒకవైపు, తూర్పుగోదావరి మరోవైపు -యింత విశాలమైనప్రాంతంలో జరిగిన నష్టం, ఇంకాఎక్కువ. అది అద్భుతకథ. యిది సాదావ్యవహారం అయింది- అంతే భేదం. ఆంధ్రదేశం కోస్తాకు యింతతరుచుగా మే మాసంలోసైతం- ఇన్నితుఫాన్లు ఎందుకు వస్తున్నట్లు? ఇది ప్రతిసంవత్సరమూ జరగక తప్పని 'రొటీన్' అయే

మాటుంటే, యీముష్టిపైసలూ దయాధర్మాలూ ఏమూలకి? ఎవరినిజమైన సంతృప్తికి? కొన్నిలక్షల పక్కాయిళ్లు కట్టించే పథకాన్ని రూపొందిస్తున్నామంటున్నాడు ముఖ్యమంత్రి. రాష్ట్రపతిచేత పునాది వేయిస్తాడటకూడా. పథకానికీ ఫలితానికీమధ్య ఎన్నేళ్ళవ్యవధి, ఎన్నికోట్లరూపాయలు స్వాహా కావాలో? ప్రైవేటు కాంట్రాక్టర్లు. వాళ్ళద్వారా యింజనీర్లూ, మంత్రులూ, ఎన్నిదొంగజేబీలు కుట్టించుకోవాలో? నూట యాభైగానీ మూడువందలేగాని, యివి నిజంగా జనాన్ని తుఫానులనుంచి రక్షించవు. కోస్తాప్రాంతంలో విండ్-బ్రేకర్స్‌లా చెట్లు నాటే పథకం కాగితంమీద మాబాగుంది.

ప్రకాశంజిల్లా కలికివాయి బిట్రగుంటపేట పిల్లలమర్రి పినవీరభద్రుడి 'శృంగార శాకుంతలం' ద్వారా "ఆంధ్రావళి"కి తెలిసివుంటుంది గాని, యిప్పుడీ తుఫాన్లో ఆ ఒక్క వూరే నూరు శవాలనుచూసి వార్తల కెక్కింది. కావలితాలూకా చెన్నాయపాళెం కూడా. అసలు శవాలనో కళేబరాల్నో గాలికీ ఎండకీ వదిలేసిన సందర్భాలే హెచ్చు. దివిలోలాగా, గద్దలైనాలేవు. కుక్కలూ తక్కువే. స్వచ్ఛంద సేవా సంస్థలసంఖ్య కొద్ది. విరాళాలూ సహాయాలూ నష్టానికి సరిపోయేంతటివికావు. నూట యిరవై ముప్పైకోట్లు కావాలని ముఖ్యమంత్రి అంటూవుంటే, నూరుసంఖ్య తీసేసి తక్కినమొత్తం యివ్వజూపుతుంది కేంద్రం. ఓట్ల-సీట్ల వ్యాపారంలో గడిదేరుతున్న ప్రతిపక్ష పార్టీలు- సి. పి. యం. తో సహా - అఖిలపక్ష కమిటీల నిర్మాణం జరగాలంటున్నాయి. జనతాపార్టీ ప్రభుత్వంవల్లనే యీతుఫాన్లు యింత యెక్కువగా వస్తున్నాయని అనుకుంటూన్న అమాయకులకు రాష్ట్రంలో ఇందిరాకాంగ్రెస్ అధికారంలో వున్నదనికూడా తెలీడం లేదంటే, యీ సో-కాల్డ్ ప్రతిపక్షాలకు సాదాజనంలోవున్న పరపతి యేపాటిదో తెలుసుకోవచ్చు. అయినా, రైతాంగం చితికి పోయిందంటూ భూస్వాములకీ నిరుపేద రైతాంగానికీ మధ్య అంతరమెంచకుండా, యీ ప్రతిపక్షాలు కట్టగట్టుకుని నెల్లూరుజిల్లా బంద్ జరపాలని యీ 15న పూనుకున్నాయి. చాలావూళ్ళలో 'ప్రశాంతం' గానే జరిగిందంటేనే, యీ 'బంద్' ఎంత తెలివిమీరిన రాజకీయ జంబుకాల పన్నాగమో తెలుసుకోవచ్చు. ఒక్క కావలిలో మాత్రం నిన్నటిరోజున ఆర్.డి ఓ. ఆఫీసు మూతవేయించడానికి చేసిన ప్రయత్నంలో, లాఠీచార్జీకి నిరసనగా ప్రదర్శకుల చేతి కంకరరాళ్ళకు పోలీసు తుపాకిగుండ్లు జవాబయ్యాయి. ఒక గ్రామీణ రైతుయువకుడు ప్రాణాలు వదిలాడు; స్థానిక యం. యల్. సి. తోసహా ఎక్స్-యం. యల్. సి. సమితి ప్రెసిడెంట్, మరికొందరు లాఠీపోట్లు చవిజూశారు. అయినా, తుఫానువల్ల సర్వనాశనమైన నిరుపేదలు వీరికివత్తాసుగా రాలేదు. అంటే, యీ ప్రతిపక్షాల 'బంద్' తంతుకూడా అధికార రాజకీయమెంతో క్షుద్రమో అంతే క్షుద్రమని జనానికి ఎవ్వరూ చెప్పాల్సిన పనిలేదు. తుఫాన్ 'పుణ్యమా'అని ప్రతిపక్షాలు రాజకీయ వ్యాపారంలో

రచన - భాషపై చర్చ :

సూత్రీకరణలు చేయవద్దు

రచన ఏ ప్రాంత భాషలో సాగినా అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉండాలని అనడం పాఠకుని సంకుచితత్వంగా భావించరాదు.

'మాండలికం కాకుండా మానవీయం కాజాలదు' అని క్రిందటి సృజన ('79 జూన్) సంచికలో చూడగానే శాసించినట్లుగా తోచింది- అలాగే కింది తరగతి వాళ్ళని ప్రత్యేకించి చెప్పటంలో కూడా. నిజానికి కింది తరగతివారి బాధలు వారి జీవితాల్లోనే వుంటూ వారిని నిత్యమూ వేధించుకుంటూనే వుంటాయి- కనుక వారికి ప్రత్యేకంగా తెలియాల్సిందానికంటే మధ్యతరగతి వారికే తెలుపాల్సిన అవసరం చాలా వుంటుంది. కనుక కింది తరగతివారి బాధలను మధ్యతరగతి వారికి తెలిపేటప్పుడు పాత్రలచే మాండలికం పలికించి, కథకుడు సాధారణ భాష చెప్పడంవల్ల ఎక్కువ ప్రయోజనం వుంటుంది. ఇలా మాండలికం, సాధారణ భాష కలిపి రాయడంవల్ల అందరినీ ఒకే వేదికమీదకు తీసుకరావటం కూడా అవుతుంది.

"నిరక్షరాస్యులకు చదివి వినిపించవచ్చు" అన్నది ఆచరణలో పెట్టని ఉచిత సలహా మాత్రమే.

— ఎన్నారెస్

లాభమెత్తజూస్తున్నాయని ఎవ్వరికీ ఎవ్వరూ చెప్పాల్సిన పనిలేదు. వీరు పోగుజేసిన 'రైతులు' నిజానికి ఆపేరుకే తగనివాళ్ళు. నిరుపేద రైతాంగాన్ని సమీకరించే ఆలోచనే వీరికి లేనట్టుంది. ఈ తుఫానుతర్వాత ఇదిరెండో పశుబల ప్రదర్శనం. గతమాసం 19న నెల్లూర్లో జిల్లాపరిషత్ గెస్టుహౌస్వద్ద సి. పి. యం. వాళ్ళు చేసిన ప్రదర్శనమీద పోలీసులు గట్టిగా చెయ్యిచేసుకున్నారు. లాఠీచార్జిలాంటిదేమీ జరగలేదని ముఖ్యమంత్రి బుకాయించినా జరిగిందిఅదే. అన్నమడిగితే రాళ్ళుపెట్టినట్టుగావుంది. నూటయాభై గాక మూడువందలు యివ్వమనటం నేరమా?

'ఆర్యభట్ట' తర్వాత 'భాస్కర్ I'ని రష్యాసాయంతో వ్యోమయానానికి పంపిన ఇండియా, తుఫాన్ల వంటి ప్రకృతి వికారాల అంతు చేజిక్కించుకోలేదా? నీటి యెద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు విజ్ఞాన శాస్త్రాన్ని రోదసి నుంచి యిలాతలానికి దింపలేదా? తుంబా రాకెట్లు సరే, శ్రీహరికోటలు సరే, యీ వుపద్రవాలకూ వుత్పాతాలకూ తన దృష్టిని తిప్పలేదా ప్రభుత్వం?

ఇది యీ రాజ్యం వుండగా జరిగేపని అనిపించడం లేదు.

— కె. వి. ఆర్.

రమేష్

"కొంచెం నలిగిన దుస్తులు, దువ్వేక మాసిన తల, మెడలో సంచీ, సంచీనిండా గురజాడకు సంబంధించిన మెటీరియల్‌తో యిప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో కనిపిస్తే మరో అయిదు నిముషాల్లో నవోదయ అక్కడ్నుంచి మరోచోట ఇలా తిరుగుతూ మాట్లాడుతూ, ఉత్తరాలకు జవాబులు రాస్తూ, ఆంధ్ర దేశంలోని ముఖ్య ప్రాంతాలన్నిటా సంచరిస్తూ, అందర్నీ కలుసుకుంటూ విసుగూ విరామం లేకుండా చిరునవ్వు చెదర నివ్వకుండా సవుత్ ఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్ వారు తలపెట్టిన "గురజాడ సంస్మరణ సంచిక"కు కృషి చేసినది ఒక వ్యక్తి కాదు శక్తి అతడే డాక్టర్ కానూరి రమేశ్‌బాబు."

(ఆంధ్రజ్యోతి వార పత్రిక 6-5-77)

రమేశ్‌బాబు మే 29వ తేదీ రాత్రి తన 37వ ఏట విజయవాడలో మరణించాడు. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య వైద్య శాఖలో పనిచేస్తున్న రమేశ్ ఈ వేసవిలో పూర్తిగా గిడుగు సంస్మరణ సంచిక, వాడుకభాషా ఉద్యమానికి అంకితంచేస్తూ తీయాలనే ప్రయత్నంలో తెలుగు దేశానికి వచ్చాడు. ఆ కృషిలో వుండగానే ఎండలు, త్రిప్పట, శ్రమవల్ల మరణించాడు.

విశ్వవిద్యాలయాల్లో వాడుక భాష వాడాలా వద్దా అనేది మళ్ళీ ఒక సమస్యగా ముందుకువచ్చి, గ్రాంధిక భాషావాదులు కొ్రిపుల్లో దాచుకున్న పిలకలను, అంగిట్లో ముడుచుకున్న నాలుకలను బయటపెట్టడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో గిడుగు సంస్మరణ, వాడుకభాషపై ఆలోచన, చర్చ ఎంత ఆదరణీయమో చెప్పనక్కర్లేదు.

గురజాడ సంస్మరణ సంచిక గురించి రాస్తూ "ఈ సంస్మరణ సంచికకు రమేశ్‌బాబు వ్రాయించిన కొత్త మెటీరియల్ అంతా ఒక ఎత్తు, పాత పత్రికలు, సంపుటాలు, వ్యక్తుల నుంచి సేకరించి ముద్రించిన మెటీరియల్ ఒక ఎత్తు" అని రాసింది ఆంధ్రజ్యోతి 6-5-77 సంచిక.

గిడుగు సంస్మరణ సంచిక కూడ అంత ప్రామాణికంగా, సమగ్రంగా తెచ్చేవాడే రమేశ్.

గిడుగు సంస్మరణ సంచికను సమగ్రంగా తెచ్చి, వాడుక భాషా ఉద్యమంలోని వాడినీ, వేడినీ కాపాడి గ్రాంధిక భాషావాదం నక్కుళ్ళు మళ్ళీ తెరుచుకోకుండా నొక్కివేయడమే రమేశ్‌ను మనసుల్లో పదిలపరచుకునే మిత్రులు చేయాల్సిన పని.

SRJANA Telugu Monthly July 79 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

పోలీసు ఆందోళనపై పియుసిఎల్ & డిఆర్ నిర్వహించిన కార్మిక సంఘాల నాయకుల సమావేశం - తీర్మానం

ఒకవైపున వాళ్ళు కోరిన ఆర్థికమైన, ఇతరమైన డిమాండ్ల నన్నిటిని వెంటనే అంగీకరించడం ద్వారా పోలీసు ఆందోళనలోని న్యాయబద్ధతను గుర్తిస్తూనే పంజాబ్ ప్రభుత్వం మరొకవైపు దాన్ని అణచివేయడానికి తీవ్రమైన చర్యలను వరుసగా తీసుకుంటున్నది.

తమసమస్యలను వ్యక్తం చేసుకోవడానికి అన్నిమార్గాలూ మూసి పోలీసులు వీధుల్లోకి రాకతప్పలేదు. ఎన్నో సంవత్సరాలుగా వాళ్ళు బ్యూరాక్రసీ నిర్లక్ష్యానికిగురై నిశ్శబ్దంగా బాధల్ని సహించారు.

పోలీసుల సమస్యలను సానుభూతితో పరిశీలించాలని పలువురు ప్రముఖులూ ప్రజాసంస్థలూ విజ్ఞప్తిచేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది.

ఈసమస్యపై సరైన నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం 300 మంది పోలీసులను ఉద్యోగాల్లోనుండి తొలగించింది, వెయ్యిమందిని అరెస్టుచేసింది. విచారణలు కూడా కోర్టుల్లోకాకుండా జైళ్ళలో జరుపుతామని బెదిరిస్తున్నది.

ఎమర్జన్సీ నిరంకుశాధికారంవల్ల ఎదురైన ఇటీవలి అనుభవాలదృష్ట్యా అన్ని వర్గాల ప్రజలూ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు పనులపట్ల తీవ్రనిరసనను వ్యక్తం చేయడానికి కలిసికదలాలి.

ఈక్రిందికోర్కెలనువిస్తృతంగా ప్రచారం చేయాలని ఈ సమావేశం ప్రతిపాదిస్తున్నది.

1. పోలీసులు తమ సంఘాలు ఏర్పరచుకునే హక్కుకు గుర్తింపునివ్వాలి.
2. అరెస్టయిన పోలీసులపై కేసులు రద్దుచేసి వారినివెంటనే విడుదలచెయ్యాలి.
3. తొలగించిన పోలీసులందరినీ బేషరతుగా తిరిగి ఉద్యోగాల్లో చేర్చుకోవాలి.

ఈ ప్రచారానికి నాయకత్వం వహించేందుకు మొదటిచర్యగా విస్తృత ప్రాతిపదికపై 'పౌరహక్కుల కార్యాచరణసంఘం' ఏర్పాటుకుమేము ప్రతిపాదిస్తున్నాము.

ఈసంఘంలో ఉపాధ్యాయులూ, విద్యార్థులూ, కార్మికులూ, తదితర సంస్థల సభ్యులుఉంటారు.

తమ వలసవాద వైఖరిని విడనాడి పౌరులను, ముఖ్యంగా పోలీసు కస్టడీలోఉన్న వారిని గౌరవంగా చూడాలని ఈసమావేశం పోలీసు సిబ్బందికి విజ్ఞప్తి చేస్తున్నది.

బి. ఎస్. ధలీవాల్, ప్రధాన కార్యదర్శి
28 మే 1979 పి.యు.సి.ఎల్ & డి ఆర్ చండీఘర్.

SRJANA Rs. 1-50
Hanumakonda, Warangal 506001